జనరాజకీయం కోసం...
రూ॥ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-1 సంచిక - 16 పక్షపత్రిక ఆగస్టు16-31, 2010



## పచ్చని మా పంట పొలాలను కాపాడండి

సోంపేట రైతు

# రైతులకు నష్టం చేసే థర్మల్ ప్లాంట్ తరలించాల్సిందే

# సోంపేట పర్యాటనలో జేపీ



















**అక్కర లేనితనం, ప్రేమింపబడక పోవడం, శ్రద్ధ తీసుకోబడకపోవడం అందరిచేత మరచిపోబడటం - ఇవి ఆకలి కన్నా, అత్యంత పేదరికం కన్నా ఎక్కువ బాధిస్తాయి**

– మదర్ థెరిసా

## లోపలి పేజీల్లో...


థర్మల్ కేంద్రాన్ని తరలించాలి ....................... 5

మున్సి 'పోల్స్' సకాలంలో నిర్వహించాలి........ 8

గనుల లీజుకు అంతర్జాతీయ బిడ్డింగ్.......... 9

మద్య నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలి. 9

కృష్ణానది కరకట్టల బలోపేతం...................... 10

జీవో నం.723 ఉపసంహరించుకోవాలి........ 11

స్వైన్ ఫ్లూ పై ఉదాసీన వైఖరి వీడాలి.............. 11

నైతిక రాజకీయాలు సాధ్యమేనా..................... 12

విద్యార్థి సత్తా శుభారంభం............................ 14

కూకట్‌పల్లి స్కూల్ ప్రాజెక్ట్............................. 15

కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జేపీ పర్యటన......... 16

మార్పు అవసరాన్ని ప్రజలు గుర్తించారు......... 23

అభివృద్ధికి ప్రాతిపదిక గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాల కల్పన......................... 24

ఎవరు దొంగ ............................................ 25

బానిస రాజ్యం పోయి బారుల రాజ్యమా?...... 28

గోడకుర్చీ వేయించాలి................................ 29

జిల్లా వార్తలు.............................................. 30


**సంపాదకీయం**

# పునరేకీకరణకు సమయం

తెలంగాణలో ఉప ఎన్నికలు జరిగిన 12 స్థానాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు. ఉద్రేకపూరిత వాతావరణం ఉన్నా శాంతియుతంగా ఓటు వేసిన ప్రజలకు, నిష్పాక్షికంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల్ని నిర్వహించిన ఎన్నికల సంఘానికి కూడా అభినందనలు.

ఇప్పటివరకూ డబ్బు, మద్యం పంచి ఓటర్లను మభ్యపెట్టి ఎలాగోలా అధికారంలోకి రాగలమని నమ్ముతూ వస్తున్న సారా పార్టీలకు, సాంప్రదాయ రాజకీయానికి ఇక కాలంచెల్లిందని తెలంగాణ తాజా ఉప ఎన్నికల ఫలితాలు విస్పష్టంగా రుజువు చేశాయి. ప్రజలకు రెండు ప్రధాన సాంప్రదాయ పార్టీల పట్ల విశ్వాసం పోయిందని ఈ ఎన్నికల్లో తేలిపోయింది. ఈ రెండు పార్టీలూ ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా విచ్ఛిన్నమైపోయిన పరిస్థితిలో ఉన్నాయి. రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా కూడా సాంప్రదాయ రాజకీయాలకు చివరి ఘడియలు సమీపించాయి. రాజకీయాల్లో పునరేకీకరణకు సమయం ఆసన్నమైంది. మార్పు కోరుకుంటున్నవారంతా ప్రత్యామ్నాయ రాజకీయానికి ముందుకు రావాలి.

సాంప్రదాయ పార్టీల దశ అంతమవుతుండటం వల్ల రెండు రకాల రాజకీయపార్టీలుండే కొత్త శకంలోకి ప్రవేశించాం. మొదటిరకం పార్టీలు వ్యక్తి లేదా కుటుంబం లేదా కులం లేదా ప్రాంతం లేదా ఇతర సంకుచిత అంశాలపై ఆధారపడి ఉంటాయి. ఎటువంటి చెప్పుకోదగిన సిద్ధాంతం, విధానాలు లేకపోవటం వల్ల ఈ పార్టీలు సంకుచిత, చిచ్చు పెట్టే రాజకీయాలను చేస్తుంటాయి. రెండోరకం పార్టీలు, హేతుబద్ధమైన ఎజెండాతో, నైతిక విలువలతో అందరికీ ఎదిగే అవకాశాల కోసం జాతీయ దృక్పథంతో పనిచేస్తాయి. ఈ రెండోరకం ప్రత్యామ్నాయ పార్టీలు నాణ్యమైన విద్య, ఆరోగ్య రక్షణ, స్థానిక ప్రభుత్వాలకు సాధికారతతో ప్రజల్ని వారి కాళ్ల మీద వారిని నిలబెట్టేందుకు రాజకీయ కృషి చేస్తాయి.

అయితే సంకుచిత, కొన్ని వర్గాల ప్రయోజనాల కోసం పనిచేసే రాజకీయ పార్టీలకు పట్టం కడితే దేశం విచ్ఛిన్నమై అరాచకం ప్రబలే ప్రమాదముంది. "కాబట్టి ఆలోచించే ప్రతి ఒక్కరూ హేతుబద్ధ, నైతిక రాజకీయాల్ని చేసే పార్టీలకు అధికారాన్నిచ్చేందుకు కృషి చేయాలి.

దేశంలో రాజకీయాలు, పాలన జరుగుతున్న తీరుతో విసిగివేసారి పోయిన విజ్ఞులు, ఆలోచనాపరులు అన్ని రాజకీయ పార్టీలలో ఉన్నారు. బైట కూడా ఉన్నారు. వారంతా నిశ్శబ్దాన్ని వీడి **1)** హేతుబద్ధత **2)** నైతికత **3)** జాతీయ దృక్పథం **4)** లౌకికవాదం **5)** ప్రజాస్వామ్య దృక్పథంతో కూడిన రాజకీయాల శకాన్ని ప్రారంభించేందుకు బాధ్యత తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఆ ఐదు సూత్రాల ప్రాతిపదికన వచ్చే కొన్నివారాల్లో రాష్ట్రంతో మొదలుపెట్టి దేశవ్యాప్తంగా విశాల ప్రత్యామ్నాయ రాజకీయాన్ని నిర్మించటానికి లోక్‌సత్తా కృషి చేస్తుంది. *

**మీరు గౌరవాన్ని కోరుకుంటే, ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.** – శామ్యూల్

## లోక్‌సత్తా టైమ్స్ - కొత్త రాజకీయ పక్షపత్రిక

*ఆగస్టు 16-31, 2010 సంపుటి - 1 సంచిక - 16*

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్

ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**


# రాజ్యాంగం

## మత స్వేచ్ఛ (ఆర్టికల్ - 25)

**మనసారా ఆత్మసాక్షిగా నమ్మే విశ్వాసములకు, మత ప్రచారములకు సంపూర్ణ స్వాతంత్ర్యం**

మనసారా ఆత్మసాక్షిగా నమ్మే విశ్వాసాలకు, మత ప్రచారములకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఉన్నది. దేశప్రజలందరికి సరిసమానముగా తాము విశ్వసించే మతమునూ, మతాచారములనూ అనుభవించు స్వేచ్ఛ ఉన్నది. అదే విధముగా ఎవరి మతాన్ని వారు స్వేచ్ఛగా ప్రచారము చేసుకోవచ్చు. అయినప్పటికీ శాంతిభద్రత కొరకు నీతి నియమాల కొరకు ప్రజారోగ్య భద్రత దృష్ట్యా రాజ్యంచేసే చట్టాలకు పై ఉదహరించిన స్వేచ్ఛ లోబడి యుండును. పైగా ఈ హక్కు ఈ పార్టులోని ఇతర ప్రాథమిక హక్కులకు లోబడి ఉండవలెను.

**ఈ ఆర్టికల్‌లోని అంశములు ఏ విధముగా ఉన్నా అవి ఏవీ :**

ఎ) ఆర్థిక, విత్తీయ, లౌకిక అవసరముల నిమిత్తం మతపరమైన కార్యకలాపాలను నియంత్రణ చేసిన చట్టములు అనగా ఇప్పటికీ అమలులో ఉన్న చట్టములు కొనసాగుటకు భంగకరము కావు. మరియు అవి ఏవీ ఇకముందు కూడా అటువంటి చట్టములను చేయు రాజ్యాధికారమునకు అడ్డురావు.

బి) సాంఘిక సంక్షేమం నిమిత్తం సంఘ పురోగతి కొరకు లేక హిందూ దేవాలయ ప్రవేశమును సార్వత్రికం చేసిన చట్టముల కొనసాగుటకు భంగపరచవు. మరియు అవి ఏవీ ఇకముందు కూడా అటువంటి చట్టములను చేయు రాజ్యాధికారముకు అడ్డురావు.

**మీరూ రాయండి :** *లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.*

**సాహిత్యం ప్రతిభా సంపన్నుల పెట్టుబడి. ఆ తరువాత కాలంలో అది మంచి ఫలితాలను ఇస్తుంది** – జాన్ బర్రోస్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.


### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్ | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజీ | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు


### మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా


ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com


### లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ- మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500


బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**
ఫొటోలు : **ఎన్. సంజీవ్ కుమార్**

## సోంపేట

# థర్మల్ కేంద్రాన్ని తరలించాలి

■ నేర సమానమైన నిర్లక్ష్యం ఉంది - ఒకే జిల్లాలో ఇన్ని ప్రాజెక్టులు అసాధారణం - సోంపేట ఘటన రాష్ట్రానికే గుదిబండ

"వేలమంది జీవితాలతో ముడిపడి ఉన్న అంశాన్ని జిల్లా కలెక్టర్‌తోసహా ప్రభుత్వ యంత్రాంగం చాలా నిర్లక్ష్యం చేశారు. గోటితో పోయేదానికి గొడ్డలి వరకు తెచ్చారు. మాకు అధికారులపై వ్యక్తిగత ద్వేషం లేదు. అయితే థర్మల్‌ను వ్యతిరేకిస్తున్న వారి గోడు పట్టించుకోవాలన్న స్పృహ జిల్లా యంత్రాంగానికి లేకపోవడం గర్హనీయం. ఒక సంవత్సరానికి పైగా ఆందోళన జరుగుతున్న విషయం ఇక్కడెంతో కీలకం. ఇంతకాలం సమస్య పరిష్కరించడంలో తాత్సారం చేసిన జిల్లా అధికారులు ఇప్పుడు దీన్ని లా అండ్ ఆర్డర్ సమస్యగా చిత్రీకరించారు. ఇది కేవలం సోంపేటకే పరిమితం కాదు. ఈ సంఘటన రాష్ట్రంలో పారిశ్రామికీకరణకు గుదిబండగా మారింది. నేర సమానమైన నిర్లక్ష్యం ఇందులో ఉంది. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. ఖచ్చితంగా ఈ థర్మల్ ప్రాజెక్టు ఆగాల్సిందే.. ఆగుతుంది కూడా!" అంటూ లోక్‌సత్తా పార్టీ అధినేత డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ శ్రీకాకుళం జిల్లా సోంపేట పర్యటనలో తన అభిప్రాయాన్ని కుండబద్ధలు కొట్టారు.

సోంపేట థర్మల్ ప్రాజెక్టు నిర్మాణంపై పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తి ప్రజాపోరాటం జరిగిన క్రమంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఈ క్రమంలో లోక్‌సత్తా అధినేత జేపీ బీల, పలాసపురం, లక్కవరం, సోంపేటల్లో పర్యటించారు. ఏదో రాజకీయ పర్యటనలు చేసేలా కాకుండా సవివరంగా, శాస్త్రీయంగా అధ్యయనం చేయడంతో పాటు, ఆ రోజు జరిగిన ఘటన... అంతకు ముందు జరిగిన ఉద్యమం, జిల్లా అధికారులు వ్యవహరించిన తీరు.. ఎన్.సి.సి. యాజమాన్యం వైఖరి... పర్యావరణ నేతల ఆందోళన... ఇలా అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించారు. దీనికితోడు ప్రత్యక్షంగా బీల ప్రాంతానికి వెళ్లడంతోపాటు ఎర్రమట్టి కొండపైకి ఎక్కి వేల ఎకరాల పచ్చని బీలను పరిశీలించారు. ఈ సందర్భంగా సోంపేట ఘటనతో పాటు థర్మల్ ప్రాజెక్టు ఇబ్బడిముబ్బడిగా ఒకే జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన అగత్యం, అవసరం లేదంటూ జె.పి. స్పష్టం చేశారు. రాష్ట్రం మొత్తం మీద జెన్‌కో అత్యధికంగా విద్యుత్ పంపిణీ జరుపుతుంటే, మరో వైపు గ్యాస్ ఆధారిత ప్రాజెక్టులు రాష్ట్రంలో వస్తుంటే... ఇంత బలవంతంగా థర్మల్ ప్రాజెక్టును ఎందుకు ఏర్పాటుచేయాల్సివచ్చిందో జిల్లా అధికారులు, ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి వుందన్నారు. థర్మల్ ప్రాజెక్టులకో, పారిశ్రామికీకరణకో మేము వ్యతిరేకం కాదని జె.పి. చెప్పారు. ప్రజల గోడును పట్టించుకోకుండా ఇంతకాలం తాత్సారం చేయడం వలన ఇప్పుడది వారికి పెనుభారంగా మారిందన్నారు. సోంపేట థర్మల్ ఆందోళన విషయంలో జిల్లా యంత్రాంగం చర్యల వలన పోలీసులకు, ప్రజలకు మధ్య తీవ్ర అగాధం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల జీవితాలకు, అభివృద్ధికి మధ్య పెద్ద అంతరాన్ని సృష్టించారన్నారు. సంవత్సరంలో సుమారు 10 నెలలు పూర్తిగా నీరు ఉన్న బీల ప్రాంతం థర్మల్‌కు పనికొస్తుందని సర్టిఫికెట్లు ఎలా ఇచ్చారని ఆయన ధ్వజమెత్తారు. ప్రజల భావాలను వక్రీకరించిన యంత్రాంగం అన్నీ వారు చేసి ఇప్పుడు లా అండ్ ఆర్డర్ సమస్యగా చిత్రీకరించి పోలీసులకు ప్రజలకు మధ్య పూడ్చలేని అగాధాన్ని సృష్టించడం ఘోరమైన తప్పిందంగా జె.పి. పేర్కొన్నారు. పాలనా యంత్రాంగం పూర్తిగా విఫలమైన తీరు క్షమించరాని నేరంగా జె.పి తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామికీరణకు గుదిబండగా, ప్రజలకు పెనుభూతంగా సోంపేట ఘటన రూపుదిద్దుకుందని ఆయన చెప్పారు. కనీసం రాష్ట్ర అవసరాలకు ఉపయోగం లేని మర్చంట్ పవర్‌ప్లాంట్‌ల కోసం, వేరే రాష్ట్రాలకు విద్యుత్ అమ్ముకునేందుకు పచ్చని బీల ప్రాంతాన్ని, ఆ ప్రాంత ప్రాణాలను బలిపెట్టడం హేయమైన చర్య అన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయమూర్తిని ఈ ఘటనపై విచారణకు నియమించాలని, 90 రోజుల్లో తీర్పు వచ్చేలా చూడాలన్నారు. రాష్ట్రంలో థర్మల్ ప్రాజెక్టుల ఏర్పాటుకు నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీని తక్షణమే ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని, ఈ థర్మల్ ప్రాజెక్టు ఆపేందుకు శాయశక్తులా కృషి చేస్తామని ఇన్ని థర్మల్ ప్రాజెక్టులు ఇక్కడ ఏర్పాటు చేయడంపై అధ్యయనం చేస్తామన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రిని కలుస్తానని, అవసరమైతే కేంద్రస్థాయిలో కూడా దీనిపై పోరాడతానని జె.పి. స్పష్టం చేశారు.

### ఇది మరో జలియన్‌వాలాబాగ్

సోంపేట మండలం బీల ప్రాంతంలో జూలై 14న జరిగిన ఘటన జలియన్‌వాలా బాగ్‌ను తలపించిందని లోక్‌సత్తా పార్టీ జాతీయ కన్వీనర్ జయప్రకాశ్ నారాయణ అన్నారు. ఈ రోజుల్లో, ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి ఘటన జరగడం సిగ్గుచేటన్నారు. బీల ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మిస్తే తమకు అన్ని విధాలా నష్టం, పర్యావరణానికి హాని జరుగుతాయని ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తూ ప్లాంట్ పనులను శాంతియుతంగా

అడ్డుకునేందుకు నిరాయుధులుగా వచ్చిన ప్రజలపై పోలీసులు నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరపడం, పోలీసులతోపాటు ప్రైవేటు వ్యక్తులు మహిళలు, వృద్ధులను కొట్టడం అత్యంత హేయమని, చట్ట విరుద్ధంగా వ్యవహరించారని విమర్శించారు. జిల్లా పాలనా యంత్రాంగం జీవచ్ఛవంలా తయారైందన్నారు. కొందరు ప్రైవేటు వ్యక్తుల లాభార్జన కోసం ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు సమర్పించడం వల్లే దుర్ఘటన జరిగిందన్నారు. ఫలితంగా ఇద్దరు అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది గాయాల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలకు ప్రభుత్వం పూనుకోవడం దురదృష్టకరమని విమర్శించారు.

## మీ ఉద్యమం... దేశానికే ఆదర్శం

థర్మల్ ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఈ ప్రాంత ప్రజలు ఏకతాటిపై ఉద్యమించటం తనకెంతో నచ్చిందన్నారు. అందువల్లే మీ అందరినీ చూసేందుకు సోంపేట వచ్చానని చెప్పారు. ఇంత స్ఫూర్తితో చేపడుతున్న ఉద్యమం యావద్దేశానికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ అధికారులు జీతం తీసుకుంటున్నది ప్రజలు కట్టే పన్నుల నుంచే గాని ప్రైవేటు వ్యక్తుల సొమ్ము నుంచి కాదన్న సంగతిని గుర్తించాలన్నారు. ఉదయం తాను పలాసపురం, లక్కవరం, సోంపేటల్లో పర్యటించినప్పుడు ప్రజలు 'ప్రాణాలైనా అర్పిస్తాం, ప్లాంట్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని' దృఢంగా చెప్పారన్నారు. దీన్నిబట్టి వారిలో ఎంత ఆవేదన ఉందో అర్థమైందన్నారు. రాష్ట్రంలో ఎన్నో చోట్ల రావణ కాష్ఠాన్ని పెంచిపోషిస్తున్నది, రాజకీయమేనని విమర్శించారు.

## ఎన్‌టీపీసీ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

థర్మల్ పవర్ ప్లాంట్లను ఎన్‌టీపీసీ అధికారులు నిర్వహిస్తున్న తీరు పట్ల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని జేపీ అన్నారు. ఎన్‌టీపీసీ అధికారులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీపీసీ ప్లాంట్ల వద్ద బూడిద నిల్వ కేంద్రాల నిర్వహణ చాలా దారుణంగా ఉందన్నారు. దీనివల్ల ప్రజలకు, పర్యావరణానికి ఎంతో నష్టం జరుగుతోందన్నారు. ప్రజలకు, పర్యావరణానికి నష్టం కలిగించే పరిశ్రమలను లోక్‌సత్తా పార్టీ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. విద్యుత్ వల్ల దేశం అభివృద్ధి చెందుతుందని, అయితే జనావాసాలు, సారవంతమైన భూముల్లో ప్లాంట్ల నిర్మాణం చేపట్టకూడదన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

బీల ఘటనలో మృతి చెందిన గున్న జోగారావు (పలాసపురం), గొనప కృష్ణమూర్తి (లక్కవరం) కుటుంబాలను లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా జోగారావు పిల్లలతో ఆయన మాట్లాడుతూ ఉద్యమం కోసం ప్రాణాలు అర్పించిన మీ తండ్రి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. జోగారావు భార్య జగదాంబ మాట్లాడుతూ పిల్లల చదువుకు సహాయం చేయాలని కోరారు. బీలలో పవర్‌ప్లాంట్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు. జోగారావు ఇంటి నుంచి బయటకు వస్తుండగా పెద్దసంఖ్యలో మహిళలు జేపీని చుట్టుముట్టారు. ప్లాంట్ నిర్మాణం జరగకుండా చూడాలని కోరారు. ప్లాంట్ నిర్మిస్తే అన్నివిధాలా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జేపీ బీల ప్రాంతాన్ని పరిశీలించారు. తర్వాత బారువ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. గొలగండి, రామయ్యపట్నం, ఇసకలపాలెం గ్రామాల్లో పర్యటించి సోంపేట పట్టణానికి చేరుకున్నారు.

## జీవితాలను నాశనం చెయ్యవద్దు

అభివృద్ధి పేరుతో ప్రజా జీవితాలను నాశనం చేయొద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నామని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. పట్టణంలోని రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించారు. గాంధీ మండపం జంక్షన్ వద్ద రాత్రి ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ప్రసంగించారు. బీల భూములపై దిగువ స్థాయి నుంచి పై స్థాయి వరకు అధికార యంత్రాంగం తప్పుడు నివేదికలు ఇచ్చిందని ధ్వజమెత్తారు. అధికారులు రాజకీయ నాయకుల అడుగులకు మడుగులు వత్తారని మండిపడ్డారు. అభివద్ధికి తాము వ్యతిరేకం కాకపోయినప్పటికీ, ప్రజా జీవితాన్ని నాశనం చేసే కాలుష్య కారక పరిశ్రమల స్థాపనను వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాంత ప్రజల ఆర్తనాదాలు, ఆందోళనలు పట్టించుకోకుండా జిల్లాకు చెందిన రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జిల్లా కలెక్టర్‌లు ఎన్‌సీసీ కంపెనీకి తాబేదార్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఇక్కడి పరిస్థితులను సమన్వయ పరచకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. చిత్తడి నేలలను బీడు భూములని నివేదికలు ఇచ్చిన అటవీ శాఖాధికారులకు ఇప్పుడు మళ్లీ అవి చిత్తడి నేలలుగా కనిపించాయా? అని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా శాంతియుతంగా న్యాయపోరాటం చేస్తున్న ఉద్యమాన్ని దుర్మార్గమైన ప్రభుత్వం, అధికార యంత్రాంగం పట్టించుకోక అమాయకులపై కాల్పులు జరిపిందని ధ్వజమెత్తారు. లాఠీచార్జీ బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఈ దమనకాండపై రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల తరపున పోరాటం సాగిస్తున్న పర్యావరణ పరిరక్షణ సమితి, తీరప్రాంత మత్స్యకార ఐక్యవేదికలకు లోక్‌సత్తా పార్టీ పూర్తి సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. సభలో పర్యావరణ పరిరక్షణ సంఘం ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, నాయకులు వై. కృష్ణమూర్తి, కె. వెంకటరావు, పి. కామేష్, తీరప్రాంత మత్స్యకార ఐక్యవేదిక అధ్యక్షుడు వాసుపల్లి కృష్ణారావు, ప్రతినిధులు ఎం. రాజారావు, వి. కృష్ణ, లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబ్జీ, జిల్లా కార్యదర్శి బి.జగదీష్, యువసత్తా రాష్ట్ర కార్యదర్శి పంచాది రాంబాబు, కంచిలీ జెడ్పీటీసీ సభ్యుడు కుణితి వెంకటేశ్వరరావు,

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, మద్దు రాజారావు, సూరాడ చంద్రమోహన్, టీడీపీ నేత పిరియా రాజారావు, తడక చంద్రయ్య, తెలుకుల గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కరుణించిన వరుణుడు

జయప్రకాష్ నారాయణ బీల ప్రాంతంలో పర్యటిస్తున్న సమయంలో సోంపేట పట్టణంలో భారీ వర్షం కురిసింది. కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న బీలలో కనీసం చినుకు కూడా పడకపోవడం విశేషం. అలాగే సోంపేట గాంధీ మండపం జంక్షన్ వద్దబహిరంగ సభ నిర్వహించే సమయానికి వర్షం పూర్తిగా తగ్గిపోయింది.

సాక్షి, శ్రీకాకుళం

**సోంపేట థర్మల్ కేంద్రాన్ని తరలించాలి**

**థర్మల్ కేంద్రాలు, సెజ్‌లు, పారిశ్రామిక వాడలపై ప్రభుత్వ వైఖరి పునః సమీక్షించాలి**

థర్మల్ విద్యుత్ కేంద్రాలు, సెజ్‌లు, పారిశ్రామిక వాడల ఏర్పాటుపై ప్రజలలో పెల్లుబుకుతున్న నిరసన జ్వాలలకి ప్రభుత్వ అనాలోచిత చర్యలే కారణంగా లోక్‌సత్తా పార్టీ భావిస్తున్నది. వీటిని ప్రజలపై ఏకపక్షంగా రుద్దాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే పరిస్థితి మరింత విషమిస్తుందని లోక్‌సత్తా పార్టీ హెచ్చరిస్తున్నది. దీనికి ఉదాహరణగా శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలంలో నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్ (యన్.సి.సి.) నిర్మించ తలపెట్టిన థర్మల్ పవర్ ప్రాజెక్టుపై తలెత్తిన ప్రజాగ్రహం మనందరికి తెలుసు, జూలై 14న జరిగిన కాల్పుల్లో ఇద్దరు చనిపోగా వందలాది మంది గాయపడ్డారు. ప్రజల భూములకు, ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వని ప్రభుత్వం ప్రతిష్టకు పోయి, శాంతి భద్రతల సమస్యలు సృష్టించింది. సోంపేట ప్రస్తుతం రావణకాష్టంలా రగులుతూనే ఉంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి పర్యావరణాన్ని కాపాడే భూములతో పాటుగా, రెండు పంటలు పండే భూములను ప్రజలకు అప్పచెప్పి థర్మల్ పవర్ ప్రాజెక్టును అక్కడ నుండి తరలించాలని లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతిష్టకు పోకుండా, అణచివేత చర్యలకు స్వస్తి చెప్పి తన విధానాలను పునఃసమీక్షించుకోవాలని అందరికీ ఆమోదయోగ్యమైన పద్ధతులతో పారిశ్రామికాభివృద్ధికి, విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవలసిందిగా లోక్‌సత్తా డిమాండ్ చేస్తున్నది.

**నిర్దిష్టమైన మార్గదర్శకాలు ప్రకటించాలి.**

ఎ. విద్యుత్ కేంద్రాల కోసం, సెజ్‌లకోసం, పరిశ్రమల కోసం రెండు పంటలు పండే భూముల సేకరణను నిషేధించాలి.

బి. పర్యావరణానికి, జీవ్యావరణానికి హానికలిగించే ప్రత్యేక ప్రాంతాలలో భూముల సేకరణను నిషేధించాలి.

సి. కాలుష్య నివారణకు, ఆ ప్రాంతవాసుల ఆరోగ్యానికి, పంటలకు పర్యావరణానికి హాని జరగకుండా కట్టు దిట్టమైన రక్షణ చర్యలు తీసుకున్న తర్వాతే ఉత్పత్తికి అనుమతించే నిర్దిష్టమైన హామీని ప్రభుత్వం ప్రకటించాలి.

**రైతులకు, నిర్వాసితులకు బహుముఖ పరిహారాలు**

ఎ. భూసేకరణలో రైతులకు ఇచ్చే పరిహారం మార్కెట్ రేటు కంటే మించి వుండాలి.

బి. భూమికి పరిహారంతో పాటు అదనంగా షేర్ల రూపంలో పరిహారం ఇవ్వాలి.

సి. ప్రతి కుటుంబంలో ఒకరికి తగిన శిక్షణ ఇచ్చి ఉద్యోగం ఇవ్వాలి.

ఇలా రైతుల భవిష్యత్తుకు షేర్ల రూపంలో, ఉద్యోగం రూపంలో శాశ్వత భద్రత కల్పించి తీరాలి. షేర్లు, ఉద్యోగం అవసరం లేదనుకున్న వారికి నగదు రూపంలో పరిహారాన్ని అదనంగా చెల్లించాలి.

డి. భూములు కోల్పోయిన వారికి మాత్రమే పరిహారాన్ని పరిమితం చెయ్యకుండా ఈ భూముల మీద ఆధారపడివున్న గ్రామస్తులందరికీ ప్రత్యేక పరిహార పథకాన్ని వర్తింపజెయ్యాలి. దానితో పాటు గృహవసతి, ప్రత్యామ్నాయ ఉపాధి ఏర్పాట్లు చెయ్యాలి.

**భూసేకరణకు - పరిహారానికి ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చెయ్యాలి.**

మార్గదర్శకాలకు అనుగుణంగా భూసేకరణకు, పరిహారం చెల్లింపులకు తగిన అధికారాలతో ఒక స్వయం ప్రతిపత్తి గల అథారిటీని ప్రభుత్వం ఏర్పాటు చెయ్యాలి. ఇది క్వాజీ జ్యుడీషియల్ సంస్థగా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేదిగా వుండాలి.

సెజ్‌లను రియల్ ఎస్టేట్లుగా మార్చకుండా ఏ పరిశ్రమకు ఎంత భూమి అవసరమో ఈ స్వతంత్ర సంస్థ నిర్ణయిస్తుంది. భూమి కోల్పోయిన వారికి, నిర్వాసితులందరికీ పరిహారాన్ని నిర్ణయించి చెల్లింపులకు బాధ్యత వహిస్తుంది. ఇది పూర్తి అయిన తర్వాత, అన్ని అనుమతులు పొందిన తర్వాత ప్రాజెక్టు పనులకు అనుమతిస్తుంది. అంతిమంగా కాలుష్యానికి, ప్రజారోగ్యానికి భంగం కలగని రీతిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరిగిన తర్వాతే ఉత్పత్తికి అనుమతిస్తుంది. ఇలాంటి విశేషాధికారాల సంస్థ మాత్రమే ఆందోళన చెందుతున్న ప్రజల్ని సంతృప్తి పరుస్తుందని లోక్‌సత్తా పార్టీ భావిస్తున్నది.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త పరిశ్రమలు, విద్యుత్ కేంద్రాల అవసరాన్ని లోక్‌సత్తా పార్టీ గుర్తిస్తుంది. అదే సమయంలో ఇది అందరికీ ఆమోదయోగ్యమైన పద్ధతుల ద్వారా సాధించాలని వాంఛిస్తున్నది. ప్రభుత్వం తక్షణమే ఈ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నది. ప్రభుత్వం మొండిగా తన పాత వైఖరినే కొనసాగిస్తే అది నిరంతర శాంతి భద్రతల సమస్యగా మారి పారిశ్రామికాభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగించేదిగా పరిణమిస్తుందని అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని లోక్‌సత్తా పార్టీ తీవ్రంగా హెచ్చరిస్తున్నది. *

## వర్కింగ్ కమిటీ తీర్మానాలు

# రాజకీయ లబ్ధి కోసమే రాజ్యాంగ ఉల్లంఘన
# మున్సి'పోల్స్' సకాలంలో నిర్వహించాలని లోక్‌సత్తా పార్టీ డిమాండ్

రాష్ట్రంలో అధికారంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం మున్సి'పోల్స్'ను వాయిదా వేయడానికి పూనుకోవడం కేవలం రాజకీయ లబ్ధికోసం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడంగా లోక్‌సత్తా పార్టీ స్పష్టం చేస్తున్నది. 2010 సెప్టెంబరులోగా మున్సిపోల్స్‌ను రాజ్యాంగం ప్రకారం జరిపితీరాలి. 74వ రాజ్యాంగ సవరణ తరువాత నేరుగా ఎన్నికలు వాయిదా వేయడం సాధ్యంకాదు గనుక వెనుకబడిన తరగతుల జనాభా లెక్కలు, మహిళల రిజర్వేషన్లు వంటి సాకులతో వాయిదా వేసి అధికారుల ద్వారా మున్సిపల్ పరిపాలన చేపట్టటానికి దొడ్డిదారిన ప్రయత్నం చేస్తున్నది. స్థానిక ప్రభుత్వాలతో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడానికి ప్రయత్నం చేయవలసిన ప్రభుత్వం ప్రజా ప్రతినిధులను కూడా తప్పించి అధికారుల ద్వారా స్వయంపాలనను నియంత్రించడానికి పూనుకోబోవడం శోచనీయమైన విషయం.

రాష్ట్రంలో మున్సిపాలిటీలకు నేరుగా చైర్మన్‌లను, కార్పొరేషన్లకు మేయర్లను ఎన్నుకునే పద్ధతిని 2005లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే రద్దు చేసి పరోక్ష పద్ధతిని ప్రవేశపెట్టింది. ఈ పరోక్ష పద్ధతి ఎన్నికలతో కార్పొరేషన్లను, కౌన్సిలర్లను బేరసారాలతో, స్థానిక శాసన సభ్యులు ఓట్లతో ప్రజా తీర్పును వమ్ముచేసే రాజకీయ కుట్ర తప్ప వేరుకాదని లోక్‌సత్తా పార్టీ భావిస్తున్నది. కౌన్సిలర్ల కొనుగోళ్లతో ఎన్నికైన చైర్మన్‌లు, తర్వాత ఎలాంటి అవినీతి పాలన అందిస్తారో అందరికీ తెలిసిందే. ప్రజలు నేరుగా చైర్మన్‌ను ఎన్నుకునే హక్కుని తొలగించడంతో పాటు అవినీతికి ద్వారాలు తెరిచే కుట్రగా లోక్‌సత్తా పార్టీ భావిస్తుంది.

ఎక్కడి సమస్యలని అక్కడే పరిష్కారాన్ని చేసుకోవడానికి కౌన్సిలర్ల అధ్యక్షతన వార్డు కమిటీల ఏర్పాటు కోసం చట్టం చేసి సంవత్సరం దాటి పోయినా దానిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం ప్రజల భాగస్వామ్యాన్ని కాలరాచే ప్రయత్నానికి పూనుకుంది. మున్సిపాలిటీలకు వెంటనే నిధులు మంజూరు చేసి మున్సిపాలిటీలో పేరుకు పోయిన సమస్యలకు వెంటనే ముక్తి కలిగించాలని డిమాండ్ చేస్తున్నాం.

**ఆగస్టు 25 - ప్రజా ధర్నా**

1. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు గడువు ముగిసేలోగా ఎన్నికలు నిర్వహించాలి.
2. చైర్మన్, మేయర్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి.
3. మున్సిపాలిటీలకు నిధులు విడుదల చేసి వార్డు కమిటీల ద్వారా స్థానిక సమస్యలను పరిష్కారించాలి.
4. వివిధ మున్సిపాలిటీలలో వున్న ప్రధాన సమస్యలను, స్థానిక వార్డుల సమస్యలపై మెమోరాండం.

ఈ సమస్యలపై ప్రజా నిరసనను వ్యక్తం చెయ్యడానికి ఆగష్టు 25న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపల్-కార్పొరేషన్ కార్యాలయాల ఎదుట ప్రజా ధర్నాలను నిర్వహించాలని లోక్‌సత్తా పార్టీ పిలుపునిస్తోంది. సకాలంలో ఎన్నికలకోసం, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో తక్షణ ప్రజా సమస్యలపై సాగిస్తున్న ఈ ఆందోళనలో పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

**సెప్టెంబర్ 1నుండి 10 వరకు వార్డులలో ప్రజలతో ముఖాముఖి.....**

సెప్టెంబరు 1 నుండి 10వ తేది వరకు మున్సిపాలిటీలు / కార్పొరేషన్ల పరిధిలో ఎంపిక చేసుకున్న వార్డులలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించాలి. పార్టీ నాయకత్వం అంతా ఆయా ఆయా వార్డులలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలందరినీ కలుసుకోవడం కరపత్రాలు పంచడం, వార్డు సమస్యలను గుర్తించడం చెయ్యాలి. పరిష్కారాలపై చర్చించడం చేయాలి. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక పార్టీ నాయకత్వం వార్డులోని ప్రజలందరికి మరింత చేరువకావడం, సమస్యలపై మరింత అవగాహన పెంపొందించుకోవడం, పార్టీకి నూతన కార్యకర్తలను సమకూర్చుకోవడం, ఎన్నికలను ఎదుర్కొవడానికి తగిన వ్యూహాన్ని రూపొందించుకొనే ఉద్దేశ్యాలు నెరవేరాలి. కాబట్టి దానికి తగిన విధంగా కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి. *

## పార్టీరహిత ఎన్నికలైనా స్వాగతిస్తాం

ప్రజలకు పార్టీల అంతర్గత సమస్యలు అనవసరం. వారి నిత్యజీవిత సమస్యలు పరిష్కారం కావటం కోసం స్థానిక ప్రభుత్వాలు సమర్థవంతంగా పనిచేయటం అవసరం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పార్టీ రహితంగా పురపాలక ఎన్నికల్ని నిర్వహించినా లోక్‌సత్తా పార్టీ ఆహ్వానిస్తుంది.

# గనుల లీజులను అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ ద్వారా కేటాయించాలి

■ **ప్రజాధనం లూటీతోపాటు రాజకీయ వ్యవస్థకూ ప్రమాదకరంగా మారిన గనుల విధానం**

గనుల మాఫియా నుంచి రాష్ట్రాన్ని రక్షించటానికి, ఆర్థికలోటులో ఉన్న ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చటానికి రాష్ట్రంలోని గనుల లీజులన్నిటినీ రద్దు చేసి అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ ద్వారా తిరిగి కేటాయించాలి. అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ ధర ప్రాతిపదికన రాయల్టీతోపాటు కాలానుగుణంగా అనూహ్యంగా పెరిగే లాభాలకు అనుగుణంగా విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను కూడా సర్కారు వసూలుచేయాలి. పరిశ్రమలను నెలకొల్పుతున్నారనే సాకుతో ఓబుళాపురం గనుల కంపెనీ, రక్షణ స్టీల్స్ వంటి సంస్థలకు మైనింగ్ ద్వారా లూటీ చేసే అవకాశాన్ని కల్పించారు. అందువల్ల క్యాప్టివ్ మైనింగ్ విషయంలోనూ అదే విధానాన్ని అనుసరించాలి.

ఆంధ్రప్రదేశ్‌లో ముడిఇనుముతోపాటు, బాక్సైట్, గ్రానైట్ వంటి విలువైన సహజవనరులు పెద్దఎత్తున ఉన్నాయి. వాటి విలువ అనేక లక్షలకోట్లు ఉండటంతో వాటి లైసెన్సులు చేజిక్కించుకునేందుకు పెద్దఎత్తున పోటీనెలకొంది. మొదట వచ్చిన వారికే మొదటి కేటాయింపు చేస్తున్న ప్రస్తుత మైనింగ్ లీజు విధానంవల్ల అనూహ్యస్థాయి అవినీతికి ఆస్కారమేర్పడింది. సాధారణ, మధ్యతరగతి ప్రజలు ఒక చిన్న నివాసఫ్లాట్ కొనుగోలు చేయాలంటేనే ప్రభుత్వం బహిరంగ వేలం పాటల్ని నిర్వహిస్తుంది. రాష్ట్ర బడ్జెట్‌కు అనేక రెట్లు ఉండే గనుల లీజుల్ని మాత్రం ప్రభుత్వం అప్పనంగా కొద్దిమంది ఎంపిక చేసిన వ్యక్తులకు ఎలా ఇస్తుంది? డబ్బులు లేవంటూ సర్వశిక్షా అభియాన్‌కు, ఫీజు రీఇంబర్స్‌మెంటుకు కూడా తగినన్ని నిధుల్విడకుండా, ఆదాయం కోసమంటూ మద్యాన్ని విచ్చలవిడిగా పంపిణీ చేస్తూ పేదల నుంచి వేల కోట్లు పిండుతున్న ప్రభుత్వం... గనులలీజులు వంటి భారీ ఆదాయమార్గాల్ని మాత్రం తనకు నచ్చినవారి కోసం గాలికొదిలేసింది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా గనుల విధానంలో దోపిడీకి ఆస్కారమిచ్చే అదే విధానాన్ని అనుసరిస్తూ వస్తున్నాయి. ఇప్పటికైనా ఆ విధానాన్ని మార్చి అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాల్సి ఉంది.

మరోవైపు, గనుల్లో వేలకోట్ల రూపాయల్ని సంపాదించుకున్న దోపిడీదారులు ఆ తర్వాత విచ్చలవిడిగా డబ్బు వెదజల్లుతూ రాజకీయాల్ని శాసిస్తున్నారు. ఎటువంటి విధానాలు, విలువలు లేకపోయినా అనూహ్యస్థాయిలో డబ్బు ఖర్చు చేస్తూ డజన్లకొద్దీ నియోజకవర్గాలలో ఫలితాలను నిర్ణయిస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారు. ప్రజాసంపదను కొల్లగొట్టటంతోపాటు ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరంగా మారిన ఈ గనుల లీజుల విధానాన్ని సమగ్రంగా మార్చాలి. గనుల చట్టంలో సవరణల కోసం తగు సూచనలతో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు లేఖ రాయనున్నారు. *

# కనీసం మద్యనియంత్రణకైనా తక్షణ చర్యలు చేపట్టండి

■ **తమిళనాడును చూసైనా తీరు మార్చుకోండి**

తమిళనాడులో మద్యనిషేధం దిశగా ఆలోచిస్తున్నామని, మద్యంవిధానంపై త్వరలో ఓ మంచి నిర్ణయం తీసుకుంటామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం. కరుణానిధి డీఎంకే అధికార పత్రిక 'మురసోలి'లో చేసిన ప్రకటనను లోక్‌సత్తా పార్టీ స్వాగతిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోలాగా తమిళనాడులో మద్యం దుకాణాలకు వేలంపాటలు లేవు, గుడ్డిలో మెల్ల లాగానైనా మనకంటే మెరుగ్గా అక్కడ మద్యంవ్యాపారం ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తోంది. అలాంటి రాష్ట్రంలో కూడా మద్యనిషేధం గురించి ఆలోచిస్తుంటే మన రాష్ట్రప్రభుత్వం మాత్రం నిస్సిగ్గుగా మద్యాన్ని అంతకంతకూ విస్తరిస్తోంది.

గత ఏడాది వరకూ మద్యవిమోచనకు ప్రచార కమిటీని కనీసం మొక్కుబడిగానైనా రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పుడు ముసుగును పూర్తిగా తొలగించి మద్యాన్ని యధేచ్ఛగా పారిస్తోంది. కొత్త కంపెనీల బ్రాండ్‌లతో, అదనపు డిస్టిలరీలతో అక్రమ బెల్టుదుకాణాల ద్వారా ఊరూరా మద్యాన్ని పారించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మద్యాన్ని లోక్‌సత్తా నైతికాంశంగా చెప్పటంలేదు. కానీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు లేని సమాజంలో విచ్చలవిడిగా మద్యాన్ని అందుబాటులోకి తేవటం వల్ల లక్షలాది పేదకుటుంబాలు ఛిద్రమైపోతున్నాయి. మద్యాన్ని ఆదాయమార్గం చేసుకోకుండానే గుజరాత్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతోంది. అవినీతిని నిర్మూలించి, హేతుబద్ధమైన విధానాలతో ఆదాయాన్ని పెంచుకునే సత్తా కొరవడి ఆదాయం కోసం సిగ్గు, లజ్జ లేకుండా పేదల్ని పీల్చిపిప్పి చేస్తూ మద్యాన్ని విస్తరిస్తున్న ఆంధ్రప్రదేశ్ సర్కారు... గుజరాత్ నమూనాను, తమిళనాడు తాజా వైఖరిని చూసైనా మద్యం విధానంపై పునరాలోచన చేయాలి. కనీసం మద్యనియంత్రణకైనా తక్షణ చర్యలు చేపట్టాలి. తమిళనాడు లోక్‌సత్తా విభాగం కూడా తొలి నుంచీ కఠిన మద్యనియంత్రణ కోసం పోరాటం చేస్తోంది. ఈ అంశంపై దేశవ్యాప్తంగా ఒకే విధానం అమలవటం వల్ల మెరుగైన ఫలితాల్ని సాధించవచ్చు. *

# కృష్ణా కరకట్టల బలోపేతానికి సాయం అందించేందుకు కేంద్రం సంసిద్ధత

■ **ప్రధానికిచ్చిన విజ్ఞాపన పై జేపీకి భారత హోంమంత్రిత్వశాఖ జవాబు**

కృష్ణానది కరకట్టల పటిష్టతకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నిధుల సాయం అందించే ప్రతిపాదనను పరిశీలించేందుకు కేంద్రప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది.

కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు అక్టోబర్ 9, 2010న హైదరాబాద్‌లో ప్రధానమంత్రి డా॥ మన్మోహన్‌సింగ్‌ను కలిసి లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇచ్చిన విజ్ఞాపనపత్రానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి ముళ్లపల్లి రామచంద్రన్ సవివర లిఖితపూర్వక ప్రతిస్పందనను తెలియచేస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు.

కృష్ణానదికి ప్రస్తుతమున్న కరకట్టలు కేవలం 10-11లక్షల క్యూసెక్కుల వరదను మాత్రమే ఆపగలిగే స్థాయిలో మాత్రమే రూపొందించి నిర్మించబడ్డాయని, కానీ అక్టోబర్, 2009లో కనీవినీ ఎరుగనిరీతిలో 25లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది కాబట్టి కృష్ణా కరకట్టలను ఆ స్థాయిలో పటిష్టం చేయాల్సిన అవసరముందని ప్రధానమంత్రిని జేపీ కోరారు.

కరకట్టల బలోపేతంపై రాష్ట్రం సవివర ప్రాజెక్టు నివేదికను పంపితే భారత ప్రభుత్వం తగిన సాయం అందించే అంశాన్ని తప్పక పరిశీలిస్తామని కేంద్ర మంత్రి తెలియచేశారు. ఆ పథకం సాంకేతికంగా, ఆర్థికంగా ఫలవంతమైనదైతే కేంద్ర జలవనరుల శాఖ భారత ప్రభుత్వం నుంచి సాయం అందించటాన్ని పరిగణలోకి తీసుకుంటుందన్నారు.

జాతీయ విపత్తుల సహాయ దళాన్ని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్న జేపీ సూచనపై స్పందిస్తూ, విజయవాడలో జాతీయ విపత్తుల స్పందన దళాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రమంత్రి తెలియచేశారు.

జలవిద్యుత్ తయారీ విభాగాలు వరద తాకిడికి గురికాకుండా చేయాలన్న జేపీ సూచనను పరిగణలోకి తీసుకున్న కేంద్ర మంత్రి, నిపుణుల కమిటీ నిర్దిష్ట ప్రతిపాదనల్ని రూపొందించిందని, వాటిని రాష్ట్రాలకు తెలియచేస్తామని వివరించారు.

వరద నియంత్రణ రాష్ట్రాల పరిధిలోకి వచ్చే అంశం కాబట్టి... వరద పరిస్థితిపై సమీక్షకు, నష్టాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం నిపుణులతో ఒక స్థాయీసంఘాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని కేంద్రమంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో ఉండే కేంద్ర జలవనరుల సంఘం అధికారిని కూడా ఆ కమిటీలో చేర్చుకోవచ్చన్నారు.

భారతదేశంలో అనూహ్యంగా మారుతున్న వాతావరణ మార్పుల నమూనాపై అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటుచేయాలన్న జేపీ సూచనపై స్పందిస్తూ, నీటివనరులపై వాతావరణ ప్రభావాన్ని అంచనా వేసేందుకు భారత జలవనరుల మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఒక నిపుణుల స్థాయీ సంఘాన్ని ఏర్పాటు చేసిందని కేంద్ర మంత్రి తెలిపారు.

## రాష్ట్రప్రభుత్వం అలసత్వం వీడి పునరావాస చర్యల్ని వేగవంతం చేయాలి

వరద బాధితులకు సహాయం అందచేయటంలో రాష్ట్రప్రభుత్వం ఇంకా అలసత్వంతోనే వ్యవహరిస్తోంది. నిర్దిష్ట రీతిలో కేంద్రం నుంచి నిధుల్ని తెచ్చుకుని పునరావాస చర్యల్ని వేగంగా చేపట్టాలి. మేట వేసిన పొలాల్ని తిరిగి సాగుయోగ్యంగా మార్చాలి. కృష్ణా పరివాహక ప్రాంతంలో శాశ్వత వరద నివారణ చర్యల్ని చేపట్టాలి. లోక్‌సత్తా పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా ఐజ మండలంలో దత్తత తీసుకున్న వరద బాధిత గ్రామం కేశవరంలో పాఠశాల గదుల్ని, కర్నూలు జిల్లా పూలతోట పంచాయితీలో రక్షిత మంచినీటి పథకాన్ని, గుంటూరు జిల్లా ఓలేరు పంచాయతీ వెంకట్రాజునగర్‌లో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించి ఇప్పటికే ప్రారంభించింది. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలంలో దత్తత తీసుకున్న దక్షిణ చిరువోలు లంకలో సాగునీటి ఎత్తిపోతల పథకం నిర్మాణం తుదిదశలో ఉంది. *

## గిరిజన ప్రాంతాల్లో రక్షిత మంచినీరు సరఫరా చేయాలి

*రక్షిత మంచినీరు లేకపోవటంతో నీటిఎద్దడి వచ్చినా, కొత్తగా వర్షాలు కురిసినా మన్యంలో అతిసారం, విషజ్వరాలు సాధారణమైపోయాయి. దోమల నుంచి కాపాడుకోవటానికి కనీసం క్రిమిసంహారక మందుతో కూడిన దోమతెరల్ని కూడా పంపిణీ చేయలేని అసమర్థ స్థితిలో ప్రభుత్వం ఉంది. ప్రభుత్వం గిరిజనప్రాంతాలలో కనీస వసతులతోపాటు తగిన సంఖ్యలో ప్రాథమిక వైద్యకేంద్రాల్ని అందుబాటులోకి తెచ్చి శాశ్వత ప్రాతిపదికన వ్యాధుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి.*

# జీవో 723ని బేషరతుగా ఉపసంహరించుకోవాలి : లోక్‌సత్తా

రాష్ట్రప్రభుత్వం బహిరంగ మద్యపానాన్ని నిషేధించే దిశగా చర్యల్ని చేపట్టాలి. దీనికి విరుద్ధంగా ఉన్న జీవో 723ని తక్షణం బేషరతుగా రద్దు చేయాలి. తాగుడే అనర్థదాయకమైతే, బహిరంగ మద్యపానం మరింత ఘోరమైనది.... బార్లు, తదితర చోట్ల బహిరంగ మద్యపానం తాగుడు అలవాటును పెంచటమేకాకుండా, ప్రజాజీవనానికి ఆటంకం, హింసాత్మక, ప్రమాదకర ఘటనలకు దారితీస్తోంది. మద్యం బార్లు ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా జీవో 723 వల్ల పెద్దగా ఏమీ బార్లు పెరగబోవని, మద్యాన్ని ఆదాయమార్గంగా చేసుకోవాలని ప్రభుత్వానికి ఉద్దేశం లేదని ముఖ్యమంత్రి రోశయ్య, మంత్రి బొత్స సత్యనారాయణ ఇచ్చిన వివరణలు వాస్తవాల్ని మసిబూసి మారేడుకాయ చేసే ప్రయత్నమే. ఎన్ని పదాల గారడీలు చేసినప్పటికీ 2011 జనాభా లెక్కలను దృష్టిలో పెట్టుకునే ఈ జీవోను జారీచేశారనటంలో సందేహం లేదు. ఈ జీవో వల్ల ఇప్పటికిప్పుడు కేవలం 10-15శాతం కొత్త బార్లు మాత్రమే వచ్చినప్పటికీ రాబోయే కాలంలో అనూహ్య సంఖ్యలో అదనపు బార్లు ఏర్పాటుతో మద్యాన్ని అధికారికంగా ఏరులయ్యేలా పారించి ప్రజల జేబుల్ని కొల్లగొట్టే భారీ కుతంత్రం అందులో దాగి ఉంది.

త్వరలో రానున్న 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా గణనీయంగా ఉంటుంది. అందుకే పట్టణాల మీద గురిపెట్టి 12,000 మంది స్థాయి నుంచి బార్ ఏర్పాటు చేయనున్నట్టు జీవోలో పొందుపరిచారు. దానికితోడు శరవేగంగా పెరుగుతున్న పట్టణీకరణ వల్ల బార్ల సంఖ్య పెరగటమే తప్ప తగ్గటమనేదే ఉండదు. పట్టణాల్లో బార్లు, పల్లెల్లో అనధికార బెల్టుదుకాణాలతో మద్యాన్ని సాధ్యమైనంత ఎక్కువమందికి అందుబాటులోకి తెచ్చి ఆదాయాన్ని పెంచుకోవటమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యం. కొత్త జనాభా లెక్కల ప్రాతిపదికన అనూహ్యస్థాయిలో బార్లు వస్తాయి. దాంతోపాటు ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్థాయిలో లైసెన్సు తీసుకుని మద్యం దుకాణాలకే సిట్టింగ్ రూంలను పెద్దఎత్తున అనుమతించే దిశగా కూడా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ ప్రయత్నాన్ని కూడా వెంటనే విరమించుకుని బహిరంగ మద్యపానాన్ని పూర్తిస్థాయిలో నిషేధించేందుకు చర్యలు తీసుకోవాలి. ✻

# స్వైన్‌ఫ్లూ పై ప్రభుత్వం ఉదాసీన వైఖరిని వీడాలి

వర్షాలు పడితే ధరలు తగ్గుతాయి, ఎండలు వస్తే స్వైన్‌ఫ్లూ (హెచ్1ఎన్1) తగ్గుతుంది అనే ఉదాసీన వ్యవహారశైలితో ప్రభుత్వం వ్యవహరించటం వల్లే ఈవేళ రాష్ట్రంలో స్వైన్‌ఫ్లూ మళ్లీ పెచ్చరిల్లి ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తోంది. వర్షాకాలం, ఆ తర్వాత వచ్చే చలికాలంలో వాతావరణం చల్లగా ఉండటం వల్ల స్వైన్‌ఫ్లూ ప్రమాదం పెరుగుతుందన్న సాధారణ పరిజ్ఞానంతోనైనా ప్రచారాన్ని పెంచి, నివారణ చర్యలు తీసుకోవటంలో ప్రభుత్వం విఫలమైంది. వ్యాధి బారిన పడే అవకాశమున్న గర్భిణీ స్త్రీలు, మధుమేహం, ఆస్తమా రోగులకు అవగాహన కలిగించి వ్యాక్సిన్ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టలేకపోయింది. కనీసం ప్రభుత్వాసుపత్రుల్లో, నోడల్ ఆసుపత్రుల్లో వైద్యసిబ్బందికి, ఆరోగ్య కార్యకర్తలకు కూడా స్వైన్‌ఫ్లూ వ్యాక్సిన్‌ను, మాస్క్‌లను పూర్తిస్థాయిలో అందించకపోవటం వల్ల వారు కూడా విధులను నెరవేర్చేందుకు జంకే పరిస్థితి నెలకొంది.

మరోవైపు, ఆరోగ్యశ్రీ ద్వారా వందల కోట్ల రూపాయలను ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు మళ్లించిన ప్రభుత్వం... స్వైన్‌ఫ్లూ చికిత్సలో వారి సేవలను తీసుకోవటంలో విఫలమైంది. చాలా కార్పొరేట్ ఆసుపత్రులు ఇప్పటికీ స్వైన్‌ఫ్లూ చికిత్సకు నిరాకరిస్తున్నాయి. కనీసం స్వైన్‌ఫ్లూ వ్యాధి నివారణ ప్రచార కార్యక్రమానికి కూడా ఆ ఆసుపత్రులు బాధ్యత తీసుకోవటం లేదు. అటువంటి ఆసుపత్రుల మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అంటువ్యాధులు వ్యాపించినప్పుడు ప్రైవేటురంగం పరిమితిని గుర్తించి గ్రామస్థాయి నుంచి ప్రభుత్వ వైద్యశాలల్ని, ప్రజారోగ్యాన్ని బలోపేతం చేయాలి. వ్యాధి నివారణపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలి. రాష్ట్రంలో అధికారికంగానే స్వైన్‌ఫ్లూ కేసుల్ని పెద్దసంఖ్యలో గుర్తించారు. ఈ సంఖ్య మరింతగా పెరగకుండా వెంటనే ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. వ్యాక్సిన్లు, చికిత్స ఏర్పాట్లను పటిష్టం చేయటంతోపాటు మాస్‌మీడియా, కరపత్రాలు, ఇతర మార్గాల్లో నిరక్షరాస్యులకు కూడా అర్థమయ్యేరీతిలో పెద్దఎత్తున ప్రచారం చేయాలి. వ్యాధి లక్షణాలున్నవారిని పర్యవేక్షించేందుకు ప్రతిజిల్లాలోనూ హెల్ప్‌లైన్‌లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజలు కూడా ఆందోళనకు గురికావద్దు. సరైన శుభ్రతా చర్యలు తీసుకోవడం, జ్వరం, జలుబు, దగ్గు, తలతిరుగుడు, తుమ్ములు వంటి లక్షణాలున్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించి తగిన రక్షణ జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి అపాయం ఉండదు. స్వైన్‌ఫ్లూ లక్షణాలున్నవారు వ్యక్తిగత జాగ్రత్తలు పాటిస్తూ ఇతరులకు వ్యాపించకుండా తమ వంతు సహకారాన్ని అందించాలి. ✻

# నైతిక రాజకీయాలు సాధ్యమేనా?

సుధీంద్ర కులకర్ణి

ఎటుపోతోందీ ఈ దేశం? పుణ్య ధాత్రి మన భారత్ కాలానికి మార్గగామిగా లేదేమి? లంగరులేని నావలా కాలవాహినిలో కొట్టుకుపోవడం లేదా? సామాజికంగా అంతులేని అశాంతి ఆర్థికజీవనంలో పెరిగిపోతోన్న అసమానతలు సంపన్నులకు మరిన్ని సిరి మూటలు అందిస్తూ సామాన్యుల నోటికాడ కూడును కూడా లాగేస్తోన్న అభివృద్ధి వైనం-ఇవన్నీ నిండు నిజాలు. జాతి గమనం దిశారహితమైపోవడంలో వీటి పాత్ర తక్కువేమీకాదు. అయితే దేశ రాజకీయాలలో నెలకొన్న స్తబ్దతే ఇప్పుడు మనం ఎదుర్కొంటోన్న దుస్థితికి ప్రాథమిక కారణమనేది నిర్వివాదం. ఏదీ అలనాటి జాతీయోద్యమ మహోన్నత లక్ష్యాల స్ఫూర్తి? ఉదయిస్తోన్న నూతన తరాలను సమున్నత పథాలకు తీసుకువెళ్ళగలిగే ఆ అజరామర నవ చేతన ఎక్కడ? ఉత్తేజకరమైన కార్య దీక్షా దక్షతలు ఏ రాజకీయ పక్షంలోనూ కన్పించవేమి? జాతీయ పక్షాలు కాంగ్రెస్, బిజెపి కూడా ఇందుకు మినహాయింపు కాలేకపోతున్నాయి కదా! వీటి మధ్య పెరిగి పోతోన్న పరస్పర విద్వేషం పరిస్థితులను మరింతగా దిగజార్చివేస్తున్నాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈ వైషమ్యాలలో చిక్కుకోకుండా ఉంటాయంటారా?

నిల్వనీరులా అయిపోయిన దేశ రాజకీయాలను గురించి చర్చించుకునేటప్పుడు ప్రాంతీయ రాజకీయపక్షాల గురించి ప్రస్తావించడం కూడా అనవసరమే సుమా. అవి, తమ తమ రాష్ట్రాలలో కీలక పాత్ర నిర్వహిస్తుండవచ్చు గాని జాతీయ రాజకీయాలను ఆరోగ్యవంతంగా ఉంచడంలో నిర్ణయాత్మకంగా వ్యవహరించేలేవు. సరే, ప్రధాన స్రవంతిలోని ఉభయ కమ్యూనిస్టు పార్టీల గురించి చర్చించడమూ ఈ సందర్భంగా ఉపయుక్తమైన విషయం కాబోదు. కాలం చెల్లిన సిద్ధాంతాలను అనుసరిస్తుండడం వలనే అవి దేశ రాజకీయాలలో తమ పాత్రను, ప్రాధాన్యాన్ని అంతకంతకూ కోల్పోతున్నాయి. వాటికి వర్తమానం ప్రోత్సాహకరంగా లేదు భవిష్యత్తు పూర్తిగా నిరాశాజనకం. భారత రాజకీయాలలో ఒకప్పుడు ప్రభాతశీలమైన శక్తిగా ఉండి సకల సామాజిక వర్గాల విద్యావంతులను ఒక నిర్దిష్ట లక్ష్యసాధనా సంకల్పులను చేసిన సోషలిస్టు ఉద్యమం పూర్తిగా తిరోగమించింది. ఆ ఉద్యమ మహానాయకుడు, స్వతంత్ర భారత సమాంతరం మౌలిక రాజకీయ చింతకులలో ఒకరు అయిన డాక్టర్ రామ్‌మనోహర్‌లోహియా శత జయంతి సంవత్సరమిది. మరి ఆయనను మనం ఎలా గుర్తుచేసుకొంటున్నాం? ఆయన స్మృతిని సముచితరీతిలో గౌరవిస్తున్నామా? లోహియాను ఆయన శత జయంతి సంవత్సరంలోనే మనం ఎంత సునాయాసంగా మరచిపోయాం! సోషలిస్ట్ ఉద్యమం నిస్తేజమైపోయిందనడానికి ఇంతకంటే మరో తార్కాణమేముంది?

అమితంగా కలవరపరుస్తోన్న విషయం రెండు జాతీయ రాజకీయపక్షాల- కాంగ్రెస్, బిజెపి- పరిస్థితి, కాంగ్రెస్ వ్యవహారాలు, కేంద్రంలో దాని నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం పరిస్థితి బాహ్య దృష్టికి సజావుగా కన్పిస్తున్నాయి. రెండో యూపీఏ ప్రభుత్వ సుస్థిరతకు ఢోకా లేదు. పండిట్ నెహ్రూ, ఇందిర తరువాత అతి దీర్ఘకాలం ప్రధాని పదవిలో ఉన్న వ్యక్తిగా మన్మోహన్ ఇప్పటికే చరితార్థత సముపార్జించుకున్నారు. ఆయనకిది ప్రశంసనీయమైన విజయం. సోనియా గాంధీ శీఘ్రగతిన సాధించుకున్న రాజకీయ నైపుణ్యానికి కూడా అది ఘనమైన విజయమే సుమా! కాంగ్రెస్ పార్టీలో సోనియా నిర్ణయాలను ప్రశ్నించగల సాహసం ఎవరికీ లేదు ఆమె మాట కాంగ్రెస్ వారికి వేదం. నెహ్రూ, ఇందిర, రాజీవ్‌లు కూడా కాంగ్రెస్‌పై సాధించలేని పట్టును సోనియా సాధించుకున్నారనేది ఒప్పు కోవల్సిన నిజం. ఇన్ని సానుకూలాలు ఉన్నప్పటికీ కాంగ్రెస్‌లోను, దాని సారథ్యంలోని ప్రభుత్వంలోను నెలకొనివున్న ప్రశాంతి దేశాన్ని సరైన దిశలో సత్వరమే మున్ముందుకు తీసుకుపోగల వివేచన, వివేకం, ఆత్మవిశ్వాసాన్ని గాక ఒక స్తబ్ధతను మాత్రమే సూచిస్తోంది.

పాకిస్థాన్‌తో సామరస్య సంబంధాలను నెలకొల్పుకోవడానికి రెండో యూపీఏ ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాలు ఫలించడం లేదు. అమెరికన్ మధ్యవర్తులపై ఎక్కువగా ఆధారపడడమే ఇందుకు కారణంగా చెప్పక తప్పదు. ఇస్లామాబాద్ పాలకులు అమెరికాతో తెలివిగా భారత్ వ్యతిరేక అవగాహన కుదుర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు అందులో భాగంగానే ఆ అగ్రరాజ్యం ఆఫ్ఘాన్ యుద్ధం ఊబిలో పీకలదాకా కూరుకుపోయేలా చేశారు. వాజపేయి, మొదటి యూపీఏ ప్రభుత్వ హయాంలో దూరదృష్టితో చేసిన దౌత్య ప్రయత్నాల ఫలితంగా కాశ్మీర్‌లోయలో నెలకొన్న ప్రశాంత పరిస్థితులు రెండో యూపీఏ ప్రభుత్వం అశ్రద్ధ కారణంగా చెదిరిపోతున్నాయి. మావోయిస్టు తీవ్రవాదం విసురుతోన్న సవాళ్ళను ఎలా ఎదుర్కోవాలనే విషయమై కాంగ్రెస్ పార్టీలోగానీ, ప్రభుత్వంలో గానీ ఏకాభిప్రాయం లేదు.

సమ్మిళిత అభివృద్ధి గురించి మాట్లాడని మంత్రివర్యులెవరైనా ఉన్నారా? మరి దానిని సాధించడానికి చిత్తశుద్ధితో పటిష్ఠ చర్యలు చేపడుతున్నవారు ఎంతమంది? మాటలు ప్రశంసనీయంగా ఉన్నా చేతలు శూన్యమైనప్పుడు ప్రయోజనమేముంది? వేల కోట్ల

రూపాయల వ్యయంతో మరో పేదరికం నిర్మూలనా పథకాన్ని చేపట్టినంత మాత్రాన సమ్మిళిత అభివృద్ధి సిద్ధిస్తుందా? సిద్ధించదని చరిత్ర అనేక నిదర్శనాలు చూపించడం లేదా? ఇప్పుడు అవసరమైంది – అవినీతి, అసమర్ధత, జవాబుదారీతనం లేకపోవడం, ఉన్నతాధికార గణం ఉదాసీనతలకు వ్యతిరేకంగా సుదృఢ వైఖరి, సుస్థిర చర్యలు. కేంద్రంలోను, రాష్ట్రాలలోను చేపడుతోన్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ఘోరంగా విఫలమవడానికి ప్రధాన కారణం ప్రభుత్వ యంత్రాంగంలోని అవినీతి ప్రధాన కారణమన్న వాస్తవాన్ని మనం మరిచిపోకూడదు. ఈ అవినీతి అభివృద్ధిని కుంటుపరచడమే కాదు, భారతదేశపు జీవశోణితమైన (న్యాయవ్యవస్థతో సహా) వివిధ ప్రజాస్వామిక సంస్థలను సైతం భ్రష్టు పట్టిస్తోంది. ఈ దౌర్భాగ్యకరమైన పరిస్థితిపై మన రాజకీయ పక్షాలలో చిత్తశుద్ధితో కూడిన ఆగ్రహం లేకపోవడం ఎంతైనా శోచనీయం. అంతే కాదు గర్హనీయం కూడా. కర్ణాటక, జార్ఖండ్‌లలో ఇటీవల వివిధ సందర్భాలలో బిజెపి వ్యవహరించిన తీరు గమనిస్తే ఆ పార్టీ ఒకప్పుడు దేనినైతే ఆదర్శంగా శిరసావహించిందో దాన్ని ఇప్పుడు త్యజించిందని అర్థమౌతుంది. ఆ ఆదర్శం– ప్రజా జీవితంలో నిజాయితీగా వ్యవహరించడం.

సకల రంగాలలో ముందంజ వేయడానికి వర్తమాన భారతీయ సమాజం ఉవ్విళ్ళూరుతోంది. దేశ రాజకీయాల నేమో ఒక స్తబ్ధత ఆవరించి వుంది. రాజకీయాలు, సమాజం మధ్య ఈ ద్వైధీభావం యువ భారతీయుల – సంపన్నులలోనే కాక పేదవారిలోను, పట్టణ ప్రాంతాలవారిలోనే కాకగ్రామీణ ప్రాంతాలవారిలోను స్పష్టంగా కన్పిస్తోంది. యువ భారతీయుల ఆకాంక్షలు, ఆశయాలు సాకారం కావడానికి రాజకీయ వర్గాలు, పాలనా వ్యవస్థ సరైన విధంగా దోహదం చేయడం లేదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే రాజకీయనాయకులు, పాలకులు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదు. సమగ్ర రాజకీయ, పాలనా సంస్కరణలను తన ఎజెండాగా ఏ ఒక్క రాజకీయపక్షమైనా నిర్దేశించుకున్నదా? ఆ సంస్కరణలు ఆచరణలోకి రాకపోతే 'సమ్మిళిత అభివృద్ధి', 'సామాజిక న్యాయం' 'అందరికీ విద్య, ఆరోగ్యం' ఇత్యాది ఆదర్శాలకు అర్థమేముంది? **నిర్దిష్ట భావాలతో రాజకీయ సంస్కరణల గురించి మాట్లాడుతున్న ఏకైక రాజకీయ పక్షం డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలోని లోక్‌సత్తా పార్టీ ఇంకా బాలారిష్టాలలో ఉన్నది. అయితే అదొక ఆశా కిరణం.**

దేశానికి ప్రస్తుతం కొత్త రాజకీయ నాయకత్వమే కాదు, నైతిక విలువలు ప్రాతిపదికగా గల కొత్త రాజకీయాలూ అవసరం. ఈ కొత్త రాజకీయాలు పాత ప్రవర్తనా రీతులను, పురాతన చింతనా ధోరణులను త్యజించాలి. కాలం చెల్లిన ఆలోచనలు, ఆచరణను విడనాడకపోవడం వల్లే మన రాజకీయ పక్షాలలోని మంచి వ్యక్తులు కూడా సంకుచిత దృష్టికి, స్వార్థపర ప్రయోజనాలకు బందీలైపోయారు. అవినీతిపై పోరాడడానికి సమస్యల సంక్లిష్టతల పట్ల సమగ్ర అవగాహనను చట్ట విరుద్ధ నిర్ణయాలను ప్రశ్నించే ధైర్య సాహసాలను కొత్త రాజకీయాలు సమకూర్చుకోవాలి. అప్పుడే ప్రజాస్వామిక పరిపాలనా సంస్థలు శక్తివంతమైనవిగా, పరిపూర్ణమైనవిగా అలరారుతాయి. ప్రభుత్వ యంత్రాంగాన్ని పాక్షిక ప్రయోజనాలకు ఉపయోగించుకొనే దుష్ట సంప్రదాయాలను అంతమొందించాలి. చరిత్ర నుంచి సంక్రమించిన (పాకిస్థాన్, చైనాలతో) సరిహద్దు వివాదాలతో సహా అన్ని ప్రధాన సమస్యలపై ఏకాభిప్రాయాన్ని సాధించడానికి కొత్త రాజకీయాలు నిబద్ధమవ్వాలి. ఆసియాలోను, విశాల ప్రపంచంలోను అగ్రగామిగా ఆవిర్భవించడానికి ఆ సరిహద్దు వివాదాలే ప్రధాన అవరోధాలుగా ఉన్నాయన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. సరే, ఇంతకూ కొత్త రాజకీయాలు సాధ్యమేనా? స్తబ్ధత సదా సరికొత్త ప్రయత్నాలకు పూనుకోవడానికి ప్రేరేపిస్తుందన్న సత్యాన్ని గుర్తుంచుకోండి. *

**(ఆంధ్రజ్యోతిసౌజన్యంతో)**

## బాబ్లీపై ప్రధానికి విషయ తీవ్రత అర్థమైంది

"రాజకీయ పార్టీలన్నీ ముక్తకంఠంతో చెప్పడం వల్ల ప్రధానమంత్రికి విషయ తీవ్రత అర్థమైంది. ఆయనకు సమస్య లోతుగా అర్థమయ్యేలా చంద్రబాబుతో సహా నాయకులమంతా వివరించాం. ఇంత పెద్ద దేశంలో ఒక్క క్షణంలో ఏ ప్రధాని సమస్యను పరిష్కరించలేరు. తక్షణం అందరికీ ఆమోదయోగ్యమయ్యే స్వల్పకాలిక పరిష్కారం, శాశ్వత ప్రాతిపదికన అందరి ప్రయోజనాలను కాపాడే దీర్ఘకాలిక పరిష్కారం కనుగొనడానికి సమావేశం ఏర్పాటుచేస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. తప్పకుండా ప్రభుత్వాలతో కూర్చుంటానని పేర్కొన్నారు. ఈ క్షణం ప్రధానమంత్రి నుంచి ఇంతకంటే ఎక్కువ ఆశించలేం. ప్రభుత్వాలతో కూర్చుంటామని చెప్పడమంటే ముఖ్యమంత్రులతో మాట్లాడుతామని చెప్పడమే".

## దేవాదాయ శాఖ సహాయ కమీషనర్‌కు ఆదేశం

విజయవాడ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి సంబంధించిన 17 అంశాల సమాచారాన్ని సమాచార హక్కు చట్టం 4(1) (బి) ప్రకారం గత ఏడాది డిసెంబర్ 12 నుండి సమాచారం కోరుతున్నప్పటికీ అధికారులు స్పందించనందున లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి జంపాన శ్రీనివాసగౌడ్ ఫిర్యాదు చేయగా విజయవాడ దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.వి. సురేష్‌బాబును ఆగస్టు 12న రాష్ట్ర సమాచార కమిషన్ ఎదుట హాజరు కావాలని కమిషన్ అసిస్టెంట్ రిజిస్ట్రారు ఉత్తర్వులు జారీ చేసారు.

# విద్యార్థిసత్తా శుభారంభం

ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమౌతోన్న విద్యార్థిసత్తా, తెలంగాణా జిల్లాలలో శుభారంభం చేసింది. ఉస్మానియా, తెలంగాణా, పాలమూరు, మహాత్మాగాంధీ యూనివర్సిటీల పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సుల అడ్మిషన్లకు నిజాం కాలేజీలో జూలై 30 నుంచి ఆగష్టు 3 వరకు జరిగిన కౌన్సిలింగ్ వద్ద విద్యార్థిసత్తా టీమ్ హెల్ప్‌డెస్క్ నిర్వహించి దాదాపు ఆరువేల మంది విద్యార్థులకు సహాయం చేసింది.

తనకు వచ్చిన ర్యాంకుకి ఏ కాలేజీలో సీటు వస్తుందో, కావల్సిన కాలేజీలో సీటు వస్తుందో, రాదో, ఫీజు వేలరూపాయల్లో ఉందా, మొత్తం ఫీజు ఇప్పుడే కట్టాల్సి ఉంటుందా, సర్టిఫికేట్లు అన్ని లేవు, అడ్మిషన్ ఇవ్వరేమో ఇలా అనేక సందేహాలు, భయాలతో వచ్చిన విద్యార్థులు హెల్ప్‌డెస్క్ వద్ద సందేహాలు నివృత్తి చేసుకొని సంతోషంగా అడ్మిషన్లు తీసుకొని వెళ్ళారు.

లోక్‌సత్తా పార్టీకి మొదట్నుంచి కార్యకర్తలుగా ఉన్న సంతోష్ బాబు, వరప్రసాద్, జయంత్ నేతృత్వంలో నిర్వహించబడిన ఈ హెల్ప్‌డెస్క్ ద్వారా విద్యార్థి సత్తా ఈ నాలుగు యూనివర్సిటీలలో, ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లోని పీజీ విద్యార్థుల మధ్య మంచి పేరు సంపాదించుకొంది.

గత సంవత్సరం యువసత్తా పేరుతో నిర్వహించిన హెల్ప్‌డెస్క్ అనుభవం ఈ సంవత్సరం ఎంతగానో ఉపయోగపడింది. అంతేకాక మన కార్యకర్తలు అవినీతి వ్యతిరేక ఉద్యమంలో భాగంగా నగరంలో 40 కాలేజీలకు వెళ్ళడం కూడా ఆయా కాలేజీలలో ఉన్న విద్యా ప్రమాణాలపై ఒక అవగాహన రావడానికి ఎంతో ఉపయోగపడింది. ఏ కాలేజీ మంచిదో, ఏ ర్యాంకుకు ఏ కాలేజీలో సీటు వస్తుందో చెప్పగల సౌకర్యం ఒక్క మన హెల్ప్‌డెస్క్ దగ్గరే ఉండడంతో వాలంటీర్లు ఊపిరి సలపకుండా పని చేయాల్సిన వచ్చింది.

ఈ సమాచారం యొక్క ఉపయోగం అర్థం కావడానికి ఒక ఉదాహరణ చెప్పుకోవాలి. కవిత (పేరు మార్చాము)కి 50వ ర్యాంకు వచ్చింది. కోఠి ఉమెన్స్ కాలేజిలో పేమెంట్ సీటు వచ్చింది. ఆ అమ్మాయి పేమెంట్ సీటుకు కూడా ట్యూషన్ ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఉందన్న విషయం తెలియదు. అలాగే ఆ కాలేజీకి హాస్టల్ వసతి ఉందన్న విషయం తెలియదు. దానితో ఆ కాలేజీలో సీటు వదిలేసి, అంతగా ప్రాధాన్యం లేని కాలేజీలో సీటు తీసుకుంది. అసలు విషయం తెలుసుకొని కన్నీళ్ళు పెట్టుకుంది. ఈ ఘటన జనరల్ సీట్లకు కౌన్సిలింగ్ జరుగుతున్నప్పుడు జరిగింది. వెంటనే ఆ అమ్మాయితో మాట్లాడి ఆ లెక్కన బిసి రిజర్వేషన్ ఉందన్న విషయం తెలుసుకొని, ఆమెకు మరుసటి రోజు కోఠి ఉమెన్స్ కాలేజీలో సీటు వస్తుందన్న విషయం చెప్పినప్పుడు ఆ అమ్మాయి సంతోషాన్ని చూడాలి. విద్యార్థులు ఫీజుకు కావల్సిన డబ్బు, సర్టిఫికేట్లు లేకుండా




వచ్చే వారికి కావల్సిన సమయమిస్తారని చెప్పినప్పుడు, వాళ్ళు ఎంతో సంతోషం వెలిబుచ్చారు. ఎప్పటికప్పుడు కొత్త సమాచారం తెప్పించుకోవడానికి కౌన్సిలింగ్ అధికారులను నిరంతరం సంప్రదించాము.

అనేక మంది విద్యార్థులు కౌన్సిలింగ్ సెకండ్ ఫేజ్‌కు హాజరు కావాల్సిన అవసరం ఉండడంతో వారి ఫోన్ నంబర్లు తీసుకొని దాదాపు 6,000 మంది విద్యార్థులకు ఎస్ఎమ్ఎస్ ద్వారా సెంకడ్‌ఫేజ్ ఎప్పటి నుంచి మొదలౌతుందో తెలియజేయడానికి ఏర్పాట్లు చేశాము.

ఈ కౌన్సిలింగ్ సమస్యలో విద్యార్థులు ఆశలు, అంచనాలు భవిష్యత్ కోసం వారు పడే తాపత్రయం కనిపించాయి. విద్యా వ్యవస్థ పటిష్టంగా లేకపోవడం వారిలో ఎక్కువ మందికి తమ భవిష్యత్ పట్ల పూర్తి భరోసా కనిపించలేదు. (దీనర్థం వాళ్ళేదో బాధగా, దీనంగా ఉన్నారని కాదు!) మన మిత్రుడైన ఒక కౌన్సిలింగ్ అధికారి మాట్లాడుతూ ఈ సైన్సు కోర్సుల్లో ఒక్క కెమిస్ట్రీనే ఉపయోగముంది, మిగిలిన కోర్సులన్నీ నామమాత్రమేనని వాఖ్యానించారు. మన ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్ట పరిస్తే ఇన్ని వేల మంది విద్యార్థులు ఇంత అనిశ్చితిలో ఉండనవసరం లేదుకదా అనిపించింది. ఈ తమ జీవిత ప్రమాణాలకు, రాజకీయాల్లో విలువలకు అతిదగ్గర సంబంధం ఉందన్న విషయం ఈ ప్రజలకు ఎప్పటికి భోదనపడుతుందో ననిపించింది.

కౌన్సిలింగ్ సమయంలో వచ్చిన సంబంధాలతో కాలేజీలలో, ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థిసత్తా టీమ్స్‌ని ఏర్పాటు చేయబోతున్నాము. చివరగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంతోష్‌బాబు, జయంత్, వరప్రసాద్, వాణి, నవీన్ (యువసత్తా టీమ్) ప్రవీన్, సంతోష్ శరత్ చంద్ర (ఉస్మానియా యూనిర్సిటీ) కేశవ్, గంగరాజు, శ్రీహరి, (భద్రుకా కాలేజ్) కృష్ణ (ఐఎమ్‌సి కాలేజ్) నర్సింహరావు, విశ్వ, నిఖిల్ (సిబిఐటి)లకు హృదయపూర్వక అభినందనలు. మనం నిర్వహించిన ఈ హెల్ప్‌డెస్క్ విద్యార్థులకు దగ్గర కావడానికి ఉండే వివిధ మార్గాలను మాకు బోధపరిచింది. *

# కూకట్‌పల్లి స్కూల్ ప్రాజెక్టు-ప్రస్తుత సమాచారం

- కృష్ణప్రసాద్, శేషగిరిరావు

**గత 4 నెలలుగా ఈ ప్రాజెక్టు పై మీద పని నడుస్తోంది.**

**క్లాసు రూమ్‌లు నిర్మాణం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూకట్‌పల్లి నియోజక వర్గంలోని 8 పాఠశాలలో రాష్ట్రీయ విద్యామిషన్ కింద 23 కొత్త తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారి తెలియజేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్కూళ్ళ నిర్మాణాలను డిజైన్ చేయటంలో కూడా మనం పాలు పంచుకుంటున్నాం. డిసెంబర్ 2010 వరకు కొత్త గదులు సిద్ధం అవుతాయి. జిల్లా విద్యాశాఖాధికారి మరో రెండు వారాల్లో 5 స్కూళ్ళు కొత్తగా 30 తరగతి గదులకు రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ పథకం క్రింద అనుమతులు లభించగలవని తెలియచేశారు. మొత్తంగా ఈ సంవత్సరంలో కూకట్‌పల్లిలో 53 తరగతి గదులను నిర్మించనున్నారు.

**కమ్యూనిటీ హాలుగా నడుస్తున్న పాఠశాలలకు శాశ్వత భవన నిర్మాణం**

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో దాదాపు 17 ప్రాథమిక పాఠశాలలు కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో నడుస్తున్నాయి. ఈ భవణాల నిర్మాణం కోసం మనం ప్రభుత్వ స్థలాలను గుర్తించి జి.హెచ్.ఎమ్.సి. కార్పొరేషన్ అనుమతుల కోసం ఒక నివేదిక సమర్పించడం జరిగింది. విషయాన్ని ఫాలోఆప్ చేస్తున్నాము. వచ్చే సంవత్సరం ప్రారంభం నుంచి ఈ భవనాల నిర్మాణం మొదలు కావచ్చు.

**బబ్బుగూడ ఉన్నత పాఠశాలలకు స్థలం కేటాయింపు**

మనం ప్రభుత్వాన్ని మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ దగ్గర ఉన్న ఒక ఎకరం స్థలాన్ని కేటాయించమని అడగడం జరిగింది. ఇప్పటికే అర ఎకరం స్థలం కేటాయించడం జరిగింది. మిగిలిన స్థలం పై ఆ డిపార్ట్‌మెంట్ బోర్డు మీటింగ్‌లో నిర్ణయం తీసుకోనున్నారు. ఇదే విధంగా ప్రక్కనే ఉన్న జి.హెచ్.ఎమ్.సి. స్థలాన్ని మూసాపేటలోని జనతా నగర్ బాలికల స్కూళ్ళకి కావల్సిన తరగతి గదుల నిర్మాణం కోసం జరిగింది. ఈ కేటాయింపు కూడా త్వరలోనే జరగనుంది.

**టాయ్‌లెట్స్**

పాఠశాలల్లో ఇది పెద్ద సమస్యగా తయారైంది. ఈ సంవత్సరం 5 స్కూళ్ళలో 23 కొత్త టాయ్‌లెట్స్‌ను నిర్మించడానికి లక్ష్యంగా పెట్టుకున్నాము. మిగిలిన స్కూళ్ళలో వచ్చే సంవత్సరం నిర్మిస్తాము.

**మధ్యాహ్నభోజన పథకం**

రాష్ట్ర ప్రభుత్వాన్ని నియోజక వర్గ పరిధిలో ఉన్న 46 పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు పరచే బాధ్యతను నాంది ఫౌండేషన్‌కి అప్పగించమని కోరడం జరిగింది. ఈ ప్రతిపాదనకు జిల్లా విద్యాశాఖాధికారి ప్రాథమిక విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు జిల్లా కలెక్టర్ ఆమోదించడం జరిగింది. ఇదే ప్రతిపాదనకై మంత్రి ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాము. ఒకసారి గవర్నమెంట్ ఆర్డర్ వచ్చిన వెంటనే నాందీ ఫౌండేషన్ పనులు మొదలు పెడుతుంది.

**ఆరు పాఠశాలలు దత్తత**

మా స్నేహితుడు ఒకరు పాఠశాలను దత్తత తీసుకొని దానిపై 10 లక్షల రూపాయలు ఖర్చు చేయగలనని ముందు కొచ్చారు. స్కూళ్ళను గుర్తించే ప్రక్రియలో ఉన్నాము.

ఒక ఇటాలియన్ కంపెనీ కూడా ఒక స్కూల్‌ను దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చింది. వారి నిబంధనలకు తగిన స్కూళ్ళను గుర్తించే పనిలో ఉన్నాము అమెరికన్ బ్యాంకు నుంచి ఒక వాలంటీర్ల బృందం పాఠశాల విద్యలో నాణ్యత పెంపొందించేందుకు మనతో కలసి పనిచేయడానికి ముందుకు వచ్చారు. వారు కూడా ఒక స్కూలును దత్తత తీసుకొని వచ్చే సంవత్సరం నుంచి వారి సంస్థ నుంచే నిధులు తెచ్చుకొనే ప్రయత్నాల్లో ఉన్నారు.

**ఇంగ్లీష్ లాంగ్వేజ్ కోర్సు**

కూకట్‌పల్లి హై స్కూల్లో 10వ తరగతి విద్యార్థుల కోసం 2 నెలల వ్యవధి గల ప్రొఫెషనల్ ఇంగ్లీష్ కోర్సులు ప్రారంభించడం జరుగుతుంది. ఈ కోర్సును నియోజక వర్గ పరిధిలోని మిగిలిన 6 హైస్కూళ్ళకు కూడా విస్తరించే పనిలో ఉన్నాము.

**విద్యా ప్రమాణాలు**

కొన్ని స్వచ్ఛంద సంస్థలతోను, వ్యక్తులతోను స్కూళ్ళలో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు చర్చలు జరుపుతున్నాము. ఈ ప్రయత్నాలు ఇంకా కొలిక్కి రావాల్సి ఉంది. ఈ విషయంలో మీ సూచనలు, సలహాలను ఆహ్వానిస్తాము. భవిష్యత్తులో ఈ విషయం పైనే ఎక్కువ సమయాన్ని నిధులను వెచ్చించనున్నాము.

**ఇవి ఇప్పటి వరకు పాఠశాల అభివృద్ధి కొరకు చేసిన పనులు**

ఈ ప్రాజెక్టులో భాగంగా మరికొన్ని కార్యక్రమాల బాధ్యతలను తీసుకొనే వారి కోసం ఎదురు చూస్తున్నాము. మన మందరం కలిసి పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యాప్రమాణాలను ఒక్క కూకట్‌పల్లి నియోజక వర్గంలోనైనా అభివృద్ధి చేద్దాం. డా॥జయప్రకాష్‌నారాయణ్ వంటి ఎమ్మెల్యేగా నిబద్ధత కలిగిన వ్యక్తి, మీలాంటి ఎంతో మంది నాయకులు, కార్యకర్తలతో మనం ఈ నియోజక వర్గంలో అద్భుతాలు చేయవచ్చు. మాకు ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదు. *

# గుంటూరు, కృష్ణా జిల్లాల్లో జేపీ పర్యటన



## మనకేమైనా పిచ్చెక్కిందా...?

### దాచేపల్లి మద్యం దుకాణంపై 'జేపీ' సీరియస్

**గుంటూరు సిటీ:** ముఖ్యమంత్రి రోశయ్య స్వంత జిల్లా అయిన గుంటూరులోని దాచేపల్లిలో ఒక మద్యం దుకాణాన్ని రూ. 5.20 కోట్లకు వేలం పాడారా? ఆ కాంట్రాక్టర్‌ను ఘనంగా సన్మానించారా? ఇదంతా చూస్తుంటే మనకేమైనా సిగ్గు ఉందా? పిచ్చెక్కిందా? అని అనిపిస్తోందని లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ్ ఆవేదన వ్యక్తం చేశారు. జూలై20న సాయంత్రం నగరానికి వచ్చిన ఆయన ఇక్కడి వావిలాల సంస్థలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు.

స్వాతంత్ర్య పోరాట సమయంలో పుట్టి, ఆ తర్వాత రాజకీయ రంగప్రవేశం చేసిన ముఖ్యమంత్రి రోశయ్య ఆనాటి గాంధేయవాదాన్ని పుణికిపుచ్చుకొని ఉంటారనే తాను అనుకొంటున్నానని చెప్పారు. ఉదాత్తమైన భావాలతో ఆయన పరిపాలన కొనసాగిస్తారని తాను భావిస్తున్నానన్నారు. ఆయన స్వంత జిల్లాలోనే మద్యం ఏరులై పారుతుండటం శోచనీయమన్నారు. మద్యం ద్వారా వచ్చే ఆదాయంపై ప్రభుత్వ పాలన ఆధారపడకూడదని స్పష్టం చేశారు. మద్యం విక్రయాల ద్వారా రూ. 17 వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందంటే అంతే స్థాయిలో బీద కుటుంబాలను నాశనం చేయడమేనన్నారు.

కృష్ణానదికి గత ఏడాది వరదలు వచ్చిన సందర్భంలో అదృష్టవశాత్తు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఖాళీగా ఉండటం వలన శ్రీశైలం నుంచి విడుదలైన 25 లక్షల కూసెక్కుల నీటిని చాలా వరకు నింపుకొని కేవలం 10 లక్షల క్యూసెక్కుల నీటినే సముద్రంలోకి వదలడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదేరీతిలో కృష్ణానదికి వరదలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వరద శాశ్వత నివారణ చర్యలకు కేంద్రం రూ. వెయ్యి కోట్లు విడుదల చేస్తే వాటిని కరకట్టలను బలోపేతం చేయడానికి వినియోగించకుండా ఇతరత్రా అవసరాలకు ఖర్చు చేస్తుండటం దారుణమన్నారు. రేపటి రోజున శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు నిండి ఉన్న సమయంలో కృష్ణానదికి వరద వస్తే గుంటూరు, కృష్ణాజిల్లాలు మునిగిపోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అయినా వరదకట్టలను తక్షణమే బలోపేతం చేసే పనులను ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు.

లోక్‌సత్తా ఉద్యమాలు చేపట్టడం లేదని కొంతమంది అంటున్నారు. వారి ఉద్దేశ్యంలో రాస్తారోకోలు, ధర్నాలు చేయడం, బస్సు అద్దాలు పగులగొట్టడమే ఉద్యమం అయితే అవి తాము ఎప్పటికీ చేయబోమన్నారు. ఉద్యమం అంటే ప్రజాసంక్షేమం కోరి చేసేవి అని స్పష్టం చేశారు. కృష్ణానదికి గత ఏడాది వరదలు వచ్చిన సందర్భంలో తాము మహబూబ్‌నగర్ కర్నూలు, కృష్ణ, గుంటూరు జిల్లాల్లో ఒక్కోగ్రామాన్ని దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. ఆ రోజున ఇచ్చినమాట ప్రకారం మహబూబ్‌నగర్‌లో పాఠశాల, కర్నూలులో తాగునీటి పథకం, కృష్ణాలో ఎత్తిపోతల పథకం, గుంటూరులో కమ్యూనిటీ హాల్‌ను తాము పూర్తి చేశాం. ఇదే అసలైన ఉద్యమమని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు ఇబ్బడిముబ్బడిగా ప్రవేశపెట్టిన పథకాలను సమీక్షించుకొని బీదరికాన్ని శాశ్వతంగా తొలగించే పథకాలు చేపట్టాలని డిమాండు చేశారు. ఈ సమావేశంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి, పార్టీ జిల్లా ఇతర నాయకులు పాల్గొన్నారు.

## డబ్బు, మద్యంతో ఓట్లు కొనే నాయకులు వద్దు

### బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయండి కార్యకర్తలకు జేపీ పిలుపు

**గుంటూరు :** రానున్న స్థానిక ఎన్నికల్లో మద్యం, డబ్బుతో ఓటర్లను కొనే నాయకులు తమ పార్టీకి అక్కర్లేదని, ప్రజల కోసం పనిచేస్తూ అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేసే నాయకులు కావాలని లోక్‌సత్తా అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ జూలై 2న అన్నారు. గుంటూరు జిల్లాలో పర్యటించిన అనంతరం సాయంత్రం అరండల్‌పేటలోని వావిలాల కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు సంపాదనే ధ్యేయంగా పార్టీలోకి వచ్చే నాయకులు అవసరం లేదని, ప్రజా సమస్యలపై పోరాడి పరిష్కరించే దిశగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఇతర పార్టీల వలె రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు చేయడం తమ పార్టీ సిద్ధాంతం కాదన్నారు. ప్రజల పక్షాన పనిచేయడం లేదనే విమర్శలు వచ్చాయని, కాని రోడ్లపై ఎక్కి ధర్నాలు చేయడం కాకుండా ప్రతి కార్యకర్త ఒక్కొక్క డివిజన్‌ను దత్తత తీసుకొని

సమస్యలపై అధికారులతో పోరాటం చేసి పరిష్కరించాలన్నారు. పార్టీ సిద్ధాంతాలు, అజెండాను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నీతి నిజాయితీగా పోరాడే పార్టీ లోక్‌సత్తా అన్నారు. సమాజంలో మార్పు రావాలంటే ఓర్పు తప్పనిసరిగా కావాలన్నారు. డబ్బు, మద్యంతో ఓట్లను కొనే నాయకులపై వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. గెలుపోటములు పక్కన పెట్టి ప్రజలు పక్షాన నిలవాలన్నారు. సంప్రదాయ రాజకీయాలు సమాజంలో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాన్ని పార్టీలు వ్యాపారంగా మార్చుకొని పనిచేస్తున్నాయన్నారు. సమాజంలో దశలవారీగా మార్పు వస్తుందని, దీనికి ఉదాహరణ గతంలో జరిగిన ఎన్నికలేనన్నారు. టీడీపీ, కాంగ్రెస్‌లను గత ఎన్నికల్లో లోక్‌సత్తా దెబ్బతీసినట్లు చెప్పారు. కార్యకర్తలు సొంతడబ్బుతో పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రాంతీయత, కులతత్వం తమ పార్టీలో లేవన్నారు. గుంటూరులో మున్సిపల్ ఎన్నికల్లో తప్పకుండా పదిస్థానాలు లోక్‌సత్తా పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు జేపీతో తమ సమస్యలు విన్నవించారు. నగరానికి చెందిన ఒక కార్యకర్త జేపీ ఎమ్మెల్యేగా పనిచేస్తున్న కూకట్‌పల్లిలో అభివృద్ధి జరగడంలేదని చెప్పగా జేపీ తీవ్రస్థాయిలో ఖండించారు. దుష్ప్రచారం చేయడమే ఇతర పార్టీల పని అన్నారు. సీఎం రోశయ్య, చంద్రబాబు తమ నియోజకవర్గాల్లో చేయలేనంత అభివృద్ధి తాను కూకట్‌పల్లిలో చేసినట్లు వివరించారు. కార్యకర్తల సమావేశంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి, మహిళాసత్తా జిల్లా అధ్యక్షురాలు కె. లలితకుమారి, కార్యదర్శి దుర్గాదేవి, జిల్లా యువసత్తా అధ్యక్షుడు విద్యాసాగర్, మాజీ ఇన్‌చార్జి గాంధీ, ఉమామహేశ్వరరెడ్డి, కృపాచార్యులు, సురేష్, శ్రీనాథ్, పద్మారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివనాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు శరత్‌బాబు, ప్రధాన కార్యదర్శి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

**జేపీ సమక్షంలో పార్టీలో చేరిన 500 మంది కార్యకర్తలు**

జయప్రకాష్ నారాయణ సమక్షంలో 500 మంది కార్యకర్తలు పార్టీలో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా జేపీ నూతన కార్యకర్త లకు పలు సూచనలిచ్చారు.

**మహిళాసత్తా నాయకులు అసంతృప్తి**

జయప్రకాష్ నారాయణ తీరు పట్ల మహిళాసత్తా నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పల్నాడులో మద్యం, బెల్టుషాపులపై పోరాటం చేసి దెబ్బలుతిన్న మహిళలను జయప్రకాశ్ నారాయణ పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. ఎంతో పోరాటం చేస్తే జేపీ మాటమాత్రం కూడా పలకరించలేదని మహిళా సత్తా నాయకులు ఆవేదన వ్యక్తం చేసారు.

## మహారాష్ట్ర చర్యలతో దేశ ఐక్యతకే భంగం

**తెనాలి కల్చరల్ :** మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడిపై మహారాష్ట్ర ప్రభుత్వ చర్యలు దేశ ఐక్యతకే గొడ్డలి పెట్టు అని లోక్‌సత్తా అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ అభివర్ణించారు. చంద్రబాబు, తదితరులపై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జూలై 20న తెనాలిలో డా॥ కారుమంచి తుకారం ప్రసాద్ నివాసంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అప్రజాస్వామికం, అనైతికమని అన్నారు. భారతదేశంలో ఎవరు ఎక్కడికైనా వెళ్ళే హక్కును రాజ్యాంగం కల్పించిందని ఆయన గుర్తు చేశారు. బాబ్లీ ప్రాజెక్టు సందర్శించడానికి వెళ్లిన టీడీపీ బృందాన్ని అరెస్టు చేసి అక్రమంగా నిర్బంధించాల్సిన అవసరం ఏమిటని డా॥ జయప్రకాష్ నారాయణ ప్రశ్నించారు. దేశ సమైక్యతను చెడగొట్టే విధంగా మహారాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. ఇలాంటి చర్యలతో దేశంలో హింసాత్మక సంఘటనలు జరిగే పరిస్థితి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితులలో అన్ని పార్టీలు సంయమనం పాటించాలని కోరారు. చంద్రబాబు అరెస్టు వ్యవహారం ఒక రాజకీయ వ్యూహంగా వుందన్నారు. ఆంధ్ర, మహారాష్ట్రలలో కాంగ్రెస్ ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయని ఆయన గుర్తు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వ చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ఖండించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టు విషయమై తాను ముఖ్యమంత్రి రోశయ్య, గవర్నర్ నరసింహన్‌లతో చర్చించానని ఆయన చెప్పారు. నిరాయుధులైన టీడీపీ నాయకులతో బలప్రయోగం, చేయి చేసుకోవడాన్ని డాక్టర్ జయప్రకాష్ నారాయణ తీవ్రంగా ఖండించారు. సమావేశంలో లోక్‌సత్తా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి. ఉమామహేశ్వరరావు, ఎ. గాంధీ, డాక్టర్ శరత్, డాక్టర్ గుమ్మడి సాంబశివరావు, ఎల్. నారాయణరెడ్డి, డాక్టర్ విశ్వేశ్వరరావు, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు జిల్లాలో శాశ్వత భవనాల నిర్మాణం

**వెంకట్రాజునగర్ (భట్టిప్రోలు),** : గత ఏడాది కృష్ణానదికి సంభవించిన వరదలు వల్ల నష్టపోయిన రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో శాశ్వత భవన నిర్మాణాలను లోక్‌సత్తా పార్టీ చేపట్టినట్లు పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం ఓలేరు పంచాయతీ పరిధిలో వెంకట్రాజునగర్‌లో రూ.4.80 లక్షలతో లోక్‌సత్తా పార్టీ నిర్మించిన కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవం జూలై 20న జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బదుగు కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు. జయప్రకాష్ నారాయణ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ వరదల వల్ల నష్టపోయిన కర్నూలు, మహబూబ్‌నగర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో శాశ్వతంగా వుండే విధంగా కమ్యూనిటీ హాల్స్, అదనపు తరగతి గదులను లోక్‌సత్తా పార్టీ నిర్మించిందన్నారు. వరదల సమయంలో వెంకట్రాజు నగర్‌ను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించిన విధంగా కమ్యూనిటీ హాలు నిర్మించినట్లు చెప్పారు. లోక్‌సత్తా పార్టీకి విరాళాలు ఇస్తే ఒక రూపాయి కూడా వృథాగా పోదని పలువురు

దాతలు ఇస్తున్న సహాయంతో రాష్ట్రంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

### విద్యార్థిచే కమ్యూనిటీ హాలు ప్రారంభం

లోక్‌సత్తా ఆర్థిక సహాయంతో నిర్మించిన కమ్యూనిటీ హాలును వెంకట్రాజునగర్‌కు చెందిన 5వ తరగతి విద్యార్థి మామర్తి కార్తీక్ అనే విద్యార్థిచే ప్రారంభించారు. సమాజంలోని మహిళలను, పిల్లలను గౌరవించాలనే ఉద్దేశంతో విద్యార్థి ద్వారా ప్రారంభించినట్లు జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లాశాఖ అధ్యక్షులు నారాయణరెడ్డి, రేపల్లె శాఖ అధ్యక్షులు పర్చూరి సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శివనాగేశ్వరరావు, మహిళాసత్తా జిల్లా అధ్యక్షురాలు కె. లలిత కుమారి, కార్యదర్శి వి. దుర్గాదేవి, గాంధీ ప్రసాద్, శేషగిరిరావు, ఎంపీటీసీ సభ్యులు పెట్ల అర్లప్ప తదితరులు పాల్గొన్నారు.

### దేశాన్ని మార్చేది మనమే....

**పార్టీని బలోపేతం చేయండి... ఎన్నికలకు సిద్ధమవండి... జేపీ సూచన**

**గుంటూరు:** లోక్‌సత్తా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా క్రమశిక్షణ, అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేయాలని పార్టీ అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న పురపాలక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. జూలై20న గుంటూరు జిల్లా లోక్‌సత్తా పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యకర్తల ముందు ఆయన మూడు లక్ష్యాలు ఉంచారు. మున్సిపాలిటీల పరిధిలో కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. వీలైనన్ని ఎక్కువ మున్సిపాలిటీల్లో పోటీ చేసి సత్తా చాటేందుకు సిద్ధంగా ఉండాలని, గుంటూరు జిల్లాలో ఆరు, ఏడు మున్సిపాలిటీల్లోనైనా పోటీ చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 20 అసెంబ్లీ నియోజకవర్గాలను ఎంపిక చేస్తామని, ప్రతి నియోజకవర్గం నుంచి ఒక మండలాన్ని తీసుకుని ప్రతి ఇంటి తలుపూ తట్టి లోక్‌సత్తా కార్యక్రమాల గురించి అవగాహన కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. అలా 20 నియోజకవర్గాల్లో అన్ని మండలాలు పూర్తయిన తర్వాత మిగతా నియోజకవర్గాల్లో ఇదే కార్యక్రమం చేపట్టాలన్నారు. వీలైనంత త్వరగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు పూర్తి చేసుకుని, సంస్థాగత ఎన్నికలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. లోక్‌సత్తా అవసరం జాతికి ఎంతైనా ఉందని, పార్టీ ఆశయాలు, పని తీరుపై ప్రజలకు అపారమైన గౌరవం కూడా ఉందని తెలిపారు. బలమైన రాజకీయశక్తిగా ఎదగడానికి మాత్రం కొంత సమయం పడుతుందన్నారు. తాటాకు మంటలాంటి బలం పార్టీకి అవసరం లేదన్నారు. సంప్రదాయ రాజకీయ పార్టీలను సారా పార్టీలుగా ఆయన అభివర్ణించారు. వాటి పద్ధతులు మనకు వద్దని కార్యకర్తలకు తెలిపారు. రాజకీయం తీరు మారినప్పుడు ప్రజల ఆలోచనల్లో మార్పు వచ్చినపుడే దేశం మారుతుందని పేర్కొన్నారు. "మన లక్ష్యం వేరు. కేవలం పదవులే కావాలనుకుంటే ఇన్ని కష్టాలు పడాల్సిన అవసరం లేదు. సమాజంలో మార్పు తేవాలనుకుంటే దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధపడాలి. దీనికి ఎన్నేళ్లయినా పట్టొచ్చు. కానీ దేశాన్ని మార్చడంలో విజయం మనదే. అయితే మనం రాజకీయ శక్తిగా ఎదగడానికి కొంత సమయమైతే పడుతుంది. **"రాష్ట్ర శాసనసభలో ఒక్కగొంతు వినిపించే అవకాశం ప్రజలు మనకు ఇచ్చారు. అప్పుడప్పుడూ ఒంటరితనం ఫీలవుతుంటాను. ఒక్క గొంతుతోనే ఎన్నో అద్భుతాలు చేస్తున్నాం. అదే పది గొంతులు కలిస్తే రాష్ట్ర స్వరూపమే మార్చగలం"** అని తెలిపారు. ఈ జాతికి ఉన్న ఒకే ఒక్క ఆశా కిరణం లోక్‌సత్తా పార్టీయేనని, దాన్ని మనం కాపాడుకోలేకపోతే వచ్చే 30 ఏళ్లలో ఎవరూ ఇలాంటి ప్రయత్నం చేయలేరంటూ ఆయన కార్యకర్తల్ని ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఓటు అమ్ముకున్నంత కాలం అధోగతే

**ఓలేరు :** ఓటుకి నోటు తీసుకున్నంత కాలం సమాజాభివృద్ధి చెందదని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ అన్నారు. మండలంలోని ఓలేరు గ్రామాన్ని లోక్‌సత్తా పార్టీ దత్తత తీసుకుని వెంకటరాజ్‌నగర్‌లో సామాజిక భవనాన్ని నిర్మించారు. జూలై 20న ఆ భవనాన్ని గ్రామానికి చెందిన వై. కార్తీక్ అనే విద్యార్థితో ప్రారంభం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచి బడుగు కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. జేపీ మాట్లాడుతూ పౌరులు ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే పేదరికం బయటపడుతుందని చెప్పారు. ఇంటి ముందు ప్రభుత్వం కంటి ముందు పాలనే తమ ధ్యేయమని తెలిపారు.తమ పార్టీ కార్యకర్తల పనితీరు బాగుందని, ఓలేరులో భవనం, కర్నూలులో సురక్షిత మంచినీరును ప్రజలకు అందించగలిగామని తెలిపారు. కృష్ణా ఎడమ, కుడి కరకట్టల ఎత్తును పెంచాలని ప్రభుత్వానికి సూచించినట్లు చెప్పారు. తొలుత కమ్యూనిటీ భవనం, చర్చి, పాఠశాల ముందు నిల్వ ఉన్న మురుగు చూసి స్పందించారు. ఈ ప్రాంతంలో మెరకలు వేసేందుకు ట్రాక్టర్ ఖర్చును పార్టీ అందజేస్తుందని హామీనిచ్చారు. మహిళలతో మద్యం దుకాణాలు ఎత్తివేయించే విధంగా వాగ్దానాలు చేయించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఓ. నారాయణరెడ్డి మహిళ సత్తా అధ్యక్షురాలు కె. లలితకుమారి, జిల్లా కార్యదర్శి కె. దుర్గాదేవి, జిల్లా కమిటీ సభ్యులు శివనాగేశ్వరరావు, గాంధీప్రసాద్, వజీర్, ఎంపీటీసీ సభ్యులు పి. హర్లప్ప, గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

### సామాజిక భవనం ప్రారంభం

మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టును పరిశీలించడానికి వెళ్లిన తెదేపా

అధినేత చంద్రబాబును, ఇతర నాయకులను అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు. మండలంలోని ఓలేరులో పార్టీ నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆయన జూలై 20న ప్రారంభించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ఈ ఏడాది మద్యంపై రూ.16 నుంచి 19 వేల కోట్లు వచ్చిందంటే సామాన్యమైన విషయం కాదని అన్నారు. రోజుకి మద్యం, ఇతర ఖర్చులతో ప్రజల నుంచి రూ॥ వంద కోట్లు ఆదాయం వస్తుందంటే వారి జీవితం ఎలా బాగుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల నుంచి అవినీతి కట్టలు తెంచుకుందని విమర్శించారు. అధికారుల్లో కూడా వెయ్యి కోట్లు అవినీతి బయటపడుతుందంటే పాలన ఎలా వుందో అర్ధమవుతుందని అన్నారు. అవినీతి పరులు ఆస్తులు జప్తు చేస్తే ప్రభుత్వ ఖజానా నిండుతుందని సూచించారు.

### శాంతియుతంగా పోరాడుదాం

**కొరిటెపాడు :** నిరాహారదీక్షలు బంద్‌లు, రాస్తారోకోలతో సమస్య పరిష్కారం కాదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ అభిప్రాయపడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, పార్టీ నేతల అక్రమ అరెస్టులకు నిరసనగా స్థానిక తాలూకా ఎదురు చేపట్టిన రిలే నిరాహార దీక్షను ఆయన జూలై 20న విరమింపజేశారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా బాబ్లీ ప్రాజెక్టును నిర్మించి మన హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 60 ఏళ్ళ చరిత్రలో ఇలాంటి సంఘటన ఎదురు కాలేదని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా రాష్ట్ర హక్కులను కాపాడడానికి పోరాడదామని పిలుపునిచ్చారు. మనం చేసే ఉద్యమం శాంతియుతంగా ఉండాలని ఎట్టి పరిస్థితులలో మహారాష్ట్ర ఆస్తులు నాశనం చేయవద్దని కోరారు. టీడీపీ చేపడుతున్న శాంతియుత ఆందోళనకు మద్దతు తెలుపుతున్నామన్నారు. మహారాష్ట్ర సుమారు 200 టీఎంసీల నీటిని పశ్చిమానికి తరలించి అరేబియా సముద్రంలోకి వదులుతుందని తెలిపారు. కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నవ సుబ్బారావు, పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి దారపనేని నరేంద్ర, కార్యాలయ ఇన్‌చార్జి కొండా శివనాగిరెడ్డి, కసుకుర్తి హనుమంతరావు, మాదాల వెంకటేశ్వర్లు, పాటిబండ్ల బలరామ్, పానకాల వెంకటమహాలక్ష్మి, కేసన శెట్టి రమాశాంతాదేవి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

> **వినడంలో మనిషి తొందర పడాలి.**
> **కానీ మాట్లాడటంలో తొందర పడకూడదు.**
> **అపార్థం చేసుకోవడంలో అసలు త్వరపడకూడదు.**
> **– జేమ్స్ జ్యాడిత్**

# కృష్ణా జిల్లా

### సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి

**విజయవాడ :** రాష్ట్రంలో ఉన్న సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.జయప్రకాష్‌నారాయణ సూచించారు. కృష్ణా జిల్లా పర్యటనలో భాగంగా నగరంలో పార్టీ కార్యాలయంలో జూలై 19న ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ "రాష్ట్రాల మధ్య ఏర్పడిన వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి. బాబ్లీ ప్రాజెక్టు విషయంలో ఎవ్వరూ కూడా దూకుడుగా ప్రవర్తించడం తగదు. ప్రజల్లో ఆలోచనా విధానం పెంచేవిధంగా గౌరవ ప్రదమైన, నిర్మాణాత్మకమైన రాజకీయాలు కావాలి. ప్రభుత్వం ఖర్చు చేస్తున్న ప్రతీ రూపాయికి విలువ కావాలి. లోక్‌సత్తా పార్టీ వరదల్లో నష్టపోయిన లంక గ్రామాలను దత్తత తీసుకొని శాశ్వత పునరావాసం ప్రజలకు కల్పిస్తోందన్నారు." "దీనిలో భాగంగా జిల్లాలోని అవనిగడ్డ మండలం దక్షిణ చినవోలులంక గ్రామంలో పునరావాస నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. పార్టీలు అధికారం కోసం గ్రామాలను వల్లకాడుగా మార్చుతున్నాయని విమర్శించారు. స్థానిక బెల్టుషాపులను ప్రభుత్వం చిత్తశుద్ధితో అరికట్టాలని కోరారు".

### తాగుడు మానండి, తలెత్తుకు జీవించండి

**అవనిగడ్డ :** తాగుడు మానండి తలెత్తుకు జీవించడని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ పిలుపునిచ్చారు. గత సంవత్సరం వరదల్లో నష్టపోయిన గ్రామాలను పరిశీలించిన జయప్రకాష్ నారాయణ నవంబర్ 11న మండల పరిధిలోని దక్షిణ చిరువోల్లంక గ్రామాన్ని పరిశీలించి ఆ గ్రామాన్ని దత్తత తీసుకోవడం జరిగింది. ఇందులో భాగంగా కోడూరు కాల్వ నుండి రామచంద్రపురం గ్రామం మీదుగా ఎత్తిపోతల పథకానికి మొదటి విడతగా రూ॥13లక్షలతో సిమెంట్‌తో కాల్వను ఏర్పాటు చేసి రామచంద్రపురం చెరువు వరకు పనులు పూర్తయిన మీదట పరిశీలించడానికి జూలై 19న ఆయన విచ్చేశారు. అనంతరం లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు పట్టాభిరామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం గత 8 సంవత్సరాలనుండి నిరుపయోగంగా ఉందని, గ్రామ పెద్దల ద్వారా తెలుసుకుని రూ॥32లక్షలతో ఎస్టిమేషన్లు తయారు చేసినట్లు చెప్పారు. ఈ కాల్వ పనులు జరిగితే 650 ఎకరాలకు పైగా రైతులు సాగుచేసుకుంటారని అన్నారు. గత సంవత్సరం వరదల్లో గ్రామం మొత్తం మునిగిపోగా ఎన్నో స్వచ్ఛంద సంస్థలు బిచ్చగాళ్లకు వేసినట్లుగా బిచ్చం వేసి వెళ్లారని, ప్రజలు వారి కాళ్లమీద వారు నిలబడి తలదించుకునే వ్యవస్థనుండి తలెత్తుకునే వ్యవస్థకు రావాలని త్రాగుడుమాని తలెత్తుకు జీవించడం వారికి సూచించారు.





## ప్రజాభాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

**అవనిగడ్డ :** ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు సుసంపన్నం కావాలని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ సందర్భంగా దివిసీమ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రజానీకం ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూడకూడదు. ఐక్యతగా గ్రామాభివృద్ధికి పూనుకోవాలి. ప్రజలను బిచ్చగాళ్ళుగా చేసే వ్యవస్థ నుంచి తమ కాళ్లమీద తాము నిలబడే వ్యవస్థ కోసం కృషి చేయాలి. ప్రభుత్వ యంత్రాంగం నిస్తేజంగా ఉంది. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రజలు చైతన్య వంతం కావాలి రాజకీయ దోపిడీలనుంచి బయట పడాలి. కులానికో, మతానికో, మద్యానికో, నోటుకో ఓటును అమ్ముకుని జనం నష్టపోతున్నంతకాలం దేశంలో బీదరికం పోదు. నేటి రాజకీయ వ్యవస్థలో నీతి, నిజాయితీగా పనిచేసే వ్యక్తులు వ్యక్తిగతంగా నష్టపోతారు. దోపిడీ చేసేవారు లాభపడుతున్నారు. గ్రామాలు బాగుపడాలంటే మనం కష్టపడాలి. ఆత్మగౌరవంతో బతికే ఏ సమాజమైనా అభివృద్ధి చెందుతుందని హితవు పలికారు. స్థానిక ఎమ్మెల్యే అంబటి బ్రాహ్మణయ్య మాట్లాడుతూ ఎత్తిపోతల పథకాలు నిర్వహించాలంటే రైతులకు అసాధ్యమని, ప్రభుత్వం నిధులు కేటాయిస్తేనే అవి సఫలం అవుతాయన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే జయప్రకాష్ వంటి వ్యక్తులు సొమ్ము వెచ్చించి రైతులకు ఉపయోగపడే తొలిదశను పూర్తిచేయడం హర్షణీయమన్నారు. లోక్‌సత్తాపార్టీ జిల్లా అధ్యక్షుడు కామినేని పట్టాభిరామయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి చెన్నుపాటి వజీర్, దక్షిణ చిరువోల్లంక సర్పంచ్ బుస్సా భాగ్యలక్ష్మీ, స్థానిక నేతలు నడకుదిటి రాధాకృష్ణమూర్తి, గద్దె రత్నగిరిరావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత జేపీ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రామచంద్రపురం మంచినీటి పథకాన్ని పరిశీలించి, నిర్వహణ తీరుతెన్నులను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

## మద్యపానం సామాజిక రుగ్మత
## సుసంపన్నమైన వ్యవస్థ నిర్మాణం కావాలి : జేపీ

**రామచంద్రపురం, అవనిగడ్డ గ్రామం :** మద్యపానం కుటుంబ వ్యవస్థను, సమాజాన్ని చిన్నాభిన్నం చేస్తుందని లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం ఏరులై పారుతుంది. దీనిని అడ్డుకోవడానికి ప్రజలు సంసిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రామచంద్రపురం, దక్షిణచిరువోల్లంక గ్రామాలలో కూడా బెల్టుషాపులు ఉన్నాయా? అని ప్రజల్ని ప్రశ్నించారు. ముక్తకంఠంతో ఉన్నాయని చెప్పటంతో ఎందుకు బానిసలవుతున్నారు? అంటూ వారిని నిలదీశారు. ప్రభుత్వాలు అందించే సాయాలు తాత్కాలికం. దానికోసం అర్రులు చాచవద్దని హితవు పలికారు. సాయం అందించి బిచ్చగాళ్లుగా మార్చే ఈ వ్యవస్థ మారాలని, మార్పు కోసం ప్రజలు నడుం బిగించాలి. ఓటును అమ్ముకున్నంత కాలం రాజకీయ వ్యవస్థ మారదని చెప్పారు. ప్రజల చేతుల్లోకి అధికారం రావాలి. అధికారం దుర్వినియోగం అవకుండా కట్టుదిట్టం చేసే వ్యవస్థ ఒకటి ఏర్పాటు కావాలని జె.పి. అభిలషించారు.

## రుణం తీర్చుకోవాలి : అంబటి

ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తేవడానికి నిధులు ఖర్చు చేసిన లోక్‌సత్తా పార్టీ నేత రుణం తీర్చుకోవడానికి గ్రామస్థులు కట్టుబడి ఉండాలని ఎమ్మెల్యే అంబటి బ్రాహ్మణయ్య అన్నారు. నిజాయతీ, నిబద్ధత గల వ్యక్తి జయప్రకాష్ నారాయణ్ అని బ్రాహ్మణయ్య కితాబునిచ్చారు. ఆయన సూచనలు పరిగణనలోకి తీసుకుని ప్రజలు ఆచరిస్తే కచ్చితంగా ఆయన రుణం తీర్చుకున్నట్లేనని ఉద్వేగభరితంగా అంబటి ప్రసంగించారు.

## ప్రజల చేతుల్లో అధికారమే లక్ష్యం : జయప్రకాష్ నారాయణ్

**అజిత్‌సింగ్‌నగర్ :** జనుల చేతుల్లోనే అధికారమన్నదే తమ పార్టీ విధానమని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్‌నారాయణ్ అన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించిన ప్రచారం నిమిత్తం జూలై 19న ఆయన అజిత్‌సింగ్‌నగర్ డాబాకొట్ల సెంటర్ నుంచి పైపులరోడ్డు వరకు పాదయాత్ర, అక్కడి నుంచి కండ్రిక వరకు మోటారుసైకిల్ ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం కండ్రికలో ఓ చిన్నారి చేతుల మీదుగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభింపజేశారు. స్థానికుడితో పార్టీ పతాకాన్ని ఆవిష్కరింపజేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ నిజాయితీ, ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి, విశ్వసనీయతే తమ బలాలన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ, గూండాగిరి, కులతత్వాలకు తాము వ్యతిరేకమన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా రాజకీయ పార్టీలు మనజాలవు. అందువల్లనే మేము వారి సమక్షంలోనే వార్డు కమిటీలను ఏర్పాటు

చేస్తున్నామని చెప్పారు. వ్యవస్థను పూర్తిగా మార్చే లక్ష్యంతోనే తాము వ్యవహరిస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే 37 పురపాలక సంఘాల్లో యువతకు శిక్షణ ఇస్తున్నామన్నారు. తమ పార్టీ నేతలకు బాధ్యతలే తప్ప అధికారం ఉండదని నాయకులు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, వజీర్, రాజేంద్రప్రసాద్, అశోక్ కుమార్, మురళీ కృష్ణ తదితరులు అన్నారు.

## నీతిమాలిన రాజకీయాలతో ఇబ్బందులు

- **మద్యంతోనే పరిపాలన**
- **కమీషన్ల కక్కుర్తిలో నాయకులు : లోక్‌సత్తా అధ్యక్షుడు జేపీ**

**లబ్బీపేట:** నీతిమాలిన రాజకీయాలతో రాష్ట్రంలోని ప్రజల జీవితాలతో నాయకులు ఆటలాడుకుంటున్నారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ విమర్శించారు. విజయవాడలోని సూర్యారావు పేటలో పార్టీ కార్యాలయంలో జూలై 19న ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయ పార్టీలకు ప్రజల ఇబ్బందులు తీర్చడానికి డబ్బు రాదు. ఎన్నికల కోసం మాత్రం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తాయన్నారు. కులం పేరుతో రాజకీయ పార్టీలు అధికార దాహంతో ప్రజల్లో విభేదాలు సృష్టిస్తున్నాయన్నారు. కాంట్రాక్టర్ల నుంచి వచ్చే కమీషన్లకు నాయకులు కక్కుర్తి పడి వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలను మద్యం మత్తులో ముంచి గ్రామాలను వల్లకాడుగా మార్చుతూ తమ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు ఇచ్చిన రోజే రాష్ట్రం పూర్తిగా ప్రగతి పథంలో నడుస్తుందని తెలిపారు. వరదల సమయంలో నష్టపోయిన లంక గ్రామాలు నేటికీ కోలుకోలేదని అన్నారు. గుంటూరు, కృష్ణా, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని నాలుగు గ్రామాలను లోక్‌సత్తా దత్తత తీసుకొని వరదల్లో బాధితులకు శాశ్వత పునరావాసం కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని అవనిగడ్డ మండలంలోని దక్షిణ చినవోలులంక గ్రామంలో శాశ్వత పునరావాస పనులు 90 శాతం పూర్తి అయ్యాయన్నారు. వరదలకు లంక గ్రామాలు నష్టపోకుండా కరకట్ట పటిష్టతకు శాశ్వత పనులు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

## సమాజంలో మార్పు

**చెన్నుపాటి శేషగిరిరావు వర్ధంతి సభలో జయప్రకాష్ నారాయణ్**

**లబ్బీపేట :** నగర ప్రముఖులు చెన్నుపాటి శేషగిరిరావు ద్వితీయ వర్ధంతి బెంజిసర్కిల్‌లోని వేదిక కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ 'వ్యక్తి ఆరోగ్యమే సమాజ ఆరోగ్యం' అనే అంశంపై ప్రసంగించారు. ప్రజల ఆలోచనా విధానాలపైనే సమాజ అభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. నాయకులు అధికారాన్ని బాధ్యతగా స్వీకరించిన నాడు






ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. దేశంలో ఆరోగ్యపరిరక్షణకు ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చు సరిపోదన్నారు. చిన్న చిన్న దేశాలు ప్రజల ఆరోగ్య విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. దేశంలో ప్రతీ రోజూ వెయ్యి మందికిపైగా సరైనా టీకాలు అందక వైకల్యంతో జన్మిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిర్వహణకు ఖర్చు చేస్తున్న ఖర్చులో వెయ్యోవంతు టీకాలకు ఖర్చు చేస్తే ఈ దుస్థితి ఏర్పడదన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చెన్నుపాటి శేషగిరిరావు జీవితంలో సమాజానికి ఎన్నో సేవలు చేశారని కొనియాడారు.

తాను ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తి చెన్నుపాటి శేషగిరిరావు అని లోక్‌సత్తా అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ అన్నారు. ఉన్నత లక్ష్యం కోసం చేసే పనులను తాను ఆచరించి ఇతరులను ఆచరించమని చెప్పిన వ్యక్తి శేషగిరిరావు అన్నారు. మద్యపానానికి వ్యతిరేకంగా అప్పట్లోనే పోరాడిన వ్యక్తి అన్నారు. ప్రస్తుతం పదవుల కోసం పనిచేసే వారే తప్పితే సమాజాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేసే రాజకీయ నాయకులు కరువయ్యారని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నుపాటి శేషగిరిరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని ఐదు మున్సిపల్ పాఠశాలలకు సైన్స్ లేబరేటరీ పరికరాలను ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ రత్నబిందు చేతుల మీదుగా అందజేశారు. 30 మంది పిల్లలకు యూనిఫారాలు, 200 మంది పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ చెన్నుపాటి విద్య ట్రస్టీలు డాక్టర్ సమరం, చెన్నుపాటి వజీర్, రశ్మి, లవణం, నియంత లోక్‌సత్తా నాయకులు కె.పట్టాభిరామయ్య, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ సుహాసినిదేవి, రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్

అధ్యక్షుడు పి.గోపాలనాయకులు, డాక్టర్ మెహర్‌ప్రసాద్, డాక్టర్ దీక్ష జి.రష్మీ, కీర్తి నగర ప్రముఖులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు స్వేచ్ఛ అవసరం : జయప్రకాష్

**మోపిదేవి:** ఉపాధ్యాయులకు స్వేచ్ఛ, ప్రశాంత వాతావరణం కల్పిస్తే మంచి విజ్ఞానాన్ని రాబట్టవచ్చునని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్‌నారాయణ్ అన్నారు. క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులను మనసారా అభినందిస్తున్నానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. మోపిదేవి ఆశ్రమ పాఠశాలను జూలై19న ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులను తరగతి గదుల్లోనే ప్రత్యక్షంగా కలసి బోధనాంశాలపై వివిధ ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందుతున్న సహాయ సహకారాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో పాఠశాలకు కావల్సిన అవసరాలు, సమస్యలపై చర్చించారు.



### విద్యకు అధిక ప్రాధాన్యం

పాఠశాలను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో కొద్దిసేపు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికల్లో విద్యకే అధిక ప్రాధాన్యత కల్పించాలని కోరారు. మాతృభాషలోనే కనీసం పేరా కూడా చదవలేని విద్యార్థులు కనీసం నూటికి 30 మంది కూడా లేని పాఠశాలలు అనేకం ఉన్నాయి. నూటికి 40 మందికి తీసివేతలు, 65 నుంచి 70 మందికి 7వ తరగతిలో భాగహారాలు తెలియని పరిస్థితిని గమనించామన్నారు. మోపిదేవి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు చురుకుగా, ఉత్సాహంగా స్పందించడానికి కారణం ఉపాధ్యాయులు అందించే బోధనే అని ప్రశంసించారు. ఇక్కడ విద్యావిధానాన్ని పరిశీలిస్తే 30, 40 సంవత్సరాల క్రితం భావన కలుగుతోందని చెప్పారు. సైన్స్ కంప్యూటర్ ల్యాబ్స్ వ్యక్తిగతంగా పాఠశాలకు సమకూర్చేందుకు ఆయన హామీ ఇచ్చారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చేందుకు లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు సహకరిస్తారని చెప్పారు. ప్రభుత్వ పరంగా పాఠశాలకు ప్రహరీగోడ, ప్రమాదకరంగా మారిన గొయ్యిని పూడ్పించేందుకు సహకారం అందించాలని కోరారు. ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి సక్సెస్ పాఠశాలలుగా అభివృద్ధి చేయడానికి సహకరించాలని ఆయనను ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీలను కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.పట్టాభిరామయ్య, సీహెచ్ వజీర్ తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు తమ్మా తాతారావు, సైకం రాణాప్రతాప్, అగ్నికుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు కోలాబాలాజీ, లకనం నాగాంజనేయులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లోక్‌సత్తా పార్టీని బలోపేతం చేసి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా అర్బన్ జిల్లా అధ్యక్షుడు చుందూరి రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుపాటి వజీర్, రూరల్ అధ్యక్షులు కామినేని పట్టాభిరామయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.విజయ్‌కుమార్, మహిళాసత్తా జిల్లా కార్యదర్శి శ్రీదేవి, బీ.మురళీకృష్ణ, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల అభివృద్ధే ధ్యేయం

**అవనిగడ్డ రూరల్ :** గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు పేదరికం నుంచి బయటపడేందుకు సుసంపన్నమైన గ్రామీణ వ్యవస్థను నిర్మించడమే ధ్యేయం కావాలని లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. లోక్‌సత్తా దత్తత గ్రామమైన దక్షిణ చిరువోలు లంకలో జూలై19న పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది కృష్ణానదికి సంభవించిన వరదల్లో కర్నూలు, గుంటూరు, కృష్ణాజిల్లాల్లో రైతాంగం తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ సమయంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ఎంతగానో స్పందించి, తాత్కాలిక సాయం అందించారన్నారు. ప్రజలకు కావాల్సింది తాత్కాలిక సాయం కాదని, శాశ్వత పరిష్కారానికి కృషిచేయాల్సిన బాధ్యతను పాలకులు మర్చిపోవడం విచారకరమన్నారు. దత్తత గ్రామమైన దక్షిణచిరువోల్లంకలో ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు పనులు త్వరితగతిన పూర్తిచేద్దామని భావించినప్పటికీ, ప్రభుత్వ ప్రమేయం ఉండటం, సంబంధిత అధికారులు నిస్తేజంగా వ్యవహరించిన కారణంగా ఆలస్యమైందన్నారు. పేదరికం కొనసాగడానికి రాజకీయవ్యవస్థే కారణమంటూ, ఓట్లను డబ్బుకో, సారాకో, కులానికో అమ్ముకునే పరిస్థితి ఉన్నంత కాలం వ్యవస్థలో మార్పు వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న అవనిగడ్డ శాసనసభ్యుడు అంబటి బ్రాహ్మణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నిబద్ధత, నిజాయితీ, పట్టుదల, కృషి, అన్నింటినీ మిళితం చేసుకున్న వ్యక్తి జేపీ అని ఎమ్మెల్యే కొనియాడారు. ✻

**విచారణకు భయపడి పారిపోయే వ్యక్తి, తన నేరాన్ని తనకు తానుగా అంగీకరించినట్లే** – వైరస్

ఆ పార్టీల పతనం మొదలైంది

# మార్పు అవసరాన్ని ప్రజలు గుర్తించారు

## ప్రత్యామ్నాయం ఉందని చూపాం

*"ప్రజల మార్పు అవశ్యకతను గుర్తించారు. వారికి లోక్‌సత్తా ప్రత్యామ్నాయాన్ని చూపగలిగింది. మేము భారీ లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం." అని లోక్‌సత్తాపార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ అన్నారు. అవినీతి, మద్యం ముప్పుగా పరిణమించాయని, వీటిపై దీర్ఘకాలిక పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంప్రదాయ పార్టీల పతనం ప్రారంభమైందని చెప్పారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆవిర్భవించి 14 ఏళ్లయిన నేపథ్యంలో జేపీ న్యూస్‌టుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలను వివరించారు.*

**14 ఏళ్ల లోక్‌సత్తా ప్రస్థానం ఎలా సాగింది? సాధించిన విజయాలు ఏమిటి?**

దేశంలో కీలకమైన అంశాలపై లోక్‌సత్తా చేసిన లోతైన అధ్యయనం, పరిశీలన మరెవ్వరూ ఇంతవరకూ చేయలేదు. అవినీతి, విద్య ఆరోగ్యంపై వాస్తవ పరిస్థితులను తేటతెల్లం చేయగలిగింది. ప్రజల ఆలోచనలకు పదును పెట్టింది. ఎన్నికలు, ఓటు, ప్రజాస్వామ్యం, ప్రభుత్వాల బాధ్యత, పరిపాలనపై జనంలో చైతన్యం తీసుకురాగలిగాం. ప్రత్యామ్నాయం ఉందని చూపగలిగాం. ఇది పూర్తి విజయం కాదు. చేయాల్సింది చాలా ఉంది. భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో మాత్రం వంద శాతం విజయం సాధించాం. విజయాలు రెండు రకాలు. చిన్న లక్ష్యం పెట్టుకుని దాన్ని సాధించి సంతృప్తి పడిపోవడం ఒకటి. పెద్ద లక్ష్యం పెట్టుకుని ముందుకు వెళ్లడం మరొకటి. మేం పెద్ద లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. జాతి లక్ష్యం కోసం అందరూ కలసి రావాలి. నాయకత్వం వెంట నడిచే అనుచరులు తాము నడుస్తున్నది ఎలాంటి వారి వెంట అనేది గుర్తించాలి.

**'న్యూస్‌టుడే' ఇంటర్వ్యూలో జయప్రకాష్‌నారాయణ్**

**అవినీతిపై పోరాటం ద్వారా ఏ మేరకు మార్పు తెచ్చారు?**

ఆరంభం నుంచి అవినీతికి వ్యతిరేకంగా లోక్‌సత్తా పోరాటం చేస్తోంది. కొన్ని రంగాల్లో అవినీతి తగ్గినా మొత్తం మీద 10 నుంచి 20 రెట్లు పెరిగింది. రాజకీయ సంకల్పం లేకుండా దీన్ని తగ్గించడం సాధ్యంకాదు. మీడియా కూడా కృషి చేయాలి. 1974లో హాంకాంగ్‌లో అవినీతి నియంత్రణకు స్వతంత్ర ప్రతిపత్తి గల వ్యవస్థను ఏర్పాటు చేసి మూడేళ్లలో నియంత్రించగలిగారు. అవినీతికి పాల్పడితే శిక్ష ఖాయమని, సమాజంలో అగౌరవం తప్పదనే భయం కల్పిస్తేనే ఫలితం ఉంటుంది.

**లోక్‌సత్తా పార్టీ స్థాపించాక, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కార్యకలాపాలు ఎలా ఉన్నాయి?**

ఉద్యమ సంస్థ, పార్టీ వేర్వేరు కాదు. భిన్న రూపాల్లో ఉన్నా రెండింటి లక్ష్యాలు ఒక్కటే. కుటుంబంలోని ఒక వ్యక్తి తండ్రిగా, అన్నగా, తమ్ముడిగా రకరకాల పాత్రలు పోషిస్తారు. అలాగే ఇదీనూ, రాజ్యాంగం సక్రమంగా అమలు చేయాలన్నదే మా లక్ష్యం.

**మేధావి వర్గానికే పరిమితమన్న అభిప్రాయం..?**

జాతీయ స్థాయిలో... విద్యావంతులకు, ఆలోచించగలిగే వారికే చేరగలిగాం. రాష్ట్ర స్థాయిలో 80 శాతంపైనే చేరగలిగాం. గ్రామాల్లోనూ ప్రభావం చూపగల్గుతున్నాం. సామాన్య జనం మా గురించి చర్చించుకుంటున్నారు. మార్పు అవసరమని వారు గుర్తించినా ఇప్పుడు కాదు మరోసారి అవకాశమిద్దామనే భావనతో ఉన్నారు. మొత్తం మీద వారిలో సానుకూలత వ్యక్తమవుతోంది.

**నిలకడగా పోరాటం అని మీరంటుంటారు. అంటే....?**

నిలకడ మా సహజ లక్షణం. 14 ఏళ్లలో లోక్‌సత్తా ఏనాడూ మాట తప్పలేదు. పంథా మార్చుకోవాల్సి వచ్చినప్పుడు కూడా వాస్తవాలను విశ్లేషించుకుని దానికి అనుగుణంగా మార్చుకుంది. తాత్కాలిక ప్రయోజనాలు, ఫలితాలను ఆశించకుండా నిర్దిష్టమైన విధానాలతో, లక్ష్యం సాధనగా ముందుకెళ్తున్నాం.

**మద్యంపై పోరాటం :**

మద్యంపై మా పోరాటం తాత్కాలికమే అవుతోంది. ఒక గ్రామంలో బెల్ట్ దుకాణాలను తొలగిస్తే అది ఆ రోజుకే పరిమితమవుతోంది. ప్రజల్లో సంకల్పం ఉంటేనే లక్ష్యం సాధ్యమవుతుంది. పేదలు మత్తులో ఉన్నంత కాలం పాలకుల అవినీతిని ప్రశ్నించలేరు. మద్యం నియంత్రణపై దృష్టి సారించకపోతే తీవ్రమైన పరిస్థితులకు దారితీసే అవకాశం ఉంది. అగ్రరాజ్యంగా వెలిగిన రష్యా కుప్పకూలిపోవడానికి కారణం అదే. మార్పును అందిపుచ్చుకోవాల్సిన సమయంలో వారు మద్యం మత్తులో ఉండటంతో కోలుకోలేని విధంగా నష్టపోయారు. లోక్‌సత్తా ఇప్పుడు చేస్తున్న పోరాటం సరిపోవడంలేదు. అయినా ప్రయత్నాలు కొనసాగుతూనే ఉంటాయి. ప్రజల్లో నిర్మాణాత్మకమైన ప్రతిఘటన రావాలి. ఎదిరించే శక్తి కావాలి.

**భవిష్యత్తు కార్యాచరణ ఏమిటి?**

సంప్రదాయ పార్టీల పతనం ప్రారంభమైంది. వాటికి స్వల్పకాలిక ప్రయోజనాలు తప్ప నిర్దిష్టమైన లక్ష్యాలు లేవు. అందుకే ప్రజల్లో గౌరవాన్ని కోల్పోతున్నాయి. ఇది కీలకమైన పరిణామం. అప్రమత్తంగా అడుగులు వేయాల్సిన సమయమిది. మనం ఇప్పుడు సంధికాలంలో ఉన్నాం. ప్రత్యామ్నాయాన్ని అందించాలి. నిజాయితీగా తమను తాము పోషించుకుంటూ రాజకీయంలో నిలబడే వాళ్లు రావాలి. ఇలాంటి వాళ్లను రాష్ట్రంలో తయారు చేసుకోవాలి. *

## అభివృద్ధికి ప్రాతిపదిక

# గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాల కల్పనే

భారత నిర్మాణ యోజన పథకం ద్వారా ఇటీవలి కాలంలో గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాలకు సైతం చెప్పుకోదగ్గ ప్రాధాన్యత లభించింది. అయితే నాణ్యత కలిగిన మౌలిక సదుపాయాల లక్ష్యసాధనలో కలిగే అవరోధాలను అంత తేలిగ్గా తీసిపారేయలేము. వేటికవే ప్రత్యేకంగా ఉండే భారతీయ గ్రామీణ ప్రాంతాలే నవీన భారతాన్ని నిర్వచించడంలో ఒక విధమైన సందిగ్ధతను కలుగజేస్తాయి. ఈ దశాబ్దంలో తమకంటూ ఒక ప్రత్యేకతను నిలబెట్టుకు విరాజిల్లుతున్న గ్రామాలు కొని వున్నా ఎప్పటిలాగే మరువబడి మరుగునబడ్డ గ్రామాలు అదే సంఖ్యలో ఉన్నాయి.

దాదాపు 1454 గ్రామాలను, ఈ క్రింది సదుపాయాల అందుబాటు ఆధారంగా సర్వే చేసి వివరాలను రాబట్టడమైనది. అవి:

పక్కా రోడ్లు, బస్సు స్టాపులు, పోలీసు స్టేషన్, బ్యాంకు, బడి, ల్యాండ్ ఫోను, మొబైలు, కిరాణా కొట్టు, విద్యుత్తు, మార్కెట్, పౌర సరఫరా కేంద్రం తదితరాలు.

పైన పేర్కొన్న సదుపాయాల్లో ఆరింటికి పైగా సదుపాయాలు అందుబాటులో ఉన్న గ్రామాల్లో మానవవనరుల అభివృద్ధి సూచిక సంతృప్తికరంగానే ఉంది. ఈ సదుపాయాల్లో కొన్ని ప్రైవేటు రంగం వారిచే ఏర్పాటు చేయబడగా అత్యధికశాతం మాత్రం ప్రభుత్వం రంగం ద్వారానే నడపబడుచున్నాయి. మౌలిక సదుపాయాలు అల్పంగా అభివృద్ధి చెందిన గ్రామాల్లోనూ ఈ కింద ఇవ్వబడిన లక్షణాలున్న గ్రామాలు పేర్కొనదగినవి.

**1. ఇది పూర్తిగా మారుమూల పల్లెలు కావు.**

కేవలం 8% మాత్రమే సమీప పట్టణానికి 30 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉంటాయి. అయితే, పట్టణ సామీప్యత ఒక్కటే ఇక్కడ ప్రామాణికం కాదు. " జిల్లా కేంద్రానికి" సమీపంలో ఉండడమనేది ఈ సందర్భంగా అత్యధికంగా ఉపకరిస్తుంది.

జిల్లా కేంద్రం నుండి 30 కిలోమీటర్ల దూరంలో ఉండే గ్రామాల్లో 57% గ్రామాలు అభివృద్ధి చెందిన గ్రామాల కిందకి రాగా, 60 కిలోమీటర్ల దూరానికి మించి ఉన్న గ్రామాల్లో కేవలం 42% మాత్రమే అభివృద్ధి చెందడం పరిగణనలోకి తీసుకొనవలసిన విషయం.

**2. మావోయిస్టు ప్రేరేపిత ప్రాంతాల్లోని గ్రామాలు**

వ్యవసాయ సంబంధితం కాని పనులు అరుదుగా దొరికే గ్రామాలివి. పిల్లలు బడికెళ్ళినా చదవడం, రాయడం నేర్చుకోలేరు మరియు రోగనిరోధక శక్తి అత్యల్పంగా ఉంటుంది. దీనికి విరుద్ధంగా పట్టణాలతో చక్కటి సంబంధాలు కలిగిన గ్రామాలు, సర్వే చెయ్యబడిన గ్రామాల్లో దాదాపు 50% శాతం, చిన్న చిన్న పట్టణాలతో ఆర్థిక స్థితిలోనూ, అభివృద్ధిలోనూ పోటీలు పడుతున్నాయి.

పైన పేర్కొన్న రెండు రకాల మనుషుల జీవితాలకీ మౌలిక భేదం ఒక్కటే.

అది వ్యవసాయ సంబంధిత పనులను మినహాయిస్తే, ఇతర రంగాల్లో వారికి గల వృత్తి అవకాశాలకు సంబంధించినది. వ్యవసాయం అనేది, ఒక వృత్తిగా, అభివృద్ధి చెందిన గ్రామాలలోనూ అభివృద్ధి చెందని గ్రామాలలోనూ సమాన ప్రాధాన్యత కలిగిన పాత్రను పోషిస్తోంది. రెండు విభాగాల్లోనూ సగానికి పైగా మగవారు సమూలంగా వ్యవసాయం మీదే ఆధారపడతారు. అభివృద్ధి చెందిన గ్రామాల్లో 34% వ్యవసాయేతర రంగాల్లో పని చేస్తూ ఉండగా, అభివృద్ధి చెందని గ్రామాల్లో ఈ సంఖ్యా కేవలం 22%.

వ్యవసాయ మరియు వ్యవసాయేతర రంగాలు రెండింటిలోనూ మౌలిక సదుపాయాలు అదనంగా ఉండే గ్రామాల్లోనే అధిక ఆదాయం కనపడింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి వ్యవసాయేతర రంగాలైన ఉపాధ్యాయ, గుమస్తా గిరి, కిరాణాకొట్టు తదితర ఉద్యోగావకాశాలను ఉన్న గ్రామాల్లోనే అభివృద్ధి చేస్తుంది.

అంతే కాకుండా ఇటువంటి గ్రామాల్లో చుట్టుపక్కల ఉన్న పట్టణాలకు వెళ్లి పనిచేసే అవకాశాలు కూడా మెరుగ్గా ఉంటాయి. తద్వారా ఉపాధ్యాయులు మరియు నర్సులు ఈ గ్రామంలోనే నివసిస్తారు. నాణ్యత కలిగిన విద్య. ఆరోగ్యం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందేందుకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. అంతేకాక, స్వచ్ఛంద సంస్థలు కూడా మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నచోట తమ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి మొగ్గు చూపుతాయి. ఈ ప్రాంతాల నుండి తమ కార్యకలాపాలను మిగతా గ్రామాలకు విస్తరించడానికి కృషి చేస్తాయి.

ఈ సందర్భంగా కొన్ని గ్రామీణ ప్రాంతాలు ఆశించిన స్థాయిలో మెరుగపడడం ముదావహమే అయినా, మరుగున పడిపోయిన గ్రామాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మనం పట్టు వదలక కృషి చెయ్యాలనీ, తగినంత సమయాన్ని, వ్యయాన్నీ వెచ్చించాలని ఈ సర్వే సూచిస్తుంది. మన లక్ష్యం, కర్తవ్యం నిరుపేద జిల్లాలను గుర్తించి వాటిని అభివృద్ధి పథంలోకి తీసుకురావడం కాబట్టి, గ్రామీణ ప్రాంతాల భిన్నత్వాల గుర్తింపు అతి ముఖ్యమైనది.

**(తరువాయి...27వ పేజీలో)**

# ఎవరు దొంగ



- బండారు రామ్మోహన్‌రావు

**ఉదయం ఏడున్నరయింది. "సికింద్రాబాద్ నుండి విజయవాడ వెళ్ళే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఒకటవ నెంబర్ ప్లాట్‌ఫారం నుండి బయలు దేరడానికి సిద్ధంగా ఉంది." ఏకంగా మూడు బాషల్లో అర గంట నుండి ఎనౌన్సర్ ఉదరగొట్టేస్తుంది. నేను, నా మిత్రుడు హరిశ్చంద్ర ప్రసాద్ ట్రైన్‌లోని జనరల్ కాంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కాం. వాడు పేరుకి హరిశ్చంద్ర ప్రసాద్ ఐనా అబద్ధాలు అడకుండా వాడికి రోజు గడవదు. ఎందుకంటే వాడు కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్నాడు. నేను వరంగల్లో ఒక మీటింగ్‌కి వెళ్ళాల్సి ఉంది. నేను ఎప్పడూ బస్సు ప్రయణాన్నే ఇష్టపడతాను. అదో చిన్న ప్రపంచం, బస్సులో మనకు డ్రైవర్ ప్రత్యక్షంగా కనబడతాడు. బస్సు ఆపమంటే ఆపుతాడు. అదే రైలు అయితే డ్రైవర్ ఎక్కడో ఉంటాడు. బోగీలన్నీ ఒకే రంగులో ఉంటాయి. అదో పెద్ద ప్రపంచం. భారతదేశం అంతా రైల్లోనే ఉన్నట్లు అనిపిస్తుంది. బిచ్చగాళ్ళు, చిరుతిండ్లు అమ్ముకునే వాళ్ళు, పేకాట రాయుళ్లు, కాలక్షేప రాయుళ్లు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు, పోలీసులు, పనిదొంగలు, దొంగలు, అందరు రైల్లోనే ప్రయాణం చేస్తున్నారు. అన్ని భాషలు మాట్లాడే వాళ్లు కూడా ఉంటారు. రైలంటే మినీ భారత దేశం చూసినట్లు ఉంటుంది. అందుకే నాకు రైలంటే భయం. ఒక రకంగా చెప్పాలంటే జడత్వం కూడా. కలసి ప్రయాణం చేద్దామనే మావాడి కోరిక మేరకు ఆ రోజు రైలు ప్రయాణానికి ఒప్పకున్నాను.**

జనరల్ బోగిలోకి మేమిద్దరం అడుగు పెట్టగానే "నమస్తే వకీల్‌సాబ్ నెలరోజులనుండి రావడం లేదేంటి." అన్నాడు ఒక పెద్దాయన మావాడినుద్దేశించి. ''కోర్టుకి సెలవులు కదా డాక్టరుగారు, అందుకే నెల రోజుల నుండి రావడం లేదు" అన్నాడు ఆ కంపార్టుమెంట్‌లో 60, 70 మంది ఉన్నారు. అందరు ఒకరినొక్కరు "విష్" చేసుకుంటూ, యోగక్షేమాలు కనుక్కుంటూ, సరదాగా పలకరించుకుంటున్నారు. ట్రైన్ ప్రయాణం ఇంత ఆహ్లాదకరంగా ఉంటుందని నేను అనుకోలేదు. మా వాడు వాళ్ళల్లో ఒక్కొక్కరిని నాకు పరిచయం చేస్తున్నాడు. పరిచయాల తరువాత తేలిదేమిటంటే అందులో అందరూ మూడు నెలల సీజనల్ పాస్ తీసుకొని ప్రతిరోజు వరంగల్ తర్వాత మహబూబాబాద్ వరకు ప్రయాణం చేసే వారని అర్థం అయింది. అందుకే ఒక్క కుటుంబంలోని వ్యక్తుల్లా వాళ్ళ జీవితాల గురించి, జీతాల గురించి, వృత్తిలో ఎదురయ్యే కష్టనష్టాల గురించి అరమరికలు లేకుండా మాట్లాడుకుంటున్నారు, జోకులు వేసుకుంటున్నారు. దూరం, కాలం తెలియకుండా ప్రతిరోజు నిమిషాల్లాగా గడిచిపోతుంది వాళ్ళ ప్రయాణం.

ఒక్కొక్కరిని నేను గమనిస్తున్నాను. రోజు వాళ్ళతోపాటు ప్రయాణం చేసే ఒక్కరు రాకున్నా వాళ్లు పడే తాపత్రయం వారికోసం వాకబు చేయడం. ఇవన్నీ చూస్తుంటే ఒక్క కుటుంబంలోని వ్యక్తులు కూడా అలా ప్రవర్తించరనిపిస్తుంది. ప్రతిరోజు నడుస్తున్న రైలే వారి జీవితం. ఉదయాన్నే బయలుదేరడం ఏ రాత్రికో హైదరాబాద్‌కు రావడం, మళ్లీ పొద్దున్నే తయారుకావడం ఇది వారి దిన చర్య. ఏమిటీ ఉద్యోగాల కోసం ప్రతిరోజు వందల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తారా? అన్నాను నేను ఆశ్చర్యంగా "ఇదేం చూశావు ఈ ట్రైన్‌లోని అన్ని జనరల్ బోగిలు ఇంతే" అన్నాడు మా మిత్రుడు.

రైలు మెల్లగా కదిలింది. ప్లాట్‌ఫారం మీద పరిగెత్తుకుంటూ వచ్చిన ఒక మహిళ ట్రైన్ అందుకుంది. వగరుస్తూ నిలుచుంది. "హమ్మయ్య మేడమ్ ఇవాళ ట్రైన్ మిస్ అవుతుందనుకున్నాను కానీ మొత్తానికి రిటైర్‌మెంట్‌కు దగ్గరకు వచ్చినా పరుగులో మాత్రం ఫస్టని నిరూపించుకున్నారు'' అని అన్నారు డాక్టరు గారు ఆమెనుద్ధేశించి. "ఈ ట్రైన్‌కి ఆమె సీనియర్ ప్రయణికురాలు. గత 30 ఏళ్ళుగా ప్రతిరోజు ప్రయాణం చేస్తూనే ఉంది." అన్నాడు మా మిత్రుడు. "రిటైర్‌మెంట్ ఎప్పుడు మేడమ్" అన్నాడు మరో ప్రయణికుడు. "ఆ ఎంతా మరో ఏడాది అయితే అయిపోతుంది." కేల్‌ఖతమ్ దుకాన్ బంద్" ఈ ఉరుకుల పరుగుల జీవితం 2011తో సరి" అందావిడ. "అప్పుడు హాయిగా మనవళ్ళు, మనవరాళ్ళతో ఆడుకోవచ్చు" అన్నాడు మా వాడు.

రైల్లో ప్రయణించే కొందరి గురించి మా వాడు నాకు వివరిస్తున్నాడు. ఇరవై, ముప్పై మంది టీచర్లు లెక్చరర్లు ఉన్నారు వారు ప్రతిరోజు రారు. వంతుల వారీ చీటీలు వేసుకొని నలుగురికి ఇద్దరు చొప్పున స్కూలుకు హాజరవుతారు. మిగతా రోజుల్లో వాళ్ళ సొంత వ్యాపారాలు, ఇతరత్రా సొంత పనులు చూసుకుంటారు. కొందరు వీరికంటే మరీ తెలివైన వారు. వాళ్ళ బదులు ఆ ఊళ్ళోనే టెన్తో, ఇంటరో ఫేలయిన నిరుద్యోగులను చూసుకొని వారికి ఉడతా భక్తిగా కొంత సహాయం చేస్తూ, వారితోనే పాఠాలు చెప్పిస్తున్నారు. ఇదేమని అడిగితే పై అధికారులకు లంచాలు ఇస్తూ, చూసి చూడనట్లు పోమ్మంటున్నారు. ఇక ప్రభుత్వ ఆసుపత్రి డాక్టరు గారు కూడా ప్రతి రోజు రారు. ఆయన ఆసుపత్రిలో పని



చేసే సిబ్బందిలో కూడా సగం మంది ఆయనతోనే ట్రైన్‌లో ప్రయాణం చేసి వస్తుంటారు. దాంతో డాక్టరు గారు వచ్చే రోజు వాళ్ళకు తెలుస్తుంది. దానిని బట్టే వాళ్ళ డ్యూటీలు అధారపడి ఉంటాయి. ఇక ఆ రైల్లో ప్రయాణం చేసే పోలీసుల బాధ వర్ణనాతీతం. హైదరాబాద్ జైళ్ళలో అండర్ ట్రైల్ ఖైదీలుగా (కోర్టులో విచారణ ఎదురుకుంటున్న ముద్దాయిలు) ఉన్న వారిని కోర్టు ముందు హాజరు పరచడానికి ఈ రైలులోనే తీసుకెళ్ళాలి. వాళ్ళు పారిపోతే వీళ్ళ ఉద్యోగాలకు ఎసరు. అందుకే వాళ్ళు టాయిలెట్‌కెళ్ళినా ముక్కుమూసుకొని వాళ్ళ వెంబడి వెళ్ళవలసినదే. ఖైదీలేమో ఏవో చిన్న చిన్న నేరాలు చేసి జైలుకు వస్తే, ఉద్యోగం పేరున బతుకే ఒక జైలుగా బతకాల్సివచ్చే పోలీసు ఉద్యోగాలు వీళ్ళవి. ప్రతిరోజు ఖైదీలని ఆ కోర్టుల్లో హాజరు పరచడం మళ్ళీ వాళ్ళని క్షేమంగా జైలుకి చేర్చడం వీళ్ళ పని. ఇక రాజకీయ నాయకుల సంగతి సరేసరి చాలామంది ఛోటామోటా రాజకీయ నాయకులు ఇటీవల రకరకాల అభివృద్ధి కార్యక్రమాల పేరుమీద, కాళ్ళట్టుకొనో, కాంట్రాక్టులు చేసి నాలుగు రాళ్ళు వెనకేసుకొని హైదరాబాద్‌లో ఇళ్ళు, ముంగిళ్ళు కొనుక్కొని ఉద్యోగస్తులలాగే వీళ్ళు తమ తమ నియోజక వర్గాలకి రోజూ వచ్చి వెళ్తూ ఉంటారు. వీళ్ళ పర్మినెంట్ అడ్రస్ హైదరాబాదే. రోజు కళ్ళెదుటే కనిపించే రాజకీయ నాయకులు, ఉద్యోగులకన్నా వీళ్ళే నయమనుకుంటున్నారు కాబోలు! ప్రజలూ అలాగే అలవాటుపడిపోయారు "దూరపు కొండలు నునుపు" కదా!

చూస్తుండగానే రైలు హైదరాబాద్ శివార్లు దాటింది. భువనగిరిలో ట్రైన్ ఆగింది. మా బోగిలోకి ఎక్కినవాడిలో నాచిన్నప్పటి క్లాస్‌మేట్ ఒక్కడు నన్ను గుర్తుపట్టి పలకరించాడు. ఏం చేస్తున్నావురా అంటే వాడు చేసే "వృత్తి" చెప్పకుండా, రాజకీయాన్నే వృత్తిగా భావించి ఐదేళ్ళ క్రితమే ఎం.పి.టి.సీగా గెలిచాను అన్నాడు. ఎం.పి.టి.సీ గా ఏమీ ఒరగబెడుతున్నావ్ అంటే ఎన్నికల్లో పెట్టిన ఖర్చు రాబట్టడానికే ప్రయత్నిస్తున్నాను అన్నాడు వాడు. ఆ ప్రయత్నం ఎంతవరకు సఫలీకృతం అయిదంటే వాడు ఎమ్మెల్సీ ఎన్నికల సంగతి చెప్పుకొచ్చాడు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీలకి సంబంధించి ఓటు వెయ్యడానికి వాడికి అనుకోకుండా రెండు అవకాశాలు వచ్చాయి. ఒకసారి గెలిచినవారు రాజీనామా చేయడంతో మరోసారి ఎన్నికలు మీద పడ్డాయి. మొదటిసారి ఎన్నికలలో వీడు, వీడితోపాటు మరో నలుగురు ఎం.పి.టి.సిలను ఎమ్మెల్సీ అభ్యర్థికి అప్పజెప్పినందుకు ముదురుగా చెప్పాలంటే "తార్చినందుకు" గాను మా వాడు ఐదు లక్షలు వెనకేసుకున్నానని చెప్పాడు. కానీ రెండవసారి వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బేరం అంతబాగా కుదరలేదని దాంతో మొదటిసారి వచ్చినదాంట్లో సగమే వచ్చిందని వాపోయాడు. ఎటొచ్చి తను గ్రామంలో ఎం.పి.టి.సీ. ఎన్నికల కోసం ఖర్చుపెట్టిన దానికి సుమారుగా రెండురెట్లు సంపాదించానని చెప్పుకొచ్చాడు. గత ఐదేళ్ళుగా రాజకీయాలో కాంట్రాక్టులు, ఇతరత్రా సంపాదనంతా రోజువారి రాజకీయాలు, ఖర్చులకే సరిపోతున్నాయని వాపోయాడు.

రైలు భువనగిరి దాటింది దూరంగా యాదగిరిగుట్ట కొండ కనబడుతుంది. మెల్లగా అందరు ఎదురెదురుగా సీట్లల్లో సర్దుకున్నారు. మాటలైపోయాయి. ఇక ఎవరికి వారు నలుగురైదుగురు కలసి సీట్ల మధ్యే ఎదురెదురుగా పేకాట మొదలుపెట్టారు. పేకాటలో మధ్యలో రాజకీయాలు మాట్లాడుకుంటున్నారు. రేపటి ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడుతారు. ఏ వాదం నెగ్గుతుంది. ఎవరెట్లా ఆత్మరక్షణ చేసుకుంటారు. పార్టీల తీరుతెన్నుల గురించి, ప్రపంచ రాజకీయాల గురించి అనర్గళంగా మాట్లాడేస్తున్నారు. వార్డు మెంబరు నుండి అమెరికా అధ్యక్షుడి వరకు, సహకార సంఘం నుండి, ప్రపంచ బ్యాంకు విధానాల వరకు, ఏకీ పారేస్తున్నారు. వాళ్ళ వాళ్ళ గమ్యాలు రాగానే చర్చలని అర్థాంతరంగా వదిలేసి, రైలు దిగిపోతున్నారు. పైగా "ఈ సమాజాన్ని మనం ఎవరం మార్చలేము ఇది ఇంతే" అని నిట్టూర్పు విడుస్తున్నారు.

ఒక చిరుద్యోగిని ఎసిబివాళ్ళు పట్టుకొని అక్రమాస్తులని బయటకు తీశారన్నది ఆ రోజు హాట్ టాపిక్. "చిన్నచేపలే దొరికాయా" అని ఒకరంటే, "ఈ మధ్య పెద్దవాళ్ళను కూడా పట్టుకున్నారు లెండి" అని మరొకరు అంటున్నారు. "అసలు రాజకీయ నాయకులే పెద్ద దొంగలైతే ఉద్యోగస్తులను ఎవరు అడిగాడులేండి" అని మరొకరు అన్నారు. "ఆ పార్టీ తొమ్మిదేళ్ళు అధికారంలో ఉన్నప్పుడు అందినంతకాడికి దోచుకోగా లేనిది మేము ఆరేళ్ళుగా ఏదో నాలుగు రాళ్ళు వెనకేసుకుంటే మీకేమైందని ఒక్కరొక్కరు ఎద్దేవా చేసుకుంటున్నారు. అధికారులు ఉద్యోగులలో కూడా పార్టీలున్నాయి. మొన్నటిదాకా వెనక నుండి సపోర్టు చేసే వాళ్ళు కాస్తా ఇప్పుడు డైరెక్టుగా పార్టీలకి మద్దతిస్తున్నారు. అందులో కులం, మతం, ప్రాంతం ఇవన్ని వచ్చి చేరుతున్నాయి. మన కులపోడైతే దొంగైనా వెనకేసుకురావడం. మన ప్రాంతం వాడైతే

అవినీతి పరుడైనా వాడి తరపును వకాల్తా పుచ్చుకొని వాదించడం. మన వాడైతే ఒకనీతి, పరాయివాడైతే మరోనీతి. ఇదీ ప్రపంచంగా మారింది.

ఇలా అప్పుడప్పుడు రైళ్ళలో ప్రయాణం చేస్తున్నప్పుడు అంతకుముందు పరిచయాలు లేని ప్రయణికులు కూడా వారి వృత్తి గురించి, కుటుంబం గురించి మాట్లాడుకున్నాకా వెంటనే టాపిక్ రాజకీయాల వైపు మళ్ళుతుంది. అప్పుడు నేను ఆశపడతాను వీళ్ళ చర్చ సరైన దిశలో సాగి రాజకీయాలకు అసలైన అర్థాన్ని తెలుసుకుంటారని, నలుగురికి తెలియచెప్తారని అత్యాశ పడుతుంటాను. కానీ నా ఆశ ఎప్పుడు నిరాశే అవుతుంది. ఎందుకంటే "ఈ సమాజాన్ని మనమెవరము మార్చలేమని ఇది ఇలా సాగుతూనే పోతుందని మనం రైలు ప్రయాణికులలాగానే మన గమ్యం రాగానే దిగిపోయేవార"మని తేల్చిపారేస్తారు.

నా దృష్టి ఎదుటి సీట్లోని ఇద్దరు పోలీసులపై పడింది. వారిపక్కనే రైల్లో మరో నలుగురు చిరిగిన బట్టలతో, మాసిన గడ్డాలతో స్నానం చేసి ఏన్నాళ్ళయిందో అన్నట్లుగా మురికి శరీరాలతో బేలగా నేలకు చూస్తూ కింద కూర్చున్నారు. వారి చేతులకి బేడీలు వేసి ఉన్నాయి. ఆ బేడీలకి మరో పొడవాటి గొలుసు తగిలించి దాన్ని రైలు కిటికీ కమ్మిలకి కట్టి మరో తాళం వేశారు. వాళ్ళని కాలకృత్యాలకు తీసుకెళ్ళాల్సి వచ్చినా బేడీలు తీయకుండానే ఇద్దరు పోలీసులు గొలుసు చేతిలో పట్టుకొని టాయిలెట్ దాకా వారితో వెళ్ళొస్తున్నారు. మిగతా వారికి బేడీలతో పాటు కిటకీకే గొలుసెందుకు కట్టారో లీలాగా అర్థమైంది నాకు. నాకున్న "క్యూరియా సిటితో" వీళ్ళేం నేరం చేశారని పోలీసులను అడిగాను. "ఏముంది సార్ సంతలో వీళ్ళు జేబుదొంగతనాలు చేశారని కేసు పెట్టాం, వీళ్ళేమో కోర్టులో నేరం ఒప్పుకొండిరా అంటే ఒప్పుకోరు ఇలా కోర్టు చుట్టూ తిరుగుతూ, జైలు కూడు తింటూ హాయిగా ఉంటూ మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు" అన్నారు ఆ పోలీసులు. "చేయని నేరానికి వాళ్ళను ఒప్పుకోమని అనడం ఎందుకని" నేనన్నాను. "నేరం ఒప్పుకుంటే ఆర్నెల్లు జైలు, రెండొందల యాభై రూపాయల జరిమానా, అదీ కట్టలేకపోతే మరో నెల రోజులు జైలుతో సరిపోయేది సార్, కానీ వీళ్ళను గత ఆరేళ్ళుగా కోర్టు చుట్టూ తిప్పుతున్నాము, వీళ్ళకు శిక్షా పడదు, మాకు ఈ యాతనా తప్పదు" అన్నారు పోలీసులు.

పవిత్రమైన అధ్యాపక వృత్తిలో ఉండి పిల్లలకు చదువు చెప్పే బాధ్యతనుండి తప్పించుకుంటున్న టీచర్లు, పేదల ఆరోగ్యం కోసం కోట్లు ఖర్చు పెడుతున్న ప్రజల డబ్బును జీతాలుగా తీసుకుంటున్న వైద్యసిబ్బందిని, ఏళ్ళ తరబడి న్యాయం అందక న్యాయం కోసం కోర్టు తలుపులు తట్టడానికి భయపడేలా చేస్తున్న అవినీతి న్యాయవ్యవస్థను, ప్రజాసేవకై వచ్చామని చెప్తూతూ కిందినుండి పైదాకా పైరవీలకీ, లంచాలకీ అలవాటుపడి సమాజ సంపదను స్వాహచేస్తున్న రాజకీయ నాయకుల ఆగడాలను అరికట్టలేని మధ్యతరగతి మనుషులకి ఒక సందేహం తప్పకుండా వస్తుంది. "బేడీలు వేయవలసింది, జేబు దొంగలకా విధులు ఎగ్గొట్టే ఉద్యోగులకా, ప్రజాధనాన్ని దర్జాగా భోంచేస్తున్న రాజకీయ నాయకులకా" అనేదే సందేహం.

"వరంగల్ వచ్చింది నేను దిగిపోవాలి, కాని సమాజం అనే ఈ రైలు విజయవాడ వరకే కాదు, దేశమంతా తిరుగుతూనే ఉంటుంది. కొన్ని వేల రైళ్ళు, కోట్ల మంది ప్రజలు, కొద్దిమందే రాజకీయ నాయకులు, ఉద్యోగులు. పన్నులు కట్టే ప్రజలదా రాజ్యం, లేక ఆ పన్నులను మెక్కే అధికార యంత్రాంగానిదా, రాజకీయ పార్టీలదా, నాయకులదా ప్రశ్నించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాలి. అందుకే ఈ వ్యవస్థను ప్రశ్నించాలి, సంస్కరించాలి. దానికి మనమందరం సమాయత్తం కావాలి." నేను చెప్పేమాటలను సమావేశంలో వున్నవారందరూ ఆసక్తిగా వింటున్నారు, చప్పట్లుకొడుతున్నారు, కానీ ఈ మాటల ప్రభావం ఎంతసేపుంటుంది, మీటింగ్ తరవాత ఎవరిళ్ళకు వారెళతారా! **ఈ చెవితో విని ఆచెవితో వదిలేస్తారా! మీరే ఆలోచించండి.** ✻

## గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాల కల్పన

**(24 వ పేజి తరువాయి)**

మౌలిక సదుపాయాల మీద జరిగిన ఒక అధ్యయనం ప్రకారం రాష్ట్రాల మధ్య 30% వ్యత్యాసం ఉండగా జిల్లాల మధ్య 18% మరియు ఒక జిల్లాలోని గ్రామాల మధ్య ఈ వ్యత్యాసా సూచిక 52% చూపెడుతుండడం గమనార్హం. ఈ అధ్యయనం ప్రకారం ఒక పక్కా ప్రణాళిక ప్రకారం గ్రామాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి జరుగవలసిన కృషి యొక్క ఆవశ్యకతను సుస్పష్టం చేసింది. ఈ ప్రణాళికలో పూర్తిగా వెనుకబడ్డ గ్రామాలను, అందులోనూ జిల్లా కేంద్రానికి పూర్తిగా దూరంగా ఉన్న గ్రామాలను కలిగిన రాష్ట్రాలను ఎంచుకుని వాటి అభివృద్ధికి తక్షణమే శ్రీకారం చుట్టాలి.

భారత్ నిర్మాణ యోజన పథకం కింద నిర్దేశించుకున్న లక్ష్యాలను చేధించుకునే ప్రయత్నంలో కొట్టుమిట్టాడుతున్న దేశానికి, పక్వానికి వస్తున్న పండ్లపైనే ఆశ కలగడం ఒక విధమైన బలహీనత! ఈ పాటికే కొంతైనా అభివృద్ధి చెందిన గ్రామాలపై మొగ్గు చూపించాలనిపించడం, పట్టణాలకు కాస్త దగ్గరగా అనువుగా ఉన్నా గ్రామాలను ఎంచుకుంటే అభివృద్ధి సులభతర మవుతుందనిపించడం సహజం!

కాని, ఇలాంటప్పుడే స్వీయ నియంత్రణ అవసరం. మనం ఈ బలహీనతలను జయించి అట్టడగు స్థాయిలో ఉన్న గ్రామాలను అభివృద్ధి పథంలోకి నడిపించినప్పుడే సర్వతోముఖాభివృద్ధి సాధించి సమున్నతంగా నిలుస్తాం. సగర్వంగా "సారే జహాసే అచ్చా..." అని పాడుకోగల్గుతాం. ✻

**(ది ఎకనామిక్ టైమ్స్ సౌజన్యంతో... అనువాదం: అజీజ్ & మానస)**

## స్వాతంత్ర్య పోరాట ఫలితం

# బానిస రాజ్యం పోయి – బారుల (మద్యం) రాజ్యమా?

- అనుమోలు రాఘవయ్య

ఈస్ట్ ఇండియా కంపెనీ ద్వారా మనదేశంలో ప్రవేశించి, నెమ్మదిగా మన దేశంలోని కుల,మత, వ్యవస్థలను రెచ్చగొట్టి విభజించు పాలించు అనే సిద్ధాంతంతో మన దేశాన్ని పరిపాలిస్తున్న బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా అనేక మంది నాయకులు, ప్రజలు ప్రాణాలను అర్పించి స్వరాజ్యం సంపాదించారు. ఆనాటి త్యాగధనుల కలలుమన పల్లె సీమలు సస్యశ్యామలంగా ఉండాలని, దేశ ప్రజలందరు ముఖ్యంగా సామాన్య ప్రజలు సుఖ సంతోషాలతో అభివృద్ధి చెందాలనేది.

మన దేశాన్ని మనమే పరిపాలించుకొనేందుకు వీలుగా దేశాన్ని ప్రజాస్వామ్యదేశంగా చేసుకొని రాజ్యాంగాన్ని రచించుకొన్నాం. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ ఒక ముఖ్య అంశం. దానిలో రాజకీయ పార్టీలు ఒక భాగం మాత్రమే.

స్వాతంత్ర్యానంతరం దేశం అభివృద్ధి చెందినదనేది నిర్వివాదాంశం. కాని ప్రపంచీకరణ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి వలన అనేక సౌకర్యాలు ప్రజల ముందుకు వచ్చినప్పటికీ, కార్పొరేట్ కంపెనీలు లాభాపేక్షకై, వాటి మధ్య గల పోటీలో నిలదొక్కు కొనటానికి మన ప్రభుత్వాలు నడుపుతున్న పార్టీలను పావులుగా చేసి ప్రభుత్వాలపై అజమాయిషీ చేస్తున్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న సంస్థానాల విలీనం జరిగినప్పటికి, ప్రజాస్వామ్యం ముసుగులో ప్రస్తుత ప్రజా ప్రతినిధులు, దౌర్భాగ్యవశాత్తు, అదేరీతిలో మన ప్రభుత్వాలను నడుపుతున్న రాజకీయ పార్టీలు, ప్రపంచీకరణ, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి వలన, ప్రజల ముందుకు వచ్చిన అనేక సౌకర్యాలను, ఆయా కంపెనీల వ్యాపార కేంద్రాల అభివృద్ధికి ఉపయోగపడే విధంగా ప్రభుత్వ విధానాలు రూపొందిస్తున్నాయి.

ఆ విధంగా ప్రజలకు అవసరమైన ఆరోగ్యం, చదువు త్రాగునీరు సాగునీరు వంటి వాటిని ప్రైవేటీకరణ చేసి అవి వ్యాపారంగా మార్చి ప్రజా సంక్షేమం కన్నా ఆయా కంపెనీల లాభాపేక్షలకే ప్రాధాన్యమిస్తున్న తీరు మనమందరం గమనిస్తూనే ఉన్నాం.

పైన చెప్పిన ప్రజా సంక్షేమాలను ప్రైవేటీకరించి సామాన్య కుటుంబాలను పట్టి పీడిస్తున్న మద్యాన్ని ఆదాయ వనరుగా ఎంచుకొని, ఆ వ్యాపారాన్ని దినదినాభివృద్ధి పరుస్తున్న ప్రభుత్వాలు రాజకీయ పార్టీలతీరు ఆ వ్యాపారానికి రాజకీయ పార్టీలనుండి ఎంపికైన ప్రజా ప్రతినిధులకు సంబంధాలు ఉండటము, అటువంటి ప్రజా ప్రతినిధుల నిర్ణయాలు, ప్రజా శ్రేయస్సుకు, (అభివృద్ధి లేకున్నా) ఉంటాయని ఎవరైనా అనుకొంటే అంతకన్నా ఆత్మాహుతి మరొకటి ఉండదు.

ప్రభుత్వాలు నడుపుతున్న రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆదాయాలు పెరిగి దామాషాలో సామాన్యుల అభివృద్ధి జరుగుతోందా, పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్న నిధులు ఎంత? మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వాల రాబడి ఎంత? ప్రభుత్వాలు నడుపుతున్న ప్రజా ప్రతినిధుల ఆదాయము పెరుగుతున్న మార్గాలు ఏవి అనేది జగమెరిగిన సత్యం.

ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా ఎంచుకొని సామాన్యుల కుటుంబాల రక్తాన్ని పీల్చుతూ, వారి సంక్షేమానికై ఖర్చు చేయటం వలన, ప్రభుత్వం చేసే ఖర్చులో ఎక్కువ నిరుపయోగమౌతోందన్నది కూడా నిర్వివాదాంశమే. అయినప్పటికి ఇప్పటి వరకు మన రాష్ట్రంలో ప్రభుత్వాలు నడిపిన కాంగ్రెస్ తెలుగు దేశం పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ఒక విధంగా స్పందించటం ఆయా పార్టీల దివాలాకోరు రాజకీయాలకు పరాకాష్ట.

ప్రస్తుతం ప్రభుత్వాన్ని నడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ఎక్సైజ్ విధానంలో భాగంగా విడుదల చేసిన ఉత్తర్వులను బట్టి మనం ఎన్నుకొన్న ప్రభుత్వాలకు (కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు) ప్రజా సంక్షేమానికి ఎంత ప్రాముఖ్యం ఉందో తేట తెల్లమవుతోంది. జనాభా ప్రాతిపదికన బారులు ఏర్పాటుకు ఉత్తర్వులనుని నిసిగ్గుగా ఇచ్చారంటే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు (ఓటర్లు) అంటే ఆయా పార్టీలకు ఎంత చులకన భావన ఉన్నదో ప్రతి ఒక్కరు మనన చేసుకొని వాటి తీరును ప్రతిఘటించవలసిన ఆవశ్యకత ఉన్నది.

జనాభా ప్రాతి పదికన ప్రజావసరాలైన విద్య, వైద్యం మరియు రక్షణకు ఉండవలసినవి.

ప్రభుత్వాలు నడుపుతున్న రాజకీయ పార్టీలు నిస్సిగ్గుతో తీసుకుంటున్న నిర్ణయాలు అనేకం. ఇది ఒక మచ్చుతునక మాత్రమే. అటువంటి నిర్ణయాల వలన మనం అనేక ఇబ్బందులకు గురి అవుతున్నపటికీ రాజకీయ పార్టీలతీరులో వీస మంతైనను మార్పు లేదనేది కూడా మనందరం ఆమోదించే సత్యమే. కాబట్టి రాజకీయ పార్టీల తీరు మారనిదే ఇటువంటి నిర్ణయాలు మారవు.

రాజకీయాల తీరు మార్పునకై (అధికార దాహం లేకుండా) డా॥ జయప్రకాష్ నారాయణ్ గారి నాయకత్వంలో పోరాడుతున్న లోక్‌సత్తా పార్టీతో చేయి చేయి కలిపి రాజకీయాల తీరు మార్పులకు సహకరించటం మనందరి బాధ్యత.

రాజకీయాల తీరు మార్చటమనేది అసాధ్య ప్రక్రియ కాదు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకొనడం ద్వారా, రాజకీయాల తీరును మార్చగలం. *

### అతడికి చదువు చెప్పిన గురువును

# గోడకుర్చీ వేయించాలి

- కొంగర గంగాధర రావు

## ఎక్కడైనా.. దమ్ము కొడతా!

### పాఠశాలలో పొగతాగిన ఎమ్మెల్యే ఆనం

(ఆన్‌లైన్, నెల్లూరు)



పాఠశాలలో సిగార్ తాగుతున్న ఎమ్మెల్యే ఆనం

'బాబ్బాబూ మీరెన్నా చెప్పండి... పొగ మాత్రం మానను. ఎక్కడైనా..ఎప్పుడైనా సరే.. చుట్ట, బీడీ, సిగరెట్టు తప్పక కాలుస్తా... అంటూ కుండబద్దలు కొట్టే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకా నంద రెడ్డి బుధవారం అన్నంత పనిచేశారు. నెల్లూరు నగరంలోని సుంకు చెంగన్న మున్సిపల్ ఉన్నతపాఠశాలలో బుధవారం పాఠ్యపుస్తకాల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఆయన తాపీగా ప్రధానోపాధ్యాయురాలి సీట్లో కూర్చుని దమ్ము బిగించాడు. నగర ప్రథమ పౌరురాలు (మేయర్), కార్పొరేటర్లు, ఉపాధ్యాయులు అందరూ ఉండగానే ఇలా చేయడం గమనార్హం. బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగడం నిషిద్ధమని ఆయన తెలియదా? అయినా పాఠశాలలోనే ఇలా చేయడం ఎంత వరకు సబబు అని.. అక్కడున్న కొందరు చెవులు కొరుక్కున్నారు.

'విద్య రానివాడు వింత పశువు" అన్నారు. సంస్కారం లేనివాడిని ఏమనాలో తెలియదు. ఎమ్మెల్యే అనాలేమో? కాదనే ఎమ్మెల్యేలందరూ ఇతడి ఎమ్మెల్యే గిరి పీకేయగలరా?

'పొగ తాగని వాడు దున్న పోతై పుట్టున్' అన్నారు. అంటే ఈ జన్మలో పొగ తాగని వాళ్ళు వచ్చే జన్మలో పొగతాగటానికి దున్నపోతుగా పుట్టాలన్నమాట. అంటే పొగతాగే వాళ్ళంతా దున్నపోతులన్నమాట. మరి ఈ పొగ తాగే ...... ని ఏం అనాలి?

పవిత్రమైన విద్యాలయంలో అందునా ప్రధానోపాధ్యాయురాల్ని నించోబెట్టి, ఆమె కుర్చీలో కూర్చొని పొగతాగే ఈ .....ని ఏమనాలి? ఏ సంస్కృతికి నిదర్శనమిది?

ఇతనికి చదువు చెప్పిందెవరు? ఆ గురువు చెవులు పిండాలి. అతడిని గోడకుర్చీ వేయించాలి.

ఇలాంటి ప్రజా ప్రతినిధులను ఎన్నుకున్న ప్రజలను ఏమనాలి? తలా వంద కొరడాదెబ్బలు వడ్డించాలి. ఈ దుష్కృత్యాన్ని చూస్తూ కూర్చున్న మేయర్ని, కార్పోరేటర్లని ఏమనాలి? ఇంటికి పిలిచి మొహం మీద పేడ కళ్ళాపి జల్లాలి.

ఈ ..... ని కన్న తల్లిదండ్రులు.....?

వీళ్ళకేం శిక్ష.. ఏ శిక్షా చాలదు.

అన్నట్లు ఈ ఎమ్మెల్యే అన్నగారు కూడా ఎమ్మెల్యేనే. ఆయన మంత్రివర్యులు కూడా. సోదరుడి ఘనకార్యాలు ఈ ధృతరాష్ట్రుడికి తెలియవా?

అసలు ఈ దృశ్యం చూస్తూ, పుడుతున్న కంపరాన్ని సహిస్తున్న మనల్ని ఏమనాలి? అసహ్యం వేస్తోంది. విలువలు ఇంతగా క్షీణించాయా?

నెల్లూరు ప్రజలు ఇతగాడిని ఎలా భరిస్తున్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు పుట్టిన జిల్లాయేనా ఇది? ముఖ్యమంత్రి రోశయ్య పెద్దరికం ఇదేనా? కాంగ్రెస్ అధిష్టానం ఏం చేస్తోంది. నవతరం ప్రతినిధిగా రాహుల్‌గాంధీ రాస్తున్న సరికొత్త భారతం ఇదేనా?

మారాలి. ఈ రాజకీయం మారాలి. ఆ పార్టీ, ఈ పార్టీ అని కాదు. అన్ని పార్టీల్లోనూ ఇలాంటివారే రాజ్యమేలుతున్నారు. కాకపోతే వాళ్ళు మేకతోలు కప్పుకుంటారు. ఇతనికి ఆ భయాలేవీ లేవు కాబట్టి విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నాడు. బహిరంగంగా పొగతాగుతున్నాడు. విద్యామతల్లిని కొంగు పట్టి లాగుతున్నాడు. ఇలాంటి వారిని కొరత వేయించాలి.

ఆ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు రేపటి నుండి నేర్చుకునేదేమిటి? విద్యార్థులు ఆ ప్రధానోపాధ్యాయురాలిని గౌరవిస్తారా? ఆ ఉపాధ్యాయులు పాఠాలు చెప్పగలరా? చెపితే ఏం చెప్తుతారు?

చరిత్ర చెప్పే నిజాలెన్నో. చాణక్యుణ్ణి అవమానించిన నందవంశ రాజరికం నశించింది.

ఏ నాగరికత పరిఢవిల్లడానికైనా విద్యే ప్రధానం. గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వరః గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్ శ్రీ గురవే నమః అని మన శాస్త్రాలు గురువుని దేవుడితో సమానంగా గౌరవించాయి. కాని ఏడుకొండలవాడికీ పంగనామాలు పెట్టే ఈ రోజుల్లో గురువుల గోడు పట్టించుకొనేదెవ్వరు.

(వ్యక్తిగత దూషణలకు లోక్‌సత్తా విరుద్ధం. కాని ఇక్కడ కనబడుతున్నది ఒక వ్యక్తి కాదు. ఒక విష సంస్కృతి జడలు విప్పుకొని వికటాట్టహాసమాడుతున్న దౌష్ట్యం. దీన్ని మనం సహిస్తే మన తరువాత తరాల వారి ముందు మనం సిగ్గుపడాలి. అందుకే ఈ తీవ్ర ఖండన.) ✻

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం

## నిజామాబాద్ జిల్లా




**మద్యనియంత్రణ ఉద్యమ నాయకులపై వ్యాపారుల దాడి**

**నిజామాబాద్:** మహిళా సత్తా నాయకులపై ఒంగోలు, గుంటూరులో లిక్కర్ వ్యాపారస్థులు చేసిన దాడులకు నిరసనగా నిజామాబాద్ జిల్లా మహిళా సత్తా అధ్యక్షురాలు ఎ.కె.లత ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసనలు తెలుపుతూ డిఆర్‌ఓ అశోక్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై మహిళా సత్తా నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు లత మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా మద్యం దుకాణాలు వారు సిట్టింగ్ రూమ్‌లు నిర్వహించడం ఒక పక్క బెల్ట్ షాపులు జోరుగా నడవడం మరో పక్క విచ్చలవిడిగా నడుస్తున్న తరుణంలో లోక్‌సత్తా నాయకులు నాలుగు పక్కల నుండి వారి వ్యాపారాలపై దృష్టి పెట్టి చట్ట విరుద్ధంగా వ్యాపారం కొనసాగిసున్నని బెల్ట్ షాపులను మూసి వేయించే ప్రయత్నం చేస్తున్నారు. ఒంగోలు పట్టణంలోని ఒక వైన్ షాపులో అక్రమంగా సిట్టింగ్ రూమ్‌ను నిర్వహిస్తూ నాసిరకం మద్యం అమ్ముతున్నారన్న పక్కా సమాచారం తో లోక్‌సత్తా నాయకులు అక్కడికి చేరుకున్నారు. షాపు యజమాని రాజకీయ అండతో లోక్‌సత్తా అనుబంధ మహిళసత్తా నర్సారావు పేట అధ్యక్షురాలు జి.నిర్మలబోస్ పై బెల్ట్ షాపు నిర్వాహకులు భౌతిక దాడి చేయడంతో పాటు ఎదురు కేసులు పెట్టేందుకు యత్నించారని మహిళా సత్తా ఆరోపించింది. సమాజహితాన్ని ప్రజల హక్కుల్ని కాల రాసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం వలనే ఇలాంటి సంఘటనలు భౌతిక దాడులు అరెస్ట్‌లు జరుగుతున్నాయని మహిళాసత్తా ధ్వజం ఎత్తింది. లౌసెన్స్ లేకుండా బెల్ట్ షాప్‌లో మద్యం అమ్మడం సిట్టింగ్ రూమ్‌లు నిర్వహించడం నాన్ బెయిలబుల్, శిక్షార్హమైన నేరం అలాంటి నేరాలను నివారించే నిరోధించే బాధ్యత అధికారం ప్రజలకు ఉంది అన్నారు.

క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ సెక్షన్ 43 ప్రకారం అలాంటి సందర్భాలలో నిర్వహకులను ప్రజా అరెస్ట్ చేసి పోలీసుకు లేదా స్థానిక మెజిస్ట్రేట్‌కు అప్పగించాలి. అదే తరుణంలో లోక్‌సత్తా, యువసత్తా, మహిళాసత్తా చేస్తున్న ప్రయత్నంలో బెల్ట్-షాప్‌లు, వైన్స్‌ల ప్రక్కన సిట్టింగ్ నిర్వహించే వారు భౌతిక దాడులకు దిగి రాజకీయ అండతో అరెస్ట్ చేయించి. అక్రమ కేసులు బనాయిస్తున్నారని మహిళా సత్తా ఆరోపించింది. ఇలాంటి విషయాలపై ఎక్సైజ్ శాఖ మౌనం పాటించడం వెనుక ఆంతర్యం ఏమిటి అని లోక్‌సత్తా ఎక్సైజ్ శాఖను ప్రశ్నించింది. పోలీసులు అక్రమ కేసులు పెట్టడం ఎక్సైజ్ శాఖ మౌనం పాటించడంతో లిక్కర్ లాబీలతో కుమ్మకై మామూళ్ళ మత్తులో వారు ఏం చేస్తున్నారో వారికే తెలియని స్థితిలో ఉన్నారని మహిళా సత్తా ఆరోపించింది.



**నోటుతో, మద్యంతో ఓటును కొనలేరు**

**నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ జిల్లాలో ఉప ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా బరిలో ఉన్న అభ్యర్థులు చేసే ఖర్చు, మద్యం సరఫరా చేసే దానిపై లోక్‌సత్తా పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. కులాలు, భాషల పేర్లతో ప్రజలను విభజించి ఓట్లు దండుకునే యత్నం చేస్తున్నారని నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ఇంచార్జి దొడ్లె శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉప ఎన్నికల పోటీలో ఉన్న నాయకులు కులాల పేరుతో, మతాల పేరుతో ప్రాంతాల పేరుతో ప్రజలను విడగొట్టి ఓట్లే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి నాయకులను నమ్మవద్దని ఆయన ఓటర్లను కోరారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటుకు చాలా విలువ ఉందని, ఓటును నోటుతో కొనరాదని, ప్రజలను బిచ్చగాళ్ళను చేయరాదని బరిలో ఉన్న అభ్యర్థులను ఆయన కోరారు. అర్బన్ నియోజకవర్గంలో మైనార్టీలను, మహిళలను చాలావరకు మభ్యపెట్టి, మాయమాటలు

చెప్పి ఓట్లను దండుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ప్రజలు చైతన్యవంతులు అయ్యారని, డబ్బుకు, మద్యానికి ఎవరిని నమ్మలేని విధంగా ఉన్నారన్నారు. మంచి నాయకునికే ఓటు వేసి గెలిపిస్తారని ఆయన తెలిపారు. జిల్లా నలుమూలల నుండి ప్రజలను సమీకరించి కేంద్ర రాష్ట్ర నాయకులను రప్పించడం ఎన్నికల ఖర్చులో భాగం కాదా అని లోక్‌సత్తా పార్టీ అధికార ప్రతినిధి రమేష్ బాబు ఎన్నికల కమీషన్‌ను ప్రశ్నించారు. బరిలో ఉన్న అభ్యర్థులు పెద్ద ఎత్తున మద్యం సప్లై చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వైన్స్‌లు, బార్‌లు తెరిచి ఉంచే సమయాన్ని ఉదయం 10 నుండి సాయంత్రం 6 గంటలవరకు ఉంచాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆయన కోరారు. ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులపై లోక్‌సత్తా నాయకులు దృష్టి పెట్టి సెల్‌ఫోన్ ద్వారా, ఫొటోల ద్వారా, కెమేరాలతో వీడియో షూటింగ్‌లతో చిత్రీకరించి ఎన్నికల ఘట్టం ముగిసిన అనంతరం ఎన్నికల కమీషన్‌కు నివేదిక పొందుపర్చనున్నట్లు ఆయన తెలిపారు. సాక్ష్యాధారాలను ఎన్నికల కమీషన్ గ్రహించి గెలుపొందిన అభ్యర్థి తప్పు చేసినట్లయితే హైకోర్టు ఆదేశాల ప్రకారం వారి గెలుపును రద్దు చేస్తామనడంతో లోక్‌సత్తా పార్టీ ఒక అడుగు ముందుకు వేసిందని ఆయన అభిప్రాయపడ్డారు.

### పెట్రేగిన ప్రేమోన్మాది

**నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ నగరంలో ప్రేమోన్మాది పైశాచిక చర్యకు ఓ యువతి జీవితం గుగ్గిపాలైంది. ప్రేమోన్మాది పెట్రేగి ఓ యువతి పై కిరోసిన్ పోసి నిప్పు పెట్టిన సంఘటన చోటు చేసుకుంది. నగరంలో పోచమ్మ గల్లిలో నివసించే గౌతమి (19) అనే యువతి పై బొబ్బిలి వీధిలో ఉండే నరేందర్ అనే యువకుడు అమ్మాయి ఇంట్లోకి వెళ్ళి ఆమెపై కిరోసిన్ పోసి నిప్పుపెట్టాడు. దీంతో గౌతమి కాళ్ళు, చేతులు కాలిపోయాయి.

స్త్రీలపై హింసను ప్రతిఘటించండి...

**మహిళాసత్తా జిల్లా అధ్యక్షురాలు ఎ.కె.లత**

"ప్రేమ పేరుతో స్త్రీలపై జరుగుతున్న హింసను ప్రతిఘటించండి. స్త్రీలపై ప్రేమ పేరుతో స్త్రీలపై జరుగుతున్న హింసా, మానసిక, శారీరక దాడులను ప్రశ్నించడం మేధావుల పాత్రకే పరిమితం కాకుండా స్త్రీలు, మహిళలు ప్రతిఘటన ఉద్యమాలకు సిద్దం కావాలని" నిజామాబాద్ జిల్లా మహిళాసత్తా అధ్యక్షురాలు ఎ.కె.లత పిలుపునిచ్చారు.

రాజకీయ విష సంస్కృతి, టీవీలు, సినిమాలు, అశ్లీల సంస్కృతికి, ఆచారాలకు దూరంగా ఉండాలని ఆమె పేర్కొంది. ప్రేమ పేరుతో జరుగుతున్న హింసాలను స్త్రీలు ఎదిరించే క్రమంలో పురుషులు భాగస్వాములు కావాలని ఆమె కోరారు. కాని ఇప్పుడు డబ్బులు, ఆకర్షణ, అందం సెక్స్, పబ్స్ వ్యాసనాల వల్ల అరాచకాలు జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ రోజులలో కుటుంబంతో కలసి పిల్లలతో స్వేచ్ఛగా పార్కులోకి వెళ్ళడం గాని, సినిమాలు చూసే పరిస్థితి లేకుండాపోయిందని ఆమె వాపోయారు. తల్లితండ్రులు తమ పిల్లలు చేసుకునే దుస్తులు, నడవడిక, తీరు ఎప్పటికప్పుడు గమనించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. విద్యార్థులు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు, మహిళలు విద్యా సంస్థలను వేదికగా చేసుకొని మహిళలపై జరిగే దాడులను అరికట్టడానికి విద్యార్థుల్లో చైతన్యం వచ్చే విధంగా అవగాహన కల్పించే కార్యక్రమాలు చేస్తే బాగుంటుందని ఆమె అభిప్రాయపడ్డారు.

## విజయవాడ అర్బన్ జిల్లా




### 'సారా' పార్టీలను ప్రజలు తిరస్కరించాలి

**విజయవాడ (అర్బన్) :** 723 జి.ఓ. ద్వారా జనాభా ప్రాతిపదికన బార్లు ఏర్పాటు చేయాలన్న పద్ధతిని నిరసిస్తూ లోక్‌సత్తా పార్టీ విజయవాడ అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ వద్ద ప్లకార్డ్స్‌తో పెద్ద ఎత్తున కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. 723 జి.ఓ.ను రద్దు చేయాలని కఠిన మద్యనియంత్రణ అమలు పరచాలని నినాదాలు చేసారు.

ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అర్బన్ అధ్యక్షులు చుండూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'జనాభాకి అవసరమైన ఆసుపత్రులు కాని, కోర్టులు కాని, పాఠశాలలు గాని ఏర్పరచని ప్రభుత్వం మద్యాన్ని బలవంతంగా తాగించడానికి తద్వారా తమ అక్రమ అర్జన పెంచుకోవటానికి వివిధ పద్ధతులను అన్వేషిస్తుందని, ప్రజారోగ్యాన్ని, వారి జీవన విధానాన్ని నాశనము చేయటమే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమంగా మనం భావించాలి అన్నారు. మహిళా సత్తా కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జనాకర్షణ పథకాలు పెట్టి వారిని ప్రలోభపెట్టడం, గెలవటం తర్వాత ప్రజావిరుద్ధమైన కార్యక్రమాలు చేపట్టడం, వ్యాపార పార్టీలకు, సారా పార్టీలకు రివాజు అయ్యిందన్నారు. వీటి నిజ స్వరూపాలను ప్రజలు గ్రహించి రాజ్యాధికారాన్నుంచి వీరిని దూరం చేయవలసిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా అర్బన్ కార్యదర్శి బండ్లమూడి మురళీకృష్ణ, బందారు పూర్ణచంద్రరావు, మహిళాసత్తా అధ్యక్షులు నాగమణి, కార్యదర్శి శ్రీదేవి, విజయలక్ష్మి, యువసత్తా నాయకులు

గట్టంశివ, డివిజన్ నాయకులు బి. అశోక్‌కుమార్, బూర్ల కొండలరావు, డాంగె కృష్ణారావు, గౌరిశంకర్, ఏసుపాదం (మధు) వి. సురేష్ శరత్, జగన్ మోహన్‌రావు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయనగరం జిల్లా

## రోడ్లు విస్తరణకు చర్యలు చేపట్టాలి

**బొబ్బిలి :** పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్ర రూపం దాల్చేందుకు కారణమైన రోడ్లను విస్తరించేందుకు పాలకులు, అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలి. గంగరాజు, భాస్కర్ స్థానిక దక్షిణ దేవుడి వద్ద ప్రధాన కూడలిలో జూన్ 26న ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. ఈ మేరకు రోడ్ల విస్తారణ చేయాలా? వద్దా అనే అంశంపై బ్యాలెట్ ద్వారా ప్రజా నిర్ణయాన్ని ఈ బాక్సులో వేసేందుకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ల వెడల్పు లేకపోవడం వల్ల తరుచుగా ప్రమాదం జరుగుతున్నవి. అయినప్పటికీ అధికారులు శాశ్వత పరిష్కారమార్గం ఆలోచించకపోవడం విచారకరం. ఈ విషయంపై ప్రజల నుంచి వచ్చిన నిర్ణయాన్ని పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళతాం. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మి బి. అర్జున్ పాల్గొన్నారు.

## ధరలు తగ్గించకపోతే గుణపాఠం తప్పదు

**గజపతినగరం :** పెంచిన పెట్రోలియం ఉత్పత్తుల ధరలు తగ్గించకపోతే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు. జూన్ 28న స్థానిక ఎస్.టి.ఐ. ఎదురుగా పెంచిన ధరలకు నిరసనగా పార్టీల ఆధ్వర్యంలో స్టాల్‌ను ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో మాటమార్చిన ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారు. నిన్నటివరకు ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రజలను మభ్యపెట్టి అడ్డదారిలో అధికారం చేజిక్కించుకుని సామాన్య మానవుని నడ్డి విరిచేలా ధరలను పెంచిందని చరిత్రలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా రోజుకొక పరిస్థితి ఎదుర్కొనే దుర్భర జీవితం ఎదుర్కొనాల్సి రావడం దురదృష్టకరం. ప్రతీరోజు కార్మికులు 150 నుంచి 200 రూపాయల వరకు సంపాదించుకుంటే అది కుటుంబానికి అందజేయక మద్యానికి బానిసలై తమ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు. పెంచిన ధరలు తట్టుకోలేక ప్రతీ కుటుంబంలో అశాంతి రోజురోజుకు పెరిగిపోతుంది. ఈ సందర్భంగా సామాన్యుడు ధరలు తట్టుకోలేక ఉరి పోసుకున్నట్టు దిష్టిబొమ్మను వేలాడదీశారు. ఈ కార్యక్రమంలో యు.వర్మరాజు, వి.ఎస్. ఆర్ జోగారావు, తిరుమలరాజు రామలింగరాజు, బి.టి. రమణానంద్, రాంబాబు, విష్ణు, పి. గౌరినాయుడు పాల్గొన్నారు.

## నిజాయితీ అధికారులకు భద్రత లేదు

**బొబ్బిలి :** కాంగ్రెస్ పార్టీ అధికారంలో జిల్లా స్థాయి అధికారుల




బదిలీలు రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా జరిగాయి. నిజాయితీగా పనిచేద్దామన్న అధికారులకు భద్రత లేని పరిస్థితి జిల్లాలో నెలకొంది. జూన్ 24న పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జిల్లాలో ఒక మంత్రి అత్యంత ఘోరంగా, ప్రజాహితానికి వ్యతిరేకంగా, బజారు రౌడిలా అధికారులను బెదిరిస్తున్నారు. అధికారులే పత్రికలకు ఎక్కడం విడ్డూరంగా ఉంది బదిలీలలో జిల్లా స్థాయి అధికారులకే టికానా లేకపోతే ఇక గ్రామస్థాయి నుంచి మండల స్థాయి, డివిజన్ స్థాయి అధికారు వరకూ నిజాయితీగా ఏం పనిచేస్తున్నారు? మంత్రుల అరాచకాల బదిలీలపై ఉద్యోగ సంఘాలు, ప్రజాసంఘాలు పెదవి విప్పక పోతే ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదం. గతంలో పార్వతీపురం ఐటిడిఏపిఓ యోగితారాణా, ఆర్ డిఓ ప్రశాంతి, ఎటిడబ్ల్యుఓ బొత్స బాబ్జీ, ఆర్డీఓ సత్యనారాయణ, పిఓ రామారావు, ఎఎస్ పి ఆకే రవికృష్ణ, డిప్యూటీ డిఎమ్ హెచ్ ఓ డాక్టర్ శంకరరావు బదిలీ ఈ జాబితాలో చేరింది. జిల్లా మంత్రులు ఇలా ఎంత మంది అధికారులతో ఆట్లాడుకుంటారు. జరుగుతున్న పరిణామాలపై లోక్‌సత్తా పార్టీ దృష్టిసారిస్తుంది. కార్యక్రమంలో లక్కరాజు శివరామారావు, యువసత్తా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పివి రమణ, కె. దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యులపై భారం

ప్రజారవాణా వ్యవస్థ మెరుగపర్చే బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉంది. రాయితీలిచ్చి ఆదుకోవాల్సింది పోయి ధరలు పెంచడం సామాన్యులపై భారం మోపడమే అవుతుంది. ప్రభుత్వం వివిధ రూపాల్లో రూ. 74 వేల కోట్ల రాయితీ ఇస్తోంది. ఇందులో 10 శాతం రవాణా వ్యవస్థకు కేటాయిస్తే గ్యాస్ ఉచితంగా ఇవ్వొచ్చు.

## కాంగ్రెస్ నాయకులు పీవీని మరిచారు

### లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబ్జీ

**మయూరికూడలి:** మాజీ ప్రధానమంత్రి దివంగత పి.వి. నరసింహరావును కాంగ్రెస్‌పార్టీ నాయకులు మరిచిపోయారు. ఆయనకు తీరని అవమానం చేశారని. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ అన్నారు. జూలై 28న మాజీ ప్రధాని

పి.వి. జయంతి సందర్భంగా లోక్‌సత్తా కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ నుంచి ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ప్రధానమంత్రిగా అనేక పదవులకు వన్నె తెచ్చిన వ్యక్తిగా ప్రపంచదేశాల్లో గుర్తింపు పొందిన పి.వి. ని నేడు కాంగ్రెస్ నాయకులు మరిచిపోయారు. నేటి నాయకులకు ఎంతసేపు ధనార్జన పైనే దృష్టి తప్ప పి.వి. వంటి నాయకులపై దృష్టి లేదు. పి.వి.పేరుతో హైదరాబాదులో స్మారక చిహ్నం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికి ఇంతవరకు ఆ ధ్యాన లేకపోవడం ఆయన్ను అవమానించడమేనన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు ఎల్.ఆర్.శివరామారావు, ఐ.అనంతలక్ష్మి, ఎం. సుభద్రాదేవి, పి.వి.రమణ, పి.శ్రీనివాసరాజు, దయానంద శర్మ, కె.డానియల్ తదితరులు పాల్గొన్నారు.



### తెలుగుదేశం పార్టీ నేతల అవగాహన రాజకీయాలను తెలుసుకోండి!

**టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యలపై లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి**

**జామి:** మంత్రి బొత్ససత్యనారాయణను ఉన్నత స్థాయికి తీసుకువచ్చింది తెలుగుదేశం పార్టీ నేతలేనని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు భీశెట్టి బాబ్జీ విమర్శించారు. కుమరాంలో జరిగిన విలేఖరుల సమావేశంలో చంద్రబాబు వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. మంత్రి బొత్సపై విరుచుకు పడే ముందు తమ పార్టీ నేతల అవగాహన రాజకీయం గురించి తెలుసుకుంటే మంచింది. చంద్రబాబు తన పర్యటనతో పార్టీని పెట్టింగ్ చేసినా ఆయన వెళ్ళిన మరుక్షణం బొత్స బ్రేకింగ్ చేస్తారు. జిల్లాలో అవగాహన రాజకీయాలు కాంగ్రెస్, దేశం నేతల మధ్య వున్న సంగతి జిల్లా ప్రజలందరికీ తెలుసు. గతంలో సత్తిబాబును డీసీసీబీలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులు పోటీ చేసిన అసెంబ్లీ స్థానాల్లో దేశం నేతలే సహకరించారని ఆరోపించారు. తన అసెంబ్లీ పరిధిలో భూకబ్జా జరిగితే ఆ స్థలాన్ని ఇప్పటి వరకు అశోక గజపతిరాజు సందర్శించలేదన్నారు. ముందుగా తన ఇళ్ళు చక్కదిద్దుకుని ఇతరులపై విమర్శలు చేయడం బాబుకు మంచిదన్నారు. దేశం నేతలు ప్రతి వ్యాపారంలోను బొత్సకు వాటాదారులుగా వుంటున్నారు. మద్యనియంత్రణ అంటూ ప్రజలను మభ్యపెట్టడం మంచిది కాదన్నారు. అసలు ఏ రకమైన మద్యం నియంత్రణ కోరుతున్నారో ప్రజలకు వివరించాం. బెల్ట్‌షాపులపై ఉద్యమిస్తున్న లోక్‌సత్తా పార్టీకి తెలుగుదేశం పార్టీకి చెందిన నేతలు ఎందుకు మద్దతు ఇవ్వలేదని. అసత్య ప్రకటనలతో ప్రజలను మోసగించొద్దన్నారు.



### డిపాజిట్ దారులను ఆదుకోవాలి

**విజయనగరం :** విజయనగరం కో-ఆపరేటివ్ బ్యాంకులో డిపాజిట్ దారులను ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. రాష్ట్రంలో ఎంతో చరిత్ర కలిగి, 96 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ బ్యాంకు ఇప్పుడు లిక్విడేషన్ స్థాయికి దిగజారడం విచారకరం. బ్యాంకు పరిస్థితిపై అధికారులను కలిసి వివరాలు సేకరించిన అనంతరం రాజకీయాలకు అతీతంగా అర్బన్ బ్యాంకు డిపాజిట్‌దారులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బ్యాంకు పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలన్నారు. డిపాజిట్‌దారుల సమస్యలను లోక్‌సత్తా అధినేత డాక్టర్ జయప్రకాష్ నారాయణ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. డిపాజిట్ దారులతో సమావేశం నిర్వహించి డిపాజిట్‌దారులంతా బ్యాంకువద్దకు రావాలని ఆయన కోరారు. అధికారులను కలిసిన వారిలో పార్టీ నాయకులు అప్పలరాజు, శివరామారావు, కోటేశ్వరరావు, డేనియల్ దయానంద్ ఉన్నారు.

### ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు నిరోధించండి

**విజయనగరం (రూరల్) :** పట్టణంలోని బొబ్బాదిపేట ప్రాథమిక పాఠశాలను ఆనుకుని ఉన్నప్రభుత్వ భూమిని కొంతమంది అధికార పార్టీకి చెందిన వ్యక్తులు పలుకుబడిని ఉపయోగించి పొజిషన్ సర్టిఫికేట్లు పొందినట్లు స్థానికులు తెలిపారు. దీంతో లోక్‌సత్తా పట్టణశాఖ ఆధ్వర్యంలో ఆక్రమణకు గురైన ఆ స్థలాన్ని పరిశీలించారు. వారి పరిశీలనలో ఆ స్థలంలో చెట్లు నరికివేసి చదును చేసినట్టు గుర్తించారు. అత్యంత విలువైన ఈ భూమిని ఆగమేఘాలపై కట్టవలసిన అవసరం ఎందుకు? దీనిపై ప్రభుత్వం యంత్రాంగం ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ స్థలాన్ని అనుకుని ఉన్న ప్రాథమిక పాఠశాలలకు కనీస వసతులు లేక, విద్యార్థులకు ఆటస్థలం లేక అవస్థలు పడుతున్న తరుణంలో భూమిని ఏ ప్రాతిపదికన కేటాయించారో తెలపాలి. ప్రభుత్వం దీనిపై వెంటనే తగిన చర్యలు తీసుకుని విలువైన ప్రభుత్వ



స్థలాన్ని రక్షించాలి, లేనిపక్షంలో ఎటువంటి పోరాటానికైనా లోక్‌సత్తా సిద్ధం. కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు పాకలపాటి శ్రీనివాసరాజు, కార్యదర్శి కె.డానియల్, ఐ.అనంతలక్ష్మీ, టి.వెంకటరావు పాల్గొన్నారు.

## అర్హులకు పింఛన్ల రద్దు అన్యాయం

**బొబ్బిలి:** అర్హులైన లబ్దిదారులకు పింఛన్లు రద్దు చేయడం అన్యాయమని లోక్‌సత్తా పార్టీ నాయకులు వేమురెడ్డి లక్ష్మీనాయుడు, గంగరాజులు అన్నారు. పింఛన్లు రద్దు చేసిన అర్హులకు వాటిని తిరిగి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అందరికి పింఛన్లు రేషన్ కార్డులు మంజూరు చేసిన పాలకులు, అధికారులు అనంతరం వాటిని రద్దు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అర్హులైన వృద్దులకు పింఛన్లు, రేషన్‌కార్డులు రద్దు చేయడం సరికాదన్నారు. ఎన్నికల ఓట్లకోసం నేతలు ఇష్టారాజ్యంగా పింఛన్లు, కార్డులు మంజూరు చేసి, ఇప్పుడు వాటిని తొలగించడం తగదన్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి రద్దు చేసిన పింఛన్లు రేషన్‌కార్డులు పునరుద్దరించాలన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు దామోదర్ రావు, సూరిబాబు, భాస్కరరావు, లక్ష్మీ పాల్గొన్నారు.

## మద్యం మహమ్మారిని తరిమి కొట్టండి

**బాడంగి :** మద్యం మత్తులో ఒళ్ళు, ఆరోగ్యాన్ని పాడుచేస్తున్న మద్యం మహమ్మారిని గ్రామం నుంచి తరిమికొట్టాలని గ్రామ ప్రజలు, మహిళలు లోక్‌సత్తా పార్టీ నాయకులు ఆధ్వర్యంలో గ్రామ వీధుల్లో శవయాత్రను నిర్వహించారు. లోక్‌సత్తా పార్టీ ఇన్‌చార్జీ దేవర ఈశ్వరరావు మాట్లాడుతూ... ప్రజలు గ్రామంలో వైన్‌షాపులను ఎత్తివేయాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం గురించే ఆలోచిస్తుందే తప్ప ప్రజల ఆరోగ్యాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ముందుగా మద్యం భూతం శవంగా బొమ్మను తయారుచేసి దానికి మద్యం బాటిళ్లను తగిలించి గ్రామంలో ఊరేగించారు. అనంతరం దహన సంస్కారాలను చేపట్టారు. గ్రామంలో మద్యం షాపును ఎత్తివేయకపోతే మరింత ఆందోళన చేపడతామని మహిళలంతా ఆవేదన వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో అలియన్స్ సంస్థ అధ్యక్షుడు రామలింగరాజు భాస్కరరావు, బొబ్బిలి లోక్‌సత్తా పార్టీ టౌన్ ప్రెసిడెంట్ యు. లక్ష్మునాయుడు, నందమూరి కొండలరావు, పి. సురేష్ కుమార్, యు. మురళీలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా జిల్లా

## కులనిర్మూలనతోనే అత్యున్నత స్థితి

### లోక్‌సత్తా జాతీయ కన్వీనర్ జయప్రకాష్‌నారాయణ్

**విజయవాడ :** ప్రపంచ దేశాల్లో భారత ఆర్థికంగా అత్యున్నత స్థితికి చేరాలంటే కులతత్వాన్ని నిర్మూలించాల్సిందే జాతి అవసరాల దృష్ట్యా కులాల్ని మట్టుబెట్టాల్సిందేనన్నారు. బెంజిసర్కిల్‌లోని వేదిక హాలులో స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ చెన్నుపాటి శేషగిరిరావు సంస్మరణ సభ ముఖ్య అతిథిగా విచ్చేసిన జేపీ ముందుగా శేషగిరిరావు చిత్రపటానికి స్మృత్యంజలి ఘటించారు. 'వ్యక్తి ఆరోగ్యం-సమాజం ఆరోగ్యం' అనే అంశంపై ప్రసంగించారు. కుల వర్గ, వైషమ్యాల వల్ల ఆర్థికంగా దేశం ఎంతో నష్టపోతుందని ఈ విషయాన్ని ప్రతి వ్యక్తి గుర్తించాలి. కుల, మత వర్గాలు ప్రాతిపదికన పార్టీలు ఏర్పాటు చేసుకొని దేశాన్ని నాశనం చేస్తున్నారు. సమాజానికి ఆలోచన. ఆర్థికశక్తి, నిజాయితీ కలిగిన వారు ఎంతో అవసరం. మద్యం అమ్మకాలు రూపేణా ప్రభుత్వానికి ఏడాదికి వస్తున్న పన్నులు రూ॥18 వేల కోట్ల వరకు వస్తున్నాయి. మద్యాన్ని, అవినీతిని మట్టు బెట్టగలిగితే దేశ పురోభివృద్ధికి దోహదం చేసినట్లే.

## రాజకీయాలను గమనించండి

**అజిత్‌సింగ్‌నగర్:** మన చుట్టూ జరుగుతున్న రాజకీయ పరిణామాలను అందరూ గమనించాలి. తద్వారా రాజకీయాలపై అవగాహన పెరుగుతుందని లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్‌నారాయణ్ అన్నారు. రాజకీయ అవగాహన ఉన్న ప్రజలు మంచి నాయకులను ఎన్నుకుంటారని అన్నారు. పాయకాపురం కండ్రిక కాలనీలో స్థానిక లోక్‌సత్తా నాయకులు బూర్ల కొండలరావు ఆధ్వర్యంలో జూలై 19న జరిగిన లోక్‌సత్తా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి జేపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించమని కార్యకర్తలు కోరగా అక్కడే ఉన్న ఓ బాలికతో కార్యాలయాన్ని ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జేపీ ప్రసంగిస్తూ నేటి రాజకీయ పరిస్థితులు, ప్రజాప్రతినిధుల తీరు, సమస్యలు, పరిష్కార మార్గాలు తదితర విషయాలను ప్రజలకు వివరించారు. కులానికి, మతాలకు, మందు, డబ్బుకు లోబడకుండా ఓట్లు వేయాలని కోరారు. పార్టీలకు కాకుండా మంచి వ్యక్తిని గెలిపించడం ద్వారా సమాజ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో కాకుండా నిరంతరం మనకు తోడుగా ఉంటూ మన సమస్యలపై పోరాడే వ్యక్తులను గెలిపించాలని కోరారు. జనంలో మార్పురావాలని ఆశించారు. *

# కృష్ణా జిల్లా పర్యటనలో జేపీ











RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12



# అసలైన ఉద్యమం

గత సంవత్సరం వరదల్లో నష్టపోయిన కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం, దక్షిణ చినవోలు లంక గ్రామాన్ని లోక్‌సత్తా పార్టీ దత్తత తీసుకొని కోడూరు కాల్వ నుండి రామచంద్రపురం గ్రామం మీదుగా ఎత్తిపోతల పథకానికి మొదటి విడతగా రూ॥ 13 లక్షలతో (మొత్తం రూ॥ 32 లక్షలు) సిమెంట్ కాల్వను ఏర్పాటు చేసి రామచంద్రపురం చెరువు వరకు పనులు పూర్తయిన మీదట పరిశీలనకు విచ్చేసిన డా॥ జయప్రకాష్ నారాయణ మరియు పార్టీ నాయకులు

From, To, **Book-Post**
PRINTED MATTER

Lok Satta Times
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad